సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి నవంబర్ సోమవారం 28 - ఆదివారం 4 డిసెంబర్, 2016 సంపుటి : 2 సంచిక 10 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

## రైతుల లావాదేవీలకు పాతనోట్లను అనుమతించాలి

### ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి డిమాండ్



**రాజధాని ప్రతినిధి, మంగళగిరి:** ప్రధాని నరేంద్రమోడి పెద్దనోట్లను రద్దు చేయటంతో వ్యవసాయరంగం పై అధారపడిన రైతులు, కూలీలు, చేతి వృత్తుల వారు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని ప్రభుత్వం తక్షణమే వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మంగళగిరి పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 500/-,రూ. 1000/-ల నోట్లను రద్దు చేయటం వలన పేదల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నోట్ల రద్దు విషయంలో సామాన్యులను దృష్టిలో పెట్టుకుని వారికి ఇబ్బందులు కలుగకుడా చర్యలు తీకుంటే బాగుండేదని అన్నారు. మోడీ అనాలోచిత నిర్ణయం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు, కూలీలు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వైద్యం చేయించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నోట్ల రద్దు వల్ల వివాహం చేసుకునే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సహకార బ్యాంకులలో పెద్ద నోట్లు తీసుకోకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, దీని ద్వారా రబీ పంటను పూర్తిగా కోల్పోయే పరిస్థితి నెలకొంటంతో ఆహార భద్రతకు ముప్పు వాటిల్లేప్రమాదముందన్నారు. విత్తనాలకు, పురుగుమందులు, ఎరువుల సరఫరాకు పాతనోట్లను అనుమతించాలని, సహకార బ్యాంకులతో పాటు మిగిలిన బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేసి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలన్నారు. రవాణా వ్యవస్థలో సామాన్యులు ప్రయాణించే ఆర్.టి.సి. బస్సులలో టోల్ ఫీజు రద్దు చేయాలని, దీని వల్ల ప్రయాణికులకు భారం తగ్గడంతో పాటు ఆర్టీసి మెరుగుపడుతుందని అన్నారు. సామాన్యుల కష్టాలను పరిగణలోకి తీసుకుని తక్షణమే నోట్ల రద్దు మినహాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# పట్టిసీమ పరవళ్లు



**హైదరాబాద్ :** కృష్ణమ్మను కలిసేందుకు గోదారమ్మ పరుగులు పెడుతోంది. కృష్ణా డెల్టాకు తాగు, సాగు నీటి అవసరాలను తీర్చేందుకు పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి నీరు పరవళ్లు తొక్కుతోంది. మొత్తం 24 పంపులలో 23 పంపుల ద్వారా రోజుకు 8.142 క్యూసెక్కుల నీటిని పోలవరం కుడి ప్రధాన కాలువలోకి ఎత్తిపోస్తున్నారు. ఇప్పటి వరకూ 49.5248 టీఎంసీలను పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు తరలించారు. గోదావరిలో నీళ్లున్నా గతంలో వాటిని సద్వినియోగం చేసుకోకపోవడంతో ఏటా 3000 టీఎంసీలను సముద్రంలోకి వదిలేసేవారు. ఇప్పుడు ఆ నీటిని పట్టిసీమ ద్వారా పశ్చిమగోదావరి జిల్లాలోని ఎగువ ప్రాంతాలకూ, కృష్ణా డెల్టాకు అందిస్తున్నారు. తాగునీటి కష్టాలు తీర్చేందుకు వీలుగా కాలువకు సమీపంలోని చెరువులను నింపుతున్నారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ పోలవరం కుడి ప్రధాన కాలువలో జలాలు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుండడంతో కృష్ణా డెల్టా రైతుల్లో ఆనందం కన్పిస్తోంది. పట్టిసీమ పథకం నదుల అనుసంధానానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తుందని ఇటీవల సమీక్షలో కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఉమాభారతి పేర్కొన్నారు. ఈ పథకం వివరాలను పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్య కార్యదర్శి ఆర్కే గుప్తా కేంద్ర మంత్రికి వివరించడంతో పైవిధంగా స్పందించారు. ఈ సమాచారం తెలుసుకున్న మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, ఛత్తీసగఢ్ సీఎం రమణసింగ్.. తమ రాష్ట్రంలోనూ అంతర్గత నదుల అనుసంధానానికి పట్టిసీమను ఉదాహరణగా తీసుకుందాము.. ఆయా రాష్ట్రాల జల వనరుల శాఖ ఉన్నతాధికారులతో చెప్పారు. ఈ రాష్ట్రాల ఉన్నతాధికారులు త్వరలోనే పట్టిసీమను పరిశీలించే అవకాశం ఉంది.

## రెండున్నరేళ్లలో పైసావిదల్చని సీఎం



సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ ఎమ్మెల్యేలు

### వైసీపీ ఎమ్మెల్యేల ధ్వజం

**రాజధాని, ప్రతినిధి :** రెండున్నరేళ్లలో టీడీపీ ప్రభుత్వం ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలకు ఒక్క రూపాయి కూడా నిధులివ్వలేదని పెద్ది రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జుల పేరుమీద జీవోలు జారీ చేస్తున్నారు, ఇది ప్రజా స్వామ్యంలో మంచి పద్దతి కాదని సీఎం కు తెలిపామన్నారు. చిత్తూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి టీడీపీలో చేరినందున11.5 కోట్ల పనులు కేటాయించడంతో పాటు భారీ స్థాయిలో ఫించన్లు కూడా మంజూరు చేశారనీ, ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని నష్టం అన్నారు. పెద్దనోట్ల రద్దుతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ప్రభుత్వం తరపున రాయితీలు ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పెద్ది రెడ్డి రామాచంద్రారెడ్డి చెప్పారు. విజయవాడ సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబును వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు శుక్రవారం కలసి నోట్ల రద్దుపై సామాన్యులకు కలుగుతున్న ఇబ్బందులు, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, నియోజకవర్గాల అభివృద్ధి నిధులు ఎమ్మెల్యే ద్వారా ఖర్చు చేయాలని కోరుతూ సీఎంకు ఓ లేఖను సమర్పించారు. బిల్లులు వాయిదా వేయడంతో పాటు రైతులకు మంజూరు చేసే రుణాలను 100 నోట్లలో ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ అధికారాన్ని ఉపయోగించి బ్యాంకర్లతో రుణాలు ఇప్పించాలని సీఎంకు సూచించామని విలేకర్ల సమావేశంలో తెలిపారు.

గతంలో తొమ్మిదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా గౌరవం ఇచ్చారని, ఇప్పుడు నియంతృత్వంగా వ్యవహరిస్తున్న విషయం ఆయనకు తెలిపామన్నారు. న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు బాబుకు బుద్ధి చెబుతారని పెద్ది రెడ్డి విమర్శించారు. స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి సీఎం క్యాంప్ వరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు పాదయాత్ర నిర్వహించారు.

## రాష్ట్ర ఖజానా ఖాళీ అయింది



**మంత్రి యనమల**

**రాజధాని, ప్రతినిధి, గుంటూరు:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. శనివారం ఎన్జీవో భవన్‌లో జరిగిన వాణిజ్య పన్నుల శాఖ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, ఏపీ 24 వేల కోట్లు అప్పులో ఉంది.. అర్థం చేసుకోవాలని ఉద్యోగులను మంత్రి కోరారు. ఎమ్మెల్యేల జీతాల పెంపు ప్రతిపాదనను కూడా తిరస్కరించామని ఆయన అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరిస్తామని యనమల తెలిపారు.

## విప్లవ యోధుడు ఫెడల్ క్యాస్ట్రో మృతి



**హవానా :** క్యూబా మాజీ అధ్యక్షుడు ఫెడల్ క్యాస్ట్రో(90) కన్నుమూశారు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 10:30కు(భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 9గంటలకు) కన్నుమూశారు. ఫెడెల్ సోదరుడు, ప్రస్తుత క్యూబా అధ్యక్షుడు రౌల్ క్యాస్ట్రో ఈ విషయాన్ని జాతీయ మీడియా ద్వారా ప్రపంచానికి తెలియజేశారు. ఫెడల్ మరణం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులను, కమ్యూనిస్టు నేతలను కుంగదీసింది.

## ఏపీలో లక్షా 42 వేల ఉద్యోగాలు ఖాళీ



మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతోందని మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న చంద్రబాబు ఎన్నికల హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఏపీలో లక్షా 42 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. బాబు కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా.. ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతుల పిల్లలకు ఇస్తామన్న ఉద్యోగాలు ఏమయ్యాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కన్సల్టెన్సీలకు లక్షల్లో జీతాలు ఇస్తున్నారని.. ఆ అంశంపై హైకోర్టులో పిటిషన్ వేస్తామని నాదేండ్ల వెల్లడించారు.

వివరాలు 2లో...




ఆంధ్రా బ్యాంక్ ఎదుట ధర్నా

వివరాలు 3లో...



ఇద్దరూ.. ఇద్దరే

వివరాలు 4లో...



పెందలకడనే తినడం కుదరనప్పుడు ఏమి చెయ్యాలి?

వివరాలు 7లో...



రూ.5కోట్ల బంగారు లెహంగా...

వివరాలు 8లో...



నోటుకు కటకట...!

## ఈవారం రాజధాని

- అమరావతి ఏపీ విశ్వవిద్యాలయానికి ఏర్పాట్లుకు ఆహ్వానం : సీఆర్‌డీఏ
- 'అనంత ఎక్స్‌ప్రెస్ వే'కు 6 నెలల్లో భూ సేకరణ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 4 నుంచి ఉద్యానవన డిగ్రీ కోర్సులకు కౌన్సెలింగ్ : వర్సిటీ రిజిస్ట్రార్ టీవీ సత్యనారాయణ
- సచివాలయ దారుల్లో సీసీ కెమెరాలు
- 1న బేతపూడిలో ప్రజాభిప్రాయ సేకరణ : డిప్యూటీ కలెక్టర్ రఘునాథ్‌రెడ్డి
- 27న గుంటూరులో ముస్లింల ఆత్మీయసమ్మేళనంలో పాల్గొన నటుడు ఆలి
- రాష్ట్రంలో 100 ఎన్టీఆర్ క్యాంటీన్లు ఏర్పాటు
- అమరావతిలో పెట్టుబడులకు జాతీయ, అంతర్జాతీయ సంఘాలు సిద్ధం : సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్
- ఏపీలో పేదలకు ఉచిత ఫోన్లు
- ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ అందచేస్తాం : డిప్యూటీ సీఎం కే.ఈ.కృష్ణమూర్తి

### సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ అవగాహన సమావేశం

**రాజధాని ప్రతినిధి, రాయపూడి :** రాయపూడిలో సీఆర్‌డీఏ అధికారులు గృహ నిర్మాణం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు పలు సమస్యలను పరిష్కరింవలసినదిగా అధికారులను కోరారు. పూర్వం నిర్మించిన ఒక అంతస్థు భవనాలకు రెండవ అంతస్థు నిర్మించుటకు ప్లాను అనుమతి ఇప్పించాలనీ, పాత గ్రామ కంఠమునకు ప్రక్కన ఉన్న ఇళ్ల స్థలములకు ప్లాన్ అనుమతించాలని, ఇప్పటికే అనుమతి లేని భవనాలకు పర్మిషన్లు ఇప్పించమన్నారు. నిర్మాణమునకు కావలసిన కొలతలను బుక్‌లెట్ రూపంలో ఇప్పించాలని అధికారులను కోరారు. పూర్వికుల ద్వారా సంక్రమించిన ఆస్తులకు ఇంటిపన్ను రసీదు ఆధారంగా అనుమతులు మంజూరు చేయాలన్నారు. అలాగే ఒక సెంటు స్థలం ఉన్న వ్యక్తులకు సెట్ బ్యాక్ కొలతలు లేకుండా పర్మిషన్లు ఇవ్వాలని, పూర్వ ప్రభుత్వం మంజూరు చేసిన డి, బి ఫారం, హౌసింగ్‌లో ఇచ్చిన ఇళ్లకు కూడా కొత్త నిర్మాణాలు

- మిగతా 3 లో...

## కోటేశ్వరరావు సేవలు మరువలేనివి

### మంగళగిరి టి.డి.పి. నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవి



వర్థంతి సభలో ప్రసంగిస్తున్న గంజి చిరంజీవి

**రాజధాని ప్రతినిది-మంగళగిరి:** మాజీ మంత్రి స్వర్గీయ డా॥ ఎమ్.ఎస్.ఎస్.కోటేశ్వరరావు మంగళగిరి పట్టణ అభివృద్ధికి కృషి చేశారని, ప్రజల సమస్యలను పరిష్కరించారని ఆయన చేసిన సేవలు మరువలేనివని మంగళగిరి టి.డి.పి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవి అన్నారు. డా॥ ఎమ్.ఎస్.ఎస్. కోటేశ్వరరావు 15వ వర్ధంతి సభ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయం డా॥ ఎమ్.ఎస్.ఎస్. భవన్‌లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా టి.డి.పి కార్యాలయం నుండి ఊరేగింపుగా బయలు దేరి ఆర్.టి.సి. బస్టాండ్ వద్ద వున్న ఎమ్.ఎస్.ఎస్.కోటేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జరిగిన సభకు పట్టణ పార్టీ అధ్యక్షులు నందం అబద్దయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా టి.డి.పి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవి ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఎమ్.ఎస్.ఎస్. కోటేశ్వరరావు సేవల గురించి సభలో ప్రసంగించారు. ఈకార్యక్రమంలో టి.డి.పి జిల్లా అధికార ప్రతినిధి వల్లభనేని సాయిప్రసాద్, జడ్.పి.టి.సి. ఆకుల జయసత్య,మంగళగిరి రూరల్, తాడేపల్లి, దుగ్గిరాల అధ్యక్షులు చావలి ఉల్లయ్య, ఇట్టా పెంచలయ్య, శ్రీధర, చేనేతవిభాగం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు,మార్కెట్ యార్డు చైరపర్సన్,ఆరుద్ర భూలక్ష్మి, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ మన్నెం రమేష్, బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదరి కోనంకి శ్రీనివాసరావు, వెలగపాటి విలియం, బెజ్జం రామకృష్ణ, వైస్‌చైర్మన్ సంకా బాలాజిగుప్తా, పోలుమట్ల ప్రేమ్‌కుమార్, గోవాడ రవి, గోవాడ దుర్గారావు,ముశం రవికుమార్, వాకా మాదవరావు, తదితరులు పాల్గొన్నారు.

### అంజుమన్‌కు ఎన్నికలు నిర్వహించండి : చాంద్‌బాషా

#### లేదంటే ఆమరణ నిరాహార దీక్ష




**రాజధానిప్రతినిధి, గుంటూరు :** పట్టణంలోని అంజుమన్ ఇ ఇస్లామియాకు 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ఆంధ్రప్రదేశ్ పంచాయితీ అధ్యక్షుడు షేక్ చాంద్‌భాషా హెచ్చరించారు. గుంటూరు పట్టణ ప్రజలకోసం ఎన్నికలు జరిపి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండు చేశారు. పదేళ్ల నుంచి ఎన్నికలు జరపకుండా వక్ఫ్‌బోర్డు ఆధీనంలో నడుస్తోందని, అంజుమన్-ఇ- ఇస్లామియాకు ఎన్నికలు జరిపితే దాని ద్వారా వచ్చే ఆదాయం పేద ముస్లింల అభ్యున్నతికి తోడ్పడుతుందన్నారు. ఎన్నికలు జరిపితే అంజుమన్ ఆస్తులు రక్షించవచ్చని, ఇప్పటి వరకు ఒక్క సంక్షేమ కార్యక్రమం కూడా అంజుమన్ ఇ- ఇస్లామియా చేయలేదన్నారు.

## అంతంత మాత్రంగా రాజధాని రోడ్లు



**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** విజయవాడ నుంచి వెలగపూడి సచివాలయం రావాలన్నా.. అమరావతి వెళ్లాలన్నా ఉన్నది రెండే దారులు. ఒకటి బస్సురూటు కాగా, మరొకటి కరకట్టరోడ్డు. ప్రభుత్వం యుద్ధప్రాతిపధికన రోడ్లు నిర్మించినప్పటికీ కృష్ణాయపాలెం నుంచి పెనుమాక వరకు సింగిల్ రోడ్డు ఉడటం అదీ గోతుల మయం కావడంతో ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కరకట్టరోడ్డులో ద్విచక్ర వాహనాలు, కార్లు తాకిడి విపరీతంగా పెరిగింది. ఎదురెదురుగా వస్తున్నప్పుడు కొన్ని చోట్ల మార్జిన్ లేకపోవడంతో వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు. ముఖ్యమంత్రి అతిధిగృహం వరకు మాత్రమే రోడ్లకిరువైపులా విద్యుద్ దీపాలు అమర్చారు. ఆపై అంతా చీకటే.. తాళ్లాయపాలెం శైవక్షేత్రం వద్ద నాలుగు రోడ్ల కూడలిలో ఒకే సమయంలో కరకట్టపైకి వస్తున్న వాహనాలు ఢీకొట్టుకుంటున్నాయి. చంద్రబాబు హయాంలో రోడ్ల నిర్మాణాలు జరిగినా ప్రజావసరాలకు తగినంతగా అభివృద్ధి చెందలేదనేది నిర్వివాదాంశం. సీడ్ యాక్సెస్‌రోడ్డు నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఏదిఏమైనా రాజధాని ప్రాంతంలో యుద్ధప్రాతిపదికను రోడ్లను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.



రాజధాని వార్తలు
కలం

# ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యవసరంగా ఆక్సిజన్ ఎక్కించండి

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యవసరంగా ఆక్సిజన్ ఎక్కించాలి. ఎందుకంటే అవి చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్నాయి. మూడురోజుల క్రితం అనంతపురం ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంతో కనీసం స్ట్రెచ్చర్ కూడా లేక ఒక మహిళ తన భర్తను పరీక్షల నిమిత్తం నాలుగో అంతస్థుకు ర్యాంపుపై లాక్కెళ్లటం చూపరులను కంటతడి పెట్టించింది.

గుంటూరు ఆసుపత్రిలో ఎలుకలు కొరికి నవజాత శిశువు చనిపోతే, ఎలుకలు పట్టుకుంటానికి పెట్టిన బోనులో పాములు పడ్డాయి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులు ఎంత దారుణమైన పరిస్థితిల్లో ఉన్నాయో అర్థం అవుతుంది. అక్కడ డ్రైనేజ్ వ్యవస్థ సరిలేదు. దోమలు,ఈగలు, బొద్ధింకలు, క్రిములు, కీటకాలు ఒకటేమిటి మనిషి మరింత రోగగ్రస్తమవడానికి అన్ని వసతులు ఉన్నాయక్కడ.. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల కెళితే మరిన్ని రోగాల బారిన పడతామనడంలో సందేహం లేదు. ఆసుపత్రిలోని స్కానింగ్‌లు, ఎక్స్‌రేలు అసలు పనిచేయవు. దాతలెవరైనా ముందుకొచ్చి వాటిని బాగుచేయించినా రెండో రోజుకే అవి మళ్లీ పాడవుతాయి. దీంతో సదరు టెక్నీషియన్ ప్రక్కన ఉన్న స్కానింగ్ సెంటరుకు వెళ్లి పరీక్ష చేయించుకోవాల్సిందిగా సలహా ఇస్తాడు. నిజానికి సదరు స్కానింగ్ సెంటరు యజమానికి, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి మధ్య ఆర్థిక వ్యవహారాలుంటాయన్నది జగమెరిగిన సత్యం...డాక్టర్లు, ఇతర సిబ్బంది రోగులతో పెడసరంగా వ్యవహరిస్తారు. వారికి సరైన సలహాలు, ఆసుపత్రి విభాగాల గురించి చెప్పే రిసెప్షనిస్టులు ఇక్కడ కనిపించరు. డాక్టర్ల నుంచి తోటీల వరకు జీతాలపై ఉన్న శ్రద్ధ సేవాలపై ఉండక పోవడమే కారణం... ఇవి చాలవా ఆసుపత్రుల నిర్వహణ ఎంత దారుణంగా ఉందో తెలియడానికి ?

గత ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అని ప్రకటించినప్పటి నుంచి వీధివీధికీ కార్పొరేట్ ఆసుపత్రులు పెరుగుతున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులు మురికి కూపాలుగా మారుతున్నాయి. ప్రజలకు కార్పొరేట్ సేవలంటూ ఏడాదికి నిర్ణీత రోగాలకు అయ్యే ఖర్చును ప్రభుత్వాలు భరిస్తున్నాయి. జీవితంలో ఒక్కసారి మాత్రమే ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రుల ద్వారా పేదవారికి వైద్యసదుపాయాలందిస్తోంది. మరొకసారి ఏదైన అత్యవసర పరిస్థితులు తలెత్తితే కార్పొరేట్ ఆసుపత్రులు సదరు రోగికి ఉచిత వైద్యం అందించదు. తప్పనిసరిగా సొంత డబ్బుతోనే చికిత్సతీసుకోవాల్సి ఉంటుంది. ఏడాదికి ప్రభుత్వ ఆరోగ్యం కోసం విడుదల చేసే నిధులతో ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తే ఖరీదైన వైద్యాన్ని పేద, మధ్య తరగతి రోగులకు ఉచితంగా అందించవచ్చు. దీంతో సమాజం ఆరోగ్యంతో విలసిల్లుతుంది. ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణను అసహ్యించుకొనే మధ్యతరగతి రోగులు కార్పొరేట్ ఆసుపత్రుల వద్ద మోసపోనక్కర్లేదు. ఒక మందు బిళ్లతో పోయే రోగానికి అప్పటికప్పుడు ఐసీయూలో చేర్చాలంటూ వేలు గుంజుతూ ప్రజల్ని బికారులు చేసే అవకాశం వారికివ్వకూడదు. కార్పొరేట్ సంస్థలకు ప్రజల డబ్బును ధారాదత్తం చేయడం క్షమించరాని నేరం... ఒక్కో వైద్యవిద్యార్థిని ప్రజాధనంతో చదివించి వారి సేవలను ప్రజలకు అందించకుండా బడా సంస్థలకు ఉపయోగించడం కూడా అవినీతేనని ప్రభుత్వం గుర్తించాలి.. మూడు రోజుల క్రితం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి కామినేని శ్రీనివాసరావు ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యాన్ని సహించలేకపోయారు. బయోమెట్రిక్ ప్రవేశపెట్టినా మేనేజ్ చేస్తూ గైర్హాజరవుతున్నారని, అందరి నిఘా నివేదికలు ఆయన దగ్గర ఉన్నాయని పద్ధతులు మార్చుకోకపోతే ఇంటికి పంపుతానని హెచ్చరించడం గుర్తించదగిన అంశం. ప్రభుత్వ ఆసుపత్రులపై సరైన నిఘా కొరవడటం, అనేక రాజకీయాలు చోటు చేసుకోవడంతో ఆసుపత్రులు రోగాలతో మంచాన పడిఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వాటికి అత్యవసర చికిత్స అందించాలి. ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత నిచ్చి, కార్పొరేట్ ఆసుపత్రులపై మమకారాన్ని వదుల్చుకోవాలి.

# ఆర్థిక పరిస్థితి స్థిరీకరణకే పెద్దనోట్లు రద్దు

**కేంద్ర మాజీమంత్రి బి.జె.పి.నేత కావూరు సాంబశివరావు**

**రాజధాని ప్రతినిధి,కొయ్యలగూడెం ,అన్నంరెడ్డి సుబ్బారావు :** కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం రైతుల కోసం, వ్యవసాయాభివృద్ధి కోసం ఎన్నోమంచి పథకాలు అమలు పరుస్తోందని కేంద్ర మాజీమంత్రి బి.జె.పి.నాయకుడు కావూరి సాంబశివరావు అన్నారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించే బి.జె.పి.రైతు మహాసభ నేపథ్యంలో కొయ్యలగూడెంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన పోలవరం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పోలవరం నియోజకవర్గం పార్టీ కన్వీనర్ ఎం.వి.కృష్ణారావు అధ్యక్షత వహించారు. 1000/- రూపాయలు 500/- రూపాయల కరెన్సీ నోట్లు రద్దును ప్రతిపక్షాలు రాద్ధాంతం చేసి ప్రజలను తప్పు దోవ పట్టించటానికి ప్రయత్నిస్తున్నాయని కావూరిపేర్కొన్నారు. పెద్దకరన్సీ నోట్లు రద్దులో అక్రమార్కులు కూడబెట్టి దాచుకున్న లక్షల కోట్ల రూపాయలు నల్లధనం బహిర్గతం కావాలన్న ఉద్దేశంతోనే పెద్దకరెన్సీ నోట్లను దేశ ప్రయోజనాలకోసం ప్రధాని మోదీరద్దు చేసారని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో సాధారణ, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, సమస్యలు తాత్కాలికమేనని ఆయన పేర్కొన్నారు. బి.జె.పి కేంద్ర పరిశీలకుడు పాశం రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వటంపై ప్రతిపక్షాలు విమర్శలు అర్చరహితమని ఆయన అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బి.వర్మ, బి.జె.పి.ఐ.టి. విభాగం అధ్యక్షులు బి.జె.పి.ఐ.టి.విభాగం అధ్యక్షుడు గణపతిరాజు, అమ్ములమర, మహిళామెచ్చ రాష్ట్రప్రధాని కార్యదర్శి బొర్లిన నిర్మలాకిశోర్, జిల్లా అధ్యక్షురాలు ఎస్. ఆర్.ఆర్. సుభద్రాదేవి, మండలపార్టీ అధ్యక్షుడు కట్టాసత్యనారాయణ, మోర్చమండల అధ్యక్షడు చిట్టికినరమేష్ మద్ది ఆంజనేయస్వాలు ఆలయ పాలకమండలి సభ్యులు మంతెన పాపరాజు, సరియంరామలక్ష్మి,గంగాభరరావు తదితరులు పాల్గొన్నారు.




# ఆంధ్రా బ్యాంక్ ఎదుట ధర్నా



**నోట్ల రద్దుకు నిరసనగా ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు**

- మోడీపై కేసు నమోదు చేయాలి
- సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్

**రాజధాని ప్రతినిది-మంగళగిరి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడి వెయ్యి రూపాయలు,రూ.500/-ల నోట్లను రద్దు చేసి అనేక మంది పేదల ప్రాణాలను బలిగొన్నాడని నరేంద్రమోడీపై హత్యానేరం కేసు నమోదు చేయాలని సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళగిరిలో సోమవారం మంగళగిరి సి.పి.ఐ. పార్టీ ఆద్వర్యంలో రూ.500/-, 1000/- నోట్ల రద్దు చేసి రూ.2000/-ల నోట్లను విడుదల చేయటాన్ని నిరసిస్తూ పట్టణంలో ర్యాలీని, ధర్నాను చేశారు. ఈ ర్యాలి సి.పి.ఐ. కార్యాలయం నుండి ఆంధ్రాబ్యాంకు వరకు కొనసాగింది. ఆంధ్రా బ్యాంక్‌లో నిరసనను వ్యక్తం చేశారు. బ్యాంకుకు వచ్చిన ఖాతా దారులకు సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ నరేంద్ర మోడి చేసిన మోసాన్ని వివరించారు. అనంతరం బ్యాంక్ ముందు ధర్నాను చేశారు. ఈ సందర్భంగా జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడి దేశంలో నల్ల కుబేరులపై చర్యలు తీసుకోకుండా రూ.500/-, 1000/- నోట్లను రద్దు చేసి పేద, మధ్య తరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తాడన్నారు. ఇప్పుడు రూ.2000/-ల నోట్లను విడుదల చేసి పేద వారికి చిల్లర అందుబాటులో లేకుండా చేశాడని బ్యాంకులు వద్ద పడిగాపులు కాయవలసి వచ్చిన పరిస్థితి దాపురించిందని అన్నారు. ఎ.టి.ఎం.ల వద్ద క్యూలో నిలబడి కాల్లు వాచే దాకా ఖాతాదారులు నిలబడుతున్నారని ఎ.టి.ఎం.లు కూడా పనిచేసే పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. అయితే మోడి అంబానీని గాని, నల్లకుబేరులు గాని,బడాబాబులెవరు బ్యాంకులో క్యూలో నిలబడలేదని అన్నారు. వారిని క్యూలో నిలబెట్టే దమ్ము మోడీకి లేదని అన్నారు. ఇప్పటికే నోట్ల రద్దుతో 50 మంది వరకు చనిపోయారని అన్నారు. రూ.2000/- లనోట్ల కు చిల్లర దొరకక ప్రజలు నానా కష్టాలు పడుతున్నారని అన్నారు.పెద్ద నోట్ల రద్దు కారణంగా సామాన్యులు పడుతున్న ఇబ్బందులపై రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరసనలకు ప్రజలందరు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ. నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, పిల్లలమర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, చినకాకాని గ్రామ సర్పంచ్ కుక్కమళ్ళ నాగేశ్వరరావు, తాడేపల్లి సహాయ కార్యదర్శి తుడిమెళ్ల వెంకటయ్య, సి.పి.ఐ. సీనియర్ నాయకులు ఉడతా వెంకటేశ్వరరావు, షేక్.దస్తగిరి, ఉయ్యాల సత్యన్నారాయణ,గంజి వెంకటేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు,గంజి శ్రీనివాసరావు, రామయ్య, మర్రి సాంబశివరావు, విజయ్‌కుమార్ బుల్లా ఇస్మాయిల్ ,గౌహర్ జాని తదితరులు పాల్గొన్నారు.

# రాయపూడిలో క్రిస్మస్ సందడి ప్రారంభం



**రాజధాని ప్రతినిధి,రాయపూడి :** నెల ముందే గ్రామాల్లో క్రిస్మస్ పండుగ సంబరాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి అన్ని గ్రామాలల్లోని చర్చిల వద్ద క్రిస్మస్ నక్షత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజు వేకువ జాము నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రీస్తు పుట్టిన రోజును పురస్కరించుకొని నెల రోజుల ముందు నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దీనికి ముందుగా లూర్థుమాత దేవాలయం యూత్ వారు క్రిస్మస్‌స్టార్‌ని సిద్ధంచేశారు. లూర్థుమాత యూత్ నందూరి. కిషోర్, కలపాల. బుజ్జి, ఇసుకపల్లి.బాబు, భగవంతుడు, చిలక. వినోద్, కంభంపాటి. మదార్, కంభంపాటి. సురేష్, ఉన్నాం. చంటి, కంభంపాటి. నానిలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

# లంచాధికారి పట్టివేత

**ఏపీ సచివాలయంలో బోణి**

**రాజధాని ప్రతినిధి - విజయవాడ :** వెలగపూడి సచివాలయంలో మొదటిసారి ఓ అధికారి ఏసీబీకి చిక్కాడు. వెలగపూడి సచివాలయంలో తొలి ఏసీబీ ట్రాప్ జరిగింది. హోంశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీనాథ్ రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. అధికారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విభజన తర్వాత హైదరాబాద్ నుంచి ఉద్యోగులు వెలగపూడికి చేరుకున్నారు. ఇప్పుడిప్పుడే సచివాలయంలో పరిపాలన కొనసాగుతోంది. సీఎం చంద్రబాబు సచివాలయం నుంచే విధులు నిర్వహించనున్నారు.

# మంగళగిరి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ టీడిపిలో చేరిక

**రాజధాని ప్రతినిధి-మంగళగిరి:** పట్టణంలోని 23 వ వార్డు వై.సి.పి. కౌన్సిలర్ మద్దిరాల జ్యోతి తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ లో రెండవ వార్డు, ఐదవ వార్డు కి చెందిన కౌన్సిలర్‌లు రంగిశెట్టి నరేంద్ర, నల్లగొర్ల శ్రీనివాసరావు(బుల్లబ్బాయి) టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అదేబాటలో 23 వ వార్డు వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ కి చెందిన కౌన్సిలర్ మద్దిరాల జ్యోతి,భర్త రమేష్ లు గురువారం రేపల్లెలో జరిగిన జనచైతన్య యాత్రలో హాజరైన మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు,సమక్షంలో జిల్లా టిడిపి అధికార ప్రతినిధి వల్లభనేని సాయిప్రసాద్, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సతీమణి గంజి రాద, టిడిపి చేనేత విభాగం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు,పట్టణ అధ్యక్షులు నందం అబద్దయ్యల ఆద్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. దీనితో మంగళగిరి తెలుగుదేశంపార్టీ కౌన్సిల్‌లో బలం చేకూరింది.కౌన్సిల్‌లో వై.సి.పి. 5గురు మాత్రమే ఉన్నారు. వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీకి చెందిన మరికొందరు కౌన్సిలర్‌లు కూడా టిడిపిలో చేరబోతున్నట్లు ఊహాగానాలు వస్తున్నాయి.


**పత్తిపాటి పుల్లారావు సమక్షంలో టీడీపీలో చేరిన మద్దిరాల జ్యోతి**


**విజయవాడలో నల్లధనంపై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఛాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, సభ్యులు**

# మండలస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక



**రాజధాని ప్రతినిధి, రాయపూడి :** రాయపూడి శ్రీకృష్ణ దేవరాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఆటల పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఖో..ఖో, కబడీ,వాలీబాల్, అథ్లెటిక్స్‌లకు 30 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేశామని పీఈటీ ఉపాధ్యాయుడు సాంబశివరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



**ప్రౌడ్ సంస్థ సయ్యద్ నాగుర్ అహ్మద్‌ను విశిష్టసేవల అవార్డుతో సత్కరించింది. ముస్లింల చరిత్ర గురించి తను రాసిన అస్తకాల, సేవల గుర్తించి ఈ నెల 19న అవార్డు ప్రధానం చేశారు.**


**అంజుమన్ - ఇ - ఇస్లామియా సంస్థ అధ్యక్షుడిగా యం.ఎ. ఖాదర్, ప్రధానకార్యదర్శి లాయర్ యస్.ఎ. బాషా, ఉపాధ్యక్షుడిగా రజాక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.**

# ప్రజాప్రతినిధుల పట్ల నిర్లక్ష్య వైఖిరి...

- అభివృద్ధి పనుల నిర్వహిణ, నాణ్యతల పట్ల అలసత్వం.
- మండల పరిషత్ సమావేశంలో ఎం.పి.పి, జడ్.పి. చైర్మన్ పర్సన్, ఎం.పి.టి.సి.ల ఆగ్రహం

**అన్నంరెడ్డి సుబ్బారావు రాజధాని ప్రతినిధి, కొయ్యలగూడెం :** కొయ్యలగూడెంలో మండంలో పనిచేస్తున్న కొన్నిశాఖల అధికారులకు అభివృద్ధి పనులు నిర్వహణ, నాణ్యతల పట్ల శ్రద్ధ కనిపిచటంలేదని, వారిలో అలసత్వం పేరుకుపోయిందని, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ నెల 22న జరిగిన కొయ్యలగూడెం మండల పరిషత్ సమావేశం ఎం.పి.పి. అయినపర్తిచందన శ్రీదేవి జడ్.పి. ఉపాధ్యక్షురాలు చింతల వెంకట రమణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పారేపల్లి శ్రీనివాసరావు సహా పలువురు ఎం.పి.టి.సి. సభ్యులు తీవ్ర ఆగ్రహాన్ని అసంతృప్తిని వ్యక్తం చేసారు. గ్రామాలలొ అమలు జరిగే స్వచ్ఛభారత్ కార్యక్రమాలను ఎం.పి.టి.సి. సభ్యులకు తెలియపరచటంలేదని, గ్రామపంచాయితీ పాలక వర్గ సమావేశాలకు కూడా ఎం.పి.టి.సి. లను పిలవటంలేని ఈ విషయమై పంచాయితీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించటం బాధ్యతారాహిత్యంమవుతుందని ఎం.పి.పి చందనశ్రీదేవి, పలువురు ఎం.పి.టి.సి. సభ్యులు ఆగ్రహించారు. ఈ పరిస్థితి పట్ల నిర్లక్ష్యం వహించిన కార్యదర్శులు పట్ల ఏమిచర్యలు తీసుకుంటారోచెప్పాలని ఇ.ఓ.ఆర్.పి. సత్యానారాయణను నిలదీసారు. బోడిగూడెం పంచాయితీలో సి.సి. రోడ్లు ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకంపై ప్రజాప్రతినిధుల పేర్లు వ్రాయించడంలో ప్రొటోకాల్‌ను పాటించక పోవటంపట్ల మండల ఆర్.ఎ.ఇ. పాండురంగారావుపై ఎం.పి.పి.తో సహ ఎం.పి.టి.సి. సభ్యులందరూ తీవ్ర ఆగ్రహంతో ధ్వజమెత్తారు. ఆ శిలాఫలకాన్ని తక్షణం తొలగించాలని ఎం.పి.పి., పి.ఆర్. ఎ.ఇ.ని. ఆదేశించారు. యర్రంపేటలోని సి.సి. రోడ్డు నిర్మించిన చోటుకు, శిలాఫలకం పై పేర్కొన్న పేర్లకు పొంతనలేదని. స్థానిక ఎం.పి.టి.సి. నిలదీశారు. సి.సి. రోడ్లునిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల పట్ల ఎ.ఇ. కనీసం శ్రద్ధ వహించటంలేదని, సిమెంటు రోడ్లు పట్టిష్టత మూణాళ్ల ముచ్చటగానే కనిపిస్తోందని ఆగ్రహవేశాలు వ్యక్తమయ్యాయి. సీతయ్యకట్టు పేర్రాజుకట్టు సాగు నీటి పథకాలకు అమర్చిన స్లూళ్లతలుపులు భారీవర్షాలు, వరదలకు కొట్టుకుపోయినా ఇరిగేషన్, అధికారులు కనెత్తిచూడటంలేదని, తలుపులు లేక చెరువులలో నీరంతా దిగువకు వెళ్లిపోయిందని కన్నాపురానికి చెందిన మండంలపరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఎస్.బాజీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. దానిపై ఎం.పి.పి. చందన శ్రీదేవి ఎం.పి.డి.ఓ. ఎం.రాజును కలుగచేసుకొని తక్షణం వెళ్ళి చెరుల స్లూళ్ల తలుపులను పరిశీలించి మరమ్మత్తులు చేపట్టాలని ఇరిగేషన్ ఎ.ఇ.భాస్కర్‌రావు, ఆదేశించారు. మండలంలో అమలు జరుగుతున్న అభివృద్ధి పథకాలు సంక్షేమకార్యక్రమాల గురించి. ఎమ్మెల్యే మండలంలో పర్యటనకు వచ్చినప్పుడే తమకు తెలుస్తున్నాయని ఎమ్మెల్యే రాకపోతే ఏవిషయాలు గురించి సభ్యులు అసంతృప్తి వెళ్లగక్కారు. అధికారులు తమ పద్దతులు మార్చుకొని బాధ్యతలు తెలుసుకొని వ్యవహరించాలని ఎం.పి.పి., జడ్.పి. ఉపాధ్యక్షురాలు ఎ.ఎం.పి. చైర్మన్‌లు కోరారు. తహశీల్దాదారు ఎ.కృష్ణజ్యోతి రెవెన్యూ కార్యక్రమాలను వివరిస్తూ తెలుపుకార్డు కుటుంబసభ్యులందరి వేలిముద్ర ఆన్‌లైన్ చేయటం 81 శాతం పూర్తియిందని తెలిపారు. ఇళ్లస్థలాలకోసం ధరఖాస్తుచేసిన వారి అందరి జాబితాలు వారిలో అర్హుల జాబితాలు, తమవద్ద సిద్ధంగా ఉన్నాయని ఇళ్ళస్థలాలకు భూముల సేకరణకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలువస్తే సేకరణ జరుగుతుందన్నారు. ఇంతవరకు రేషన్‌కార్డులు లేవనివారు రెండున్నార ఎకరాల భూమి, 60 వేలరూపాయలలోపు వార్షికాదాయంగలవారు తెల్లరేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకోవచ్చునని, గులాబిరంగు రేషన్ కార్డు కావలసిన వారు కూడా ధరఖాస్తు చేసుకోవచ్చునని, తహశీల్దార్ వివరించారు. మండలంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.4.10 కోట్లు పెట్టుబడి నిధులు మంజూరయ్యాయని వెలుగు ఎ.పి.యం.ప్రభావతి వివరించారు. చంద్రన్న బీమాపథకంలో ఇప్పటివరకు మండలంలో 28,391 మంది నమోదయ్యారని, ఈ పథకంలోని నమోదయ్యే ప్రతివ్యక్తి 15.రూపాయాలు చెల్లించవలసిన ఉంటుదని తెలిపారు. మండలంలోని తిడిపూడి ఎత్తిపోతల పథకం కాల్వకు అనుబంధంగా 52. పంటకాల్వల తవ్వకం పనులకు 37.లక్షల,44. వేల,460. రూపాయలను ఉపాధిహామి పథకం నిధులు వ్యయం చేయటానికి మండల పరిషత్ సమావేశం ఆమోదంతెలిపింది. ఎం.పి.పి. అయిన పర్తిచందనశ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్.పి. ఉపాధ్యక్షురాలు చింతలవెంకటరమణ, ఎ.ఎం.సి. చైర్మన్ పారేపల్లి రామారావు, ఎం.పి.డి.ఓ.ఎం.రాజు, తాహశీల్దర్ ఎ.కృష్ణజ్యోతి వేదికపై ఆసీనులయ్యరు. సమావేశంముగింపు దశలో గతనెల 22న జరిగిన ఉపన్నికలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన పారేపల్లి శ్రీనివాస్‌కు ఎన్నిక ధృవీకరణ పత్రాన్ని ఎం.పి.డి.ఓ.అందచేసారు.

# ఇద్దరూ.. ఇద్దరే

ఆమె

- ఐరాసలో భారతీయ గళం....
- బస్తర్ కలంపట్టిన పాత్రికేయురాలు


మాలినీ సుబ్రహ్మణ్యం


నిక్కీ హేలి

బస్తర్ అడవుల్లో కలంపట్టిన పాత్రికేయురాలు ఒకరు, ఏకంగా ఐక్యరాజ్యసమితిలో తనవాణిని విప్పనున్న అమెరికా రాయబారి మరొకరు. విభిన్న భావాలను కలిగిన వీరిద్దరూ....అత్యున్నత గౌరవం పొందిన మహిళలుగాతాజాగా వెలుగులోకి వచ్చారు. మావోయిస్టు ప్రాంతమైన చత్తీస్‌ఘడ్‌లో పోలీసుల బలగాల హింసను కథనాలుగా రాసిన మాలినీ సుబ్రహ్మణ్యం ఇంటర్నేషనల్ ప్రెస్ ఫ్రీడం అవార్డు సాధించగా...భారతీయ సంతతికి చెందిన నిక్కీ హేలి ఐరాసలో అమెరికా రాయబారిగా నామినేట్ అయ్యారు.

44ఏళ్ల నిక్కీ హేలీని ఐరాసలో అమెరికా కొత్త రాయబారిగా నియమితురాలుకావడం భారత జాతి ఎంతో గర్వించే వార్త. అమెరికాలోని దక్షిణ కెరొలినాకు తొలి మహిళ, మైనారిటీ గవర్నర్‌గా కూడా ఎంతో క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో, ఒప్పందాలు చేసుకోవడంలో నిక్కీ ఎంతో సమర్థురాలు. ఎన్నికల్లో తీవ్రంగా విమర్శించిన ట్రంప్ ఐక్యరాజ్య సమితికి అమెరికా రాయబారిగా పదవి స్వీకరించాలని కామెను కోరడం విశేషం. దక్షిణ కెరొలినాలోని బుమ్‌బెర్గ్ అనే చిన్న ఊరిలో భారత సంతతికి చెందిన పంజాబీ కుటుంబంలో జన్మించారు నికీ, ఆమె తల్లిదండ్రులు అజిత్‌సింగ్ రాన్‌ధావా, రాజ్‌కౌర్‌రాన్ ధావాలు, తండ్రి అజిత్‌సింగ్ బయాలజీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తల్లి బట్ట బిజినెస్ చేసేవారు. క్లెంసన్ నుంచి అకౌంటింగ్ డిగ్రీ చేశారు. డిగ్రీ అనంతరం మైఖేల్ హేలీని పెళ్లి చేసుకున్న నికీ భర్త మైఖేల్ నేషనల్ గార్డ్స్‌మెన్. వీరికి ఇద్దరు పిల్లలు. నికీది వ్యాపారనేపథ్యమున్న కుటుంబం. అమెరికాలో ఆమెను పిన్నవయస్కురాలైన గవర్నర్‌గా చెప్పుకుంటారు. వ్యవహారశైలి మాత్రం ఆమెను స్మార్ట్ విమెన్‌గా వ్యవహరిస్తారు. డొనాల్ట్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌లో నికీ తొలి నాన్-వైట్‌కావడం విశేషం. రిపబ్లికన్ పార్టీలో రైజింగ్ స్మార్ట్‌గా కూడా నికీని వ్యవహరిస్తారు. ప్రొఫెషనల్‌గా నికీకి పేరుంది. ప్రపంచవేదికపై అమెరికాకు చెందిన గొప్ప ప్రతినిధిగా సమర్థవంతంగా వ్యవహరించగలరన్న ఆశను ట్రంప్ వ్యక్తం చేశారు. నిక్కీ దక్షిన కెరొలినాకు రెండో విడత గవర్నర్‌గా వ్యవహరిస్తున్నారు.

చత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ మావోయిస్టు కూడలి. వాళ్లను వేటాడే క్రమంలో పోలీసులు, విజిలెన్సు బలగాల చేతుల్లోస్థానిక గిరిజనులు బలవుతున్నారు. అమాయక ఆడపిల్లల్ని బలిచేయడం, యువకుల్ని జైళ్లలో పెట్టడం, మానవహక్కుల ఉల్లంఘన వంటివన్నీ యదేచ్ఛగా జరుగుతుంటాయి. బస్తర్ ఒక యుద్ధభూమి. ప్రపంచంలో ఏ మీలన చీమ చిటుక్కుమన్నా కుప్పలు తెప్పలుగా వార్తలు ముంచెత్తుతున్న ఈ తరుణంలో పోలీసు బలగాలుక్కుపాదాల కింద నలిగి పోతున్న అమాయక గిరిజనుల ఆర్తనాదాలు వినిపించడంలేదు. ఎందుకంటే అక్కడున్న జర్నలిస్టులు పెన్ను ఎక్కుపెట్టినప్పుడల్లా వందల గన్నులు చుట్టుముడుతున్నాయి. భయకంపిత వాతావరణం అలుముకుంటుంది. వార్త రాస్తేచాలు నోరు నొక్కేసి,జైల్లో కుక్కేసి హక్కులను కాలరాసే పరిస్థితులు ఉన్నాయక్కడ. అలాంటి రెడ్‌కారిడార్‌కలోకి అడుగుపెట్టారు మాలినీ సుబ్రహ్మణ్యం. చీకట్లో వణికిపోతున్న గిరిజనానికి మాలిని రాకతో ఒక అగ్గిబరాటా దొరికనట్లయింది. మాలిని స్క్రోల్‌ఇన్‌లో ఫ్రీలాన్స్ పాత్రికేయురాలు. గిరిజనులగుండె చప్పుడును స్క్రోల్‌ఇన్ అనే వెబ్‌సైట్లో కథనాలుగా వచ్చాయి. స్థానిక పాత్రికేయులు, కంట్రిబ్యూటర్ల సహకారంతో మాలిని అద్భుతమైన కథనాలు వెలువరించారు. ఈ క్రమంలో ప్రాణాలకు తెగించారు కూడా.

బస్తర్ పరిసారాల్లోని ఒక ఇంట్లో తన కూతురితో కలిసి బస చేసిన మాలినిపై హఠాత్తుగా రాళ్లవర్షం కురిసింది. ఎక్కడినుంచి రాళ్లు విసుతున్నారో అర్థంకాలేదు కిటికీలన్నీ భళ్లున బద్దలయ్యాయి. బయట పార్కింగ్ చేసిన కారుకూడా ధ్వంసం అయింది. ఉదయాన్నే పోలీసు స్టేషన్‌కు వెళ్లి కేసు పెడితే పోలీసులు ఎఫ్ఐఆర్ రాసుకోడాని కూడా ఇష్టపడలేదు.

అతి బలవంతంగా కేసు రాసుకున్నారు. అందులో ఒక్కరి పేరు కూడా నమోదుకాలేదు. ఆఖరికి ఆ కేసుతో ఏమీ ఫలితం లేకుండా పోయింది. పైగా ఇల్లు అద్దెకు ఇచ్చిన యజమాని మీద ఒత్తిడిచేసి ఖాళీ చేసాలా చేశారు అని గతాన్ని గుర్తుచేసుకున్నారు మాలిని.

బస్తర్‌లో బలవంతపు అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లు, అత్యాచారాలు, మహిళల పట్ల హింస,ఇన్ని జరుగుతున్నా చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం మాత్రం చూస్తూ ఊరుకుంది. ఎటువంటి స్పందనాలేదు. కేంద్ర ప్రభుత్వం కూడా మిన్నకుండిపోయింది. మానవహక్కుల ఉల్లంఘన దారుణంగా ఉంది. పోలీసుల చేతుల్లో జర్నలిస్టులు తీవ్ర ఒత్తిడికి, హింసకు గురవతున్నారు. జైళ్లలో మగ్గుతున్నారు. ఈ దారుణాలు తెలియాలంటే ఎడిటర్స్‌గిల్డ్ ప్రతినిధులు వెంటనే పర్యటిస్తే మంచిది అంటున్న మాలిని ఆలోచనలకు తెరదీస్తోంది.సాహసానికి మారుపేరైన మాలిని సెల్యూట్ చేద్దాం..

## మన కోసం

**జనరల్ స్టోర్స్**

| | | | |
|---|---|---|---|
| శ్రీ విజయలక్ష్మి | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| ఎపి.ఎస్.ఆర్. | తుళ్ళూరు | పురపాటి శ్రీనివాసరావు | 94411 28030 |
| ఖాజా ఖాదార్ | రాయపూడి | షేక్ జానీ | 9948450761 |
| తేజశ్వి | మందడం | నన్నపనేని నరేష్ | 9063631234 |
| దాదా | రాయపూడి | కౌసర్ | 99890 35143 |

**రియల్ ఎస్టేట్**

| | | | |
|---|---|---|---|
| శ్రీ సాయిరామ్ | తుళ్ళూరు | పి. పోతురాజు | 9985853188 |
| వంశీకృష్ణ | పెదపరిమి | ఎ.రాము | 9848551688 |
| క్యాపిటల్ | తుళ్ళూరు | వి.వీరాంజనేయులు | 9346229631 |
| నాగార్జున | రాయపూడి | చెరుకూరి బాబి | 7287098458 |
| రియల్‌టర్స్ | రాయపూడి | ఎండి ఆదామ్ | 9441754056 |

**సెలూన్ షాప్**

| | | |
|---|---|---|
| వెస్ట్రన్‌లుక్ | పెనుమాక గోపి | 9908183377 |

**రెస్టారెంట్స్**

| | | | |
|---|---|---|---|
| గోదావరి రుచులు | తుళ్ళూరు | యన్.రామరాజు | 9703908055 |
| బిర్యానిస్ | విజయవాడ | ------ | 7032202222 |
| శ్రీ విజయ గణపతి బ్రాహ్మణ | విజయవాడ | కె.లక్ష్మి,గణపతి | 9948462515 |
| అతిధి | వెలగపూడి | సందీప్ | 9441 228460 |
| చినస్వామి రాజధాని | సచివాలయం ప్రాంతం | | 9963441052 |
| శ్రీ దుర్గావిలాస్ | మల్కాపురం | కె.వి.రాజు | 94908 50243 |
| అయ్యప్పభోజనం | వెలగపూడి | | 99084 57372 |

**జ్యూయలర్స్**

| | | | |
|---|---|---|---|
| లలిత | తుళ్ళూరు | నాలమాలు మధు | 7905505854 |
| రాజా | తుళ్ళూరు | ప్రభురాజా | 9581500500 |

**షాప్స్**

| | | | |
|---|---|---|---|
| రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| రాయల్ ఫర్నిషింగ్స్ | తుళ్ళూరు | కె. సుబ్బారావ | 9492485385 |
| బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| సి .ఓ వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | వెంకట పున్నారావు | 08645-244484 |
| చైతన్య గోదావరి | | | |
| గ్రామీణ బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| శైవక్షేత్రము | తాళ్ళాయపాలెం | శివస్వామిజీ | 08863297856 |
| ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాల . ఖాజ | 9441275466 |
| అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| లాస్య డిజిటల్ స్టూడియో | రాయపూడి | రవికుమార్ | 9491647400 |
| స్టైల్ ఫర్ మెన్ | తుళ్ళూరు | ఎస్.ఎమ్.జాని | 94403 07123 |

**ట్రేడర్స్**

| | | | |
|---|---|---|---|
| సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 9908073516 |

**ఎలక్ట్రికల్ వర్క్**

| | | | |
|---|---|---|---|
| ఫయాజ్ | రాయపూడి | షేక్. కలాం | 9440521023 |
| న్యూస్టార్ | రాయపూడి | షేక్. ఖాజా | 9553741230 |
| స్టార్ | విజయవాడ | ఎస్.కె.షరీఫ్ | 97038 14862 |
| గ్రీన్ అండ్ కూల్ | తుళ్ళూరు | ఎస్. జాని | 96031 06678 |

## అమరీందర్ స్విస్ ఖాతాలు బహిర్గతం చేసిన కేజ్రీవాల్



**చండీగఢ్ :** పంజాబ్ మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ కుటుంబ సభ్యుల స్విస్ బ్యాంకు ఖాతాలను ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బయటపెట్టారు. ఎన్నికల ప్రచారంలో సభలో ఆయన ప్రసంగిస్తూ, అమరీందర్ సింగ్ అవినీతిపై ఆరోపణలు చేశారు. కనీసం సొంత ఇంటికి పెయింట్ వేసుకోలేని స్థిలిలో ఉన్న ఆయన 2002లో ముఖ్యమంత్రి అయ్యాక భారీగా నిధులు కూడబెట్టారని విమర్శించారు. 2005లో అమరీందర్ సింగ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, ట్రస్ట్ పేరుతో స్విస్ బ్యాంకులో తెరిచిన ఖాతాల వివరాలను బయటపెట్టారు. పంజాబ్ సీఎం బాదల్ ప్రభుత్వంపైనా కేజ్రీవాల్ మండిపడ్డారు.

## ప్రభుత్వ భూములపై జేసీ ఆరా

**రాజధాని ప్రతినిధి ,(గుంటూరు) :** పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే జిల్లాలోని ప్రభుత్వ భూములకు సంబంధించిన వ్యవహారంపై నూతన సంయుక్త కలెక్టర్ కృతికాశూక్లా దృష్టి సారించారు. కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్ సీఆర్‌డిఏ అదనపు కమీషనర్ చెన్నకేశవతోపాటు జిల్లా నైసరిగ్గ స్వరూపాలను తెలియజేసే మ్యాప్‌లను తెప్పించుకుని పరిశీలించారు. రాజధాని పరిధిలో 7 ప్రధాన అనుసంధాన రహదారులకు సంబంధించి భూ సమీకరణ అంశంపై సిఆర్‌డిఏ అధికారులు జేసీకి వివరించారు. ఇటీవల రహదారులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగిన నేపథ్యంలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి నిర్మాణం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు జెసికి తెలియజేశారు. దీంతో రహదారులకు అవసరమైన భూసేకరణ సత్వరమే సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జిలాల్లోని అసైన్డ్, దేవాదాయ, ధర్మాదాయ వక్ఫ్ భూములు ఇతర ప్రభుత్వ భూములకు సంబంధించి జిల్లాలోని తహశీల్దార్లను వివరాలు పంపించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల విస్తీర్ణం ఏ మేరకు ఉంది, తాజాగా వాటి పరిస్థితి ఏమిటి, ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు గురించి సమీక్షించారు. భూముల విలువ గణనీయంగా పెరగడంతో ప్రభుత్వానికి సంబంధించిన భూములను సంరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తహశీలార్ధను ఆదేశించారు. మండలాల వారీగా ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలు, తాజా పరిస్థితిని తనకు పంపించాలని అధికారులకు సూచించారు. జెసి చాంబర్‌లో జరగాల్సిన పౌరసరఫరాల కేసులకు సంబంధించిన కోర్టును సైతం వాయిదా వేశారు. గుంటూరు రాజధాని జిల్లా కావడంతో ప్రధానంగా భూములపైనే దృష్టి సారించారు. సిఆర్‌డిఏ పరిధిలోని భూములకు సంబంధించిన సమస్యలు, భూ సేకరణ, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూముల ప్రతిపాదనకు సంబంధించి జెసితో చర్చించారు. ప్రభుత్వ భూములకు సంబంధించి కోర్టుల్లో నలుగుతున్న వ్యవహారాలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లకు సూచించారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై సంబంధింత అధికారులతో శుక్లా సమీక్షించారు.

# పెద్ద నోట్ల రద్దు 'ఎఫెక్ట్'

**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** పెద్ద నోట్ల రద్దు రాష్ట్ర ఆదాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. చలికాలంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్న విధంగా దాదాపు అన్ని శాఖల్లోనూ ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. ముఖ్యంగా అధిక ఆదాయ వనరులైన రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజు - ప్రొహిబిషన్‌తో పాటు ఇతర పన్నులను వసూలు చేసే విభాగాలు పూర్తిగా చతికలపడ్డాయి. పెద్ద నోట్లు రద్దయిన నాటి నుండి ఈ పన్నెండు రోజుల్లో 40 నుండి 60 శాతం ఆదాయం లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విషయాన్ని వివిద శాఖలకు చెందిన ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. కేంద్రం ఐదు వందలు, వెయ్యి రూపాయల నోట్ల రద్దు ప్రకటన చేసిన తర్వాత క్రమంగా వివిధ శాఖల్లో ఆదాయ స్థితి గతులను పరిశీలించిన అధికారులు అవాక్కయ్యారు. అధికాదాయాన్ని సమాకూర్చిపెట్టే పలు శాఖల్లో స్తబ్ధత నెలకొని ఉండడం ప్రభుత్వ వర్గాల్లో ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా డిసెంబరు నెలలో ప్రభుత్వ ఉద్యోగుల జీత భత్యాలను ఏవిధంగా చెల్లించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత ఏర్పడిన పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామని, ముఖ్యంగా ఆదాయం తగ్గిపోవడం ఆందోళన కలిగించే విషయంగా పేర్కొంటున్నారు. ఆయా జిల్లాల్లో నెలకొన్న ఆర్థిక సంక్షోభన్ని ఏ విధంగా తగ్గించాలనే కోణంతో పాటు ఆదాయాన్ని పెంచుకోవడానికి చేపట్టవలసిన చర్యలపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఆర్థిక లోటు తీవ్రంగా ఉందని, గడచిన ఏడు నెలల కాలంలో రూ.900 కోట్ల వరకూ ఆర్థిక లోటు ఏర్పడినట్లు లెక్కలు చెబుతున్నాయన్నారు. ఈ సమస్యను ఏవిధంగా ఎదుర్కొనాలో ఆలోచించేలోపే కేంద్రం పెద్ద నోట్ల రద్దు ప్రకటన చేసిందంటున్నారు.

**చతికిల పడిన అధికాదాయశాఖలు**

పెద్ద నోట్ల రద్దు వలన కేవలం మన రాష్ట్రంలోనే కాదని, యావత్ భారతావనిలో ఇదే విధమైన విపత్కర పరిస్థితులు తెలెత్తాయంటున్నారు. ఇటువంటి తరుణంలో కేంద్రం రాష్ట్రాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉందని, ఎక్కడైతే చిన్న నోట్ల కొరత అధికంగా ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా నగదును సమాకూర్చవలసిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఎక్కువ మొత్తంలో ఆదాయం వచ్చే రిజిస్ట్రేషన్ల శాఖలో కార్యకలాపాలు చాలా మందకొదిగా జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఆర్థిక సంవత్సరం ఈ శాఖ ద్వారా రూ.3200 కోట్లు ఆదాయాన్ని ఆర్జించాలని ఈ శాఖ లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటి వరకూ రూ.2300 కోట్లు మాత్రమే వచ్చింది. నల్లధనం ఎక్కువగా చెలామణి అయ్యే రియెల్ఎస్టేట్ రంగం కూడా కుదేలు కావడం ఆదాయం గండికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. పెద్ద నోట్ల రద్దు ప్రభావం ఈ రంగంపై తీవ్రంగా చూపుతోంది. రద్దయిన నోట్ల స్థానంలో కొత్తగా ఐదొందలు, రెండు వేల నోట్లను ముద్రించిన రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కొన్ని రాష్ట్రాలోనే రెండువేల కొత్త నోట్లను విడుదల చేయడం కూడా ఆదాయంపై తీవ్రంగా ప్రభావం చూపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రద్దు ప్రకటనకు ముందుగానే ముద్రించిన కొత్త నోట్లతోపాటు తక్కువ డినామినేషన్ కలిగిన నోట్లను అన్ని రాష్ట్రాల్లో ముందుగానే అందుబాటులో ఉండే విధంగా ఆర్బీఐ చర్యలు తీసుకొని ఉంటే ఈ సంక్షోభం ఉత్పన్నమయ్యేది కాదని మరికొందరు స్పష్టం చేస్తున్నారు.

## హైడ్రో కార్బన్ హబ్‌గా కాకినాడ

**10 బిలియన్ డాలర్ల పెట్టుబడికి సిద్ధమని సీఎంతో అలోక్‌నందన్ వెల్లడి**



**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** తూర్పుగోదావరి జిల్లా కాకినాడను హైడ్రో కార్బన్ హబ్‌గా తయారు చేయాలనే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది.గోదావరి - కృష్ణా బేసిన్‌లో అపార చమురు సహజవాయు నిక్షేపాలను వెలికితిస్తున్న ఓఎన్జీసి, మరికొన్ని అదే తరహా సంస్థల కన్సార్టియం ఏర్పాటు చేసి రాష్ట్రంలో హైడ్రో కార్బన్ ప్రాజెక్టులను చేపట్టే అంశాన్ని పరిశీలించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కాకినాడలో ఈ తరహా ప్రాజెక్టులు రెండింటిని చేపట్టడానికి ముందుకొచ్చిన ఓఎన్జీసీకి అన్ని విధాలుగా సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. తన నివాసంలో కలిసేందుకు వచ్చిన ఓఎన్జీసీ ఈడీ అలోక్‌నందన్‌తో ముఖ్యమంత్రి ప్రాజెక్టు ప్రతిపాదనలపై చర్చించారు. కాకినాడ సమీపంలో రెండు హైడ్రో కార్బన్ ప్రాజెక్టులను చేపట్టేందుకు తమ సంస్థ సంసిద్ధంగా వుందని ఆయన సీఎంకు తెలిపారు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుతో కాకినాడ హైడ్రో కార్బన్ హబ్‌గా రూపొందించడం ఖాయమన్నారు. 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో రెండు ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వాటికి సంబంధించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో ఓఎన్జీసీ చేపట్టే ప్రాజెక్టులు, కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ భేటీలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ పాల్గొన్నారు.

# పద్ధతి మారకపోతే ఇంటికే

- ప్రభుత్వ సిబ్బందికి మంత్రి వార్నింగ్
- పక్కా రిపోర్టులున్నాయి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు
- నెల్లూరు వైద్యాధికారులపై మంత్రి కామినేని ఫైర్



**నెల్లూరు :** ప్రభుత్వం నుంచి వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నారు.. ఇక్కడ బయోమెట్రిక్‌లోనూ మాయజాలం సృష్టిస్తున్నారు.. సంతకాలు పెట్టి ఎంచక్కా ప్రైవేటు సేవలు చేసుకుంటున్నారు. ఇంకో పక్క పారిశుధ్య దుస్థితిని చూస్తూ రోగులు పెద్దాస్పత్రికి రావాలంటేనే భయపడుతున్నారు. వందల కోట్లు ఖర్చు పెట్టి పేదలకు సేవ చేయాలన్న ప్రభుత్వం సంకల్పానికి నీరు కారుతోంది. మీ అందరి పనితీరుపై జిల్లా కలెక్టర్, ఇంటెలిజెన్సీ నుంచి వచ్చిన పక్కా రిపోర్టులు నా వద్ద ఉన్నాయి.. పద్ధతి మార్చుకుంటే సరి.. లేకుండా కఠిన చర్యలు తప్పవు. ఉద్యోగాలు ఊడుతాయి.. అంతేకాదు.. క్రిమినల్ కేసులు పెడతాం అంటూ సాక్షాత్తు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ నెల్లూరు సిబ్బందిని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఈ స్థాయిలో ఓ మంత్రి వైద్యులకు వార్నింగ్ ఇచ్చారంటే సర్కారు ఆస్పత్రుల్లో పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రెండు రోజుల పర్యటన కోసం నెల్లూరు చేరుకున్న ఆయన పెద్దాస్పత్రిలోనే బస చేశారు. పురపాలకశాఖ మంత్రి నారాయణతో కలిసి ఆస్పత్రిలో కలియ తిరిగారు. సిబ్బంది తీరుపై వచ్చిన నివేదికలను పరిశీలించిన మంత్రులు రగిలిపోయారు. విధులకు హాజరుకాని డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో రూ.525 కోట్లు వ్యయంతో నిర్మించిన శ్వాసకోస వైద్య సేవల భవనం, రు. 125 కోట్లతో నిర్మించిన మార్చురీ భవనాలను ప్రారంభించారు. తదుపరి ప్రభుత్వ మెడికల్ కాలేజీ సమావేశం హాలులో మెడికల్ అధికారులు, అధ్యాపకులు, మెడికల్ కాలేజీ విద్యార్థులతో కామినేని సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులలో కోట్లాది రూపాయలతో వివిధ వైద్య విభాగాల భవనాలు నిర్మిస్తున్నందున ఆసుపత్రులలో ఔట్ పేషెంట్స్ (ఓ.పి) పెరగాలని, డాక్టర్లు నిర్దేశించిన సమయంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించుటలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎవరైనా ఆసుపత్రుల సమయంలో బయటికి వెళ్లి ప్రైవేటుగా ప్రాక్టీసు చేస్తే వారిని టెర్మినేట్ చేస్తామన్నారు. దీంట్లో ఎలాంటి ఉదాసీనత చూపించేది లేదన్నారు. బయోమెట్రిక్ సిస్టం పటిష్టంగా అమలు చేస్తూ డాక్టర్లు, వైద్య సిబ్బంది హాజరుపై నిఘా ఉంచుతూ నిర్లక్ష్యం వహించేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటేషన్ కార్యక్రమాలు ప్రతిరోజు సక్రమంగా జరిగేలా సంబంధిత కాంట్రాక్టర్లపై పర్యవేక్షణ ఉండాలన్నారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు అవసరమైన వైద్య సాంకేతిక సదుపాయాలు, లైబ్రరీ, ఫర్నీచర్, ఆటస్థలం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి డాక్టర్ పి. నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ డాక్టర్లు, వైద్య సిబ్బంది సమన్వయంతో పటిష్ట సేవలు అందిస్తే కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తయారు చేయవచ్చాన్నారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం మెడికల్ సీటు సాధించడమే కాదని, తొలి సంవత్సరం నుండే కష్టపడి చదవాలని, మధ్యలో నిస్పృహ లేకుండా ఫైనల్ ఇయర్ వరకు నిరంతర శ్రమ చేసినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చాట్ల నరసింహారావు, నెట్లూరు ఆర్డీవో వెంకటేశ్వర్లు, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ భారతి. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ వరసుందరం, డి.సి.హెచ్.డా. సుబ్బారావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో 25 ట్రైనింగ్ సెంటర్లు

**సమీక్షా సమావేశంలో మంత్రి రావెల వెల్లడి**



**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** గిరిజన సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం వారికోసం 7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో 25 అత్యాధునిక ట్రైనింగ్ సెంటర్స్ నెలకొల్పుతున్నట్లు రాష్ట్ర మంత్రి రావెల కిషోర్‌బాబు చెప్పారు. వీటి ద్వారా గిరిజనులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ , స్వయం ఉపాధికి శిక్షణ అందిస్తామన్నారు. ఇవిగాక గిరిజనుల కోసం అనేక నూతన పథకాలు ప్రవేశపెడుతున్నామని, వారి సంక్షేమం కోసం బడ్జెట్‌లో దాదాపు 3వేల 99 కోట్ల రూపాయలు 43 డిపార్ట్‌మెంట్లకు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఆయన విజయవాడలో ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఐటీడీఏ, పీవోస్, డీడీఎస్, డీటీడబ్ల్యూవోస్‌లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గిరిజనుల ఆదాయం పెంపుకు, వారిలో నెలకొన్న నిరక్షరాస్యతను, వెనుకబాటుతనాన్ని పారద్రోలడానికి గిరిజన సంక్షేమ శాఖ తీవ్రంగా కృషి చేస్తుందని చెప్పారు. ఇందుకోసం గతంలో ఎన్నడూలేని విధంగా ఐడీఏల్లో ఐఎఎస్ స్థాయి అధికారులను నియమించడం జరుగుతుందన్నారు. ఐటీడీఎలను నియమించడం జరుగుతుందన్నారు. ఐటీడీఎలను బలోపేతం చేసి దాని ద్వారా అనేక నూతన ఉత్పత్తులను మార్కెట్‌ల్లోకి విడుదల చేస్తున్నామన్నారు. గిరిజనుల ద్వారా ఆడవిలో లభించే ముడి సరుకులను ప్రభుత్వం స్వీకరించి వాటిని ఉత్పత్తులుగా మార్చి మార్కెట్‌లో అమ్ముతున్నట్లు తెలిపారు. గతంలో గిరిజనుల నుంచి కాఫీ ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో మోసాలు జరిగేవని, ఇప్పుడు నేరుగా గిరిజన సహకార సంస్థ (జి.సి.సి) కాఫీ గింజలను నేరుగా అమ్ముతుందన్నారు. దీని ద్వారా గిరిజనులకు లాభం చేకూరడంతో పాటు, వారి ఆదాయాలను కూడా వృద్ధి చేసుకునే అవకాశం లభించిందన్నారు. ఇలా వారి ఆదాయం పెరగడంతో జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. కాఫీ గింజల కోసం లక్ష ఎకరాలు సేకరిస్తున్నామని, జీడిపప్పు, వాణిజ్య పంటలను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇలా గిరిజనులను వ్యవసాయంతో పాటు ఇతర పంటలను కూడా పండించేలాగా చర్యలు చేపట్టడంతో వారికి అన్నివిధాలా మేలు జరుగుతుందన్నారు. ఎక్కువ భాగం రాష్ట్రంలో గిరిజనులు వ్యవసాయం మీదనే 95 శాతం ఆధారపడి జీవిస్తున్నారని, రాబోయే కాలంలో సర్వీస్, పారిశ్రామిక రంగాల్లో సైతం వీరిని ప్రోత్సాహించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. గిరిజన తంగాల్లో పోషకాహారం లోపంతో ఇబ్బందులు పడుతున్న పిల్లలను గిరిపుత్రిక పథకంతో ఆదుకుంటున్నామని చెప్పారు. అలాగే ఆడపిల్లలను పెంచడం భారంగా భావిస్తున్న వారికోసం కళ్యాణపుత్రిక పథకం ద్వారా 50 వేల రూపాయల నగదు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈపథకాలన్నీ సక్రమంగా లబ్దిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలని మంత్రి కోరారు.

## పల్స్ సర్వేకు రండి



**రాజధానివార్తాలు, రాయపూడి :** ఇప్పటివరకు పల్స్ సర్వేలో వివరాలు ఇవ్వనివారు నెలాఖరులోపు తమ వివరాలను అందించాలని రాయపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటప్పయ్య తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం నమోదును పూర్తిచేశామని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నెలాఖరుకు సర్వేను పూర్తిచేయనున్నామని అందువల్ల గ్రామస్తులు విధిగా పంచాయతీ కార్యాలయంలో తమ వివరాలు ఇవ్వాలన్నారు. తమ వివరాలను ఎప్పటికప్పుడు మైక్‌ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు.

# శివాలయాలు కిటకిట

**రాజధాని ప్రతినిధి-రేపల్లె :** కార్తీక పౌర్ణమి, సోమవారం రావడంలో జిల్లాలోని శివాలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. వేకున జాము నుంచే వివిధ ప్రాంతాలలో ఉన్న శివాలయాలకు భక్తుల తాకిడి ఎక్కువైంది. వేకువ జామునే లేచి తలారా స్నానం చేసి భక్తులు సమీపంలోని శివాలయాలకు వెళ్లి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. మహిళలు ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. అమ్మవారికి పూజలు చేసుకున్నారు. ప్రతి ఆలయంలోనూ భక్తుల సందడి రాత్రి పొద్దుపోయే వరకు సాగింది. కొన్ని శివాలయాలకు రంగు రంగు దీపాలతో వైభవంగా తీర్చిదిద్దారు. కొన్ని వైష్ణవ దేవాలయాల్లో సామూహిక సత్యవ్రతాలు, హోమాలు నిర్వహించారు. ప్రధాన శైవక్షేత్రాలను అమరావతి, పెదకాకాని, కోటప్పకొండ, కోరి, గోవాడ, గుత్తికొండ బిలం, మోర్తోట, దైవ, ప్రధాన పట్టణాల్లోని శివాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంతో సహారూరల్ మండలంలోని పలు శివాలయాలలో మహిళా భక్తులు కిటకిటలాడారు. తెల్లవారుజాము నుంచే కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి నియమ నిష్టలతో మహిళలు దీపారాధనలు చేసి ఆయా శివాలయాలలో పూజలు నిర్వహించి భగవంతుని పట్ల తమ భక్తి విశ్వాసాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇసుకపల్లి శ్రీచెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, బేతపూడి శ్రీచెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, పాత రేపల్లెలోని శ్రీఉమామహేశ్వరస్వామివారి దేవాలయం, రామకోటి పేటలోని శివాలయం, రూరల్ మండలం మోర్తొటలోని ముక్తేశ్వరస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

# హక్కుల కోసం ముస్లింలు పోరాడాలి : రఫీ

**రాజధాని ప్రతినిధి-క్రోసూరు :** దేశంలో రాజకీయంగా ముస్లింల పాత్ర చాలా తక్కువగా ఉందని వారిని ఓటు బ్యాంకు గానే వాడుకుంటున్నారని ఈ నేపథ్యంలో ముస్లిం సోదరులు అందరూ ఒకటై సంఘటితంగా హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని నేత రఫి అన్నారు. క్రోసూరులోని ముస్లింల షాది ఖానాలో పార్టీలకు అతీతంగా ముస్లింల ఆత్మీయ సమావేశం జరిగింది. క్రోసూరు ముస్లింనాయకులు షేక్ ముస్తఫా, కూరపాటి షైదా, సలాం, ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు సయ్యద్ అమీర్ వలి అధ్యక్షతన జరిగింది. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫి, జిల్లా అధ్యక్షుడు మస్తాన్, షరీఫ్, కార్యదర్శి బాలసైదులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముస్లింలు సమాజంలో చాలా వెనుకబడి ఉన్నారని అన్ని రంగాలో ముస్లింలు ఎదగాలంటే ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఐక్యత కోసం ముస్లిం సోదరులందరూ ఒక తాటిపై సమావేశం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సినీ అలీని హాజరవుతారని చెప్పారు. 27న జరిగే సదస్సు వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అతిథులను ముస్లిం పెద్దలు కూరపాటి షైదా, సలాం, షేక్ ముస్తఫా, సన్మానించారు. ఈ కార్యక్రమంలో షేక్ ముస్తఫా, షేక్ కరిముల్లా, షేక్ బాబు, హనీఫ్, గఫూర్, పఠాన్ మస్తాన్ వలి, ఖాజామోయినొద్దిన్, అల్లాభక్షు, షేక్ మస్తాన్‌వలి, మోషుల్ జాను, షేక్ రహిమాన్, నాగుల్ మీరా, రఫి, స్వీట్ బాబు, మెకానిక్ బాబు పాల్గొన్నారు.

# రాజధానిలో దళిత రైతు ఘోష

- దళితులు సాగు చేసుకుంటున్న 150 ఎకరాల సమీకరణకు ప్రభుత్వ యత్నం
- న్యాయం చేయాలని దళిత రైతుల ఆందోళన

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** సమస్యల పరిష్కారం కోరుతూ నందిగామ సురేష్ ఆధ్వర్యంలో లింగాయపాలెం దళితులు కొందరు తుళ్ళూరు సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చారు. ధర్నా గురించి తెలుసుకున్న పోలీసులు వాహనంలో రైతులను వెంబడించారు. సీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నా చేయటానికి వీల్లేదని తుళ్ళూరు ఎస్ఐ రైతులను హెచ్చరించారు. పెద్ద సంఖ్య పోలీసులు మోహరించి రైతులను చుట్టుముట్టారు. రైతులు వస్తున్నారని తెలుసుకున్న సీఆర్‌డీఏ ముఖ్య అధికారులు దుమ్మా కొట్టారు. పోలీసుల ఆదేశాల మేరకు కార్యాలయంలో అందుబాటులో ఉన్న అధికారులకు రైతులు వినతి పత్రం ఇచ్చి వెనుదిరిగారు. ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్ తీవ్రంగా రాజధాని గ్రామాల్లో ఒకటైన లింగాయపాలెం దళిత రైతులు కొందరు బ్రిటీష్ కాలం నుంచి 200 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. 1979లో రాష్ట్ర ప్రభుత్వం దళితులు సాగు చేసుకుంటున్న భూమిని (అసైన్డ్) కేటాయించారు. ఆ భూములు అందరికీ సమానంగా కేటాయించాలని కోరుతూ ఆ పట్టాలను ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారు. ఆ తరువాత ప్రభుత్వం కొందరికి మళ్లీ ఇచ్చేసింది. మరి కొందరికి స్థానిక నాయకులు రాజకీయాలు చేయటంతో పట్టాలు అందలేదు. ఈ భూముల్లో నిమ్మబత్తాయి సాగుకు ఎస్సీ కార్పొరేషన్ 2001లో ఆర్థిక సాయం చేసింది. ప్రస్తుతం అమరావతి నిర్మాణం కోసమంటూ 150 దళిత కుటుంబాలకు చెందిన రైతుల భూముల సమీకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా ఈ నెల 5న సీఆర్‌డీఏ అధికారి లింగాయపాలెంలో రైతులతో సమావేశమయ్యారు. ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇవ్వాలని కోరారు. ఆ భూములు 'శివాయి జమీందార్' కింద ఉన్నాయని, అందుకే 500 గజాల ఇళ్లస్థలం, మరో 100గజాల వాణిజ్యప్లాట్లు కేటాయిస్తామని తేల్చి చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే కౌలు చెల్లించేది లేదని స్పష్టం చేశారు. దీంతో ఎప్పటి నుంచో సాగు జమీందార్‌వి ఎలా అవుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

# మోదీకి.. ఇందిరకూ పోలికా!

### సోనియా గాంధీ వ్యాఖ్యలు

**ఢిల్లీ / అలహాబాద్ :** ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీకి.... దివంగత ఇందిరాగాంధీకి అసలు ఏ విషయంలోనూ పోలిక లేనేలేదని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ స్పష్టం చేశారు. మోదీని స్థాయి నాయకుడు తమ పార్టీలో లేరన్న వాదనలను ఆమె ఖండించారు. అసలా వాదనతో తాను ఎట్టిపరిస్థితుల్లోనూ ఏకీభవించనని సోనియా స్పష్టం చేశారు. మోదీ... ఇందిరాగాంధీలను పోల్చి చూపడటం వల్ల తనకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదని ఆమె ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాజకీయాల్లో ఎప్పటి సమస్యలు అప్పుడే ఉన్నాయి. ఎవరికి తగిన ఇబ్బందులు వారికి ఉన్నాయి అని ఆమె ఇండియా టు డే టీవీతో మాట్లాడుతూ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జన్మించిన అలహాబాద్‌లోని స్వరాజ్‌భవన్‌లో ఉద్దేశపూర్వకంగానే ఫోటో ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు సోనియా చెప్పారు. ఈ నెల 19 నుంచి మొదలైన ఇందిరాగాంధీ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం జరిగిన ఈ ఫోటో ప్రదర్శన ప్రారంభోత్సవంలో సోనియా, రాహుల్, ప్రియాంకలు పాల్గొన్నారు. అత్తగారైన ఇందిరాగాంధీ గురించి సోనియా ఎంతో ఉద్వేగంగా మాట్లాడారు. ఆమె తనకు కేవలం అత్తగారు మాత్రమే కాదనీ.. .కన్నతల్లిలాంటి వారిని సోనియా చెప్పారు. పదహారేళ్ల పాటు తాము ఒకే ఇంట్లో ఆనందాలు, బాధలూ అన్నింటిని పంచుకున్నారు.

# ప్రధానికి పార్లమెంట్ ధిక్కార నోటీసు

**నోటీసులివ్వనున్న ప్రతిపక్షం : సీపీఎం నాయుకుడు సీతారాం ఏచూరి వెల్లడి**



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరుస్తూ రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీచేసిన తర్వాత పెద్దనోట్ల రద్దు వంటి విధాన నిర్ణయాన్ని సభ వెలుపల ప్రకటించడానికి తోడు నిర్ణయాన్ని వివరిచేందుకు పార్లమెంట్‌కు హాజరుకాని ప్రధాని నరేంద్రమోడీపై సభా ధిక్కారం, హక్కుల ఉల్లంఘన నోటిసునిచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సిపిఎం ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నాయకుడు సీతారామ్ ఏచూరి ప్రకటించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతుండగా పెద్ద నోట్లను రద్దు చేస్తూ తాను తీసుకొన్న నిర్ణయంపై సభకు హాజరై వివరించడానికి బదులుగా సభ వెలుపల వివిధ రకాల వేదికలపై ప్రతిపక్షాలను విమర్శిస్తూ ప్రధాని ప్రసంగాలు చేస్తుండడం పార్లమెంట్ ధిక్కారం కిందకే వస్తుందన్న అభిప్రాయాన్ని ఆయన ఉభయసభలు వాయిదా పడిన తర్వాత విలేఖరులతో మాట్లాడుతూ చెప్పారు. ప్రధానిపై ఈ ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేసేందుకున్న అవకాశాలపై ఇతర ప్రతిపక్ష పార్టీలతో,న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్లు కూడా ఏచూరి వెల్లడించారు. ప్రధాని మోడీకి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం విశ్వాసమున్నట్లు కనిపించడం లేదన్న ఆయన పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రతిసారీ ఏదో ఒక వివాదాస్పద నిర్ణయంతో పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకుండా చూస్తున్నారని సిపిఎం నేత ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రధాని సభ వెలుపల ఎలాంటి విధాన నిర్ణయాన్ని ప్రకటించరాదన్నదే తన అభిప్రాయమని సమావేశాలు ప్రారంభమైన తర్వాత కూడా ప్రధాన మోడీ పార్లమెంట్ వేదికపై కాకుండా నిత్యం సభ వెలుపల అనేక ప్రసంగాలు, ప్రకటనలు చేస్తున్నారని విమర్శిస్తూ ఇది ఖచ్చితంగా ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్ ధిక్కారమేనని సీతారామ్ ఏచూరి చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు, ప్రజాతీర్పుతో ఏర్పాడే ప్రభుత్వం పార్లమెంట్‌కు జవాబుదారీ, కానీ, ప్రధాని సభకు రాకుండా ప్రజాస్వామ్యం వ్యవస్థనే దెబ్బతీస్తున్నారని. దుయ్యబట్టారు.

# పెందలకడనే తినడం కుదరనప్పుడు ఏమి చెయ్యాలి?

ఇది అందరినీ వేధించే సమస్య, అవకాశం ఉన్నప్పుడల్లా పెందలకడనే తిని, అవకాశం లేనప్పుడు ఎప్పుడున్నా ప్రొద్దుపోయి తింటే ఏమవుతుందిలే అని కొందరనుకుంటారు. పెందలకడనే తినడం కుదరక పోతే ఆరోజుకి తినడం పూర్తిగా మానివెయ్యండి. తింటే వచ్చే నష్టం కంటే, తినకపోతే వచ్చే లాభమే చాలా ఎక్కువ. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఇంటికి వచ్చే సరికే రోజూ 10,11 గంటలయితే, అలాంటివారు సాయంకాలం 6, 6-30 గంటల మధ్య ఎక్కడుంటే అక్కడ ఆ టైముకు పండ్లను దగ్గరుంచుకుని తిని సరిపెట్టండి. కుదరక పోతే ప్రొద్దు పోయిన దాకా తిరగండి, కానీ తినడం మాత్రం మానండి. ఉప్పుడన్నా మధ్యాహ్న భోజనం చెయ్యడానికి గానీ, పండ్లు తినడానికి గానీ కుదరనప్పుడు, ఆ సందర్భాలలో తేనె నీళ్ళను మాత్రం త్రాగవచ్చు. ఎన్ని సార్లైనా త్రాగవచ్చు. తేనె మాత్రం జీర్ణక్రియ అవసరం లేకుండా వెంటనే రక్తంలోకి వెళ్ళి ఎక్కువ శక్తి నివ్వగలదు. ఒక గ్లాసు నీటిలో 3,4 టీస్పూన్లు తేనే వేసుకోవచ్చు. తేనె అమృతం కదా! దీనిని అర్ధరాత్రి అయినా వాడుకోవచ్చు.

### ప్రొద్దుపోయి ఎప్పడన్నా తింటే దానికి పరిష్కారం ఏమిటి?

మీ అందరూ దీనికి పరిష్కారం లేకుండా ఉంటుందా అని ఎదురుచూస్తూ ఉంటారనుకుంటాను. ఎంత నియమం అనుకున్నప్పటికీ ఒక్కోసారి కొన్ని ఇబ్బందులు ఎదురైతుంటాయి. ఎప్పుడన్నా తప్పనిసరిగా పెళ్ళి భోజనాలలోనో, విందులలోనో, అత్యవసర పరిస్థితులలో తినవసి వచ్చినప్పుడు తినండి కాని అలా తినేటప్పుడు మాత్రం ప్రొద్దుపోయి దుంపకూర తినవద్దన్నారు. పొట్ట నిండా తినవద్దన్నారు, పెరుగు వద్దన్నారు, నూనె తగలకూడదన్నారు. అనే మాటలు పక్కన పెట్టి ఫుల్‌గా, తృప్తిగా తినండి. దానికి పరిష్కారం తరువాత రోజు చేయండి. తరువాత రోజు ఉదయం రెండు దఫాలుగా నీరు తాగి రెండుసార్లు విరేచనం అయ్యేట్లు చూసుకోండి. ఆ రోజు ఉదయం ప్రతి రోజులా జ్యూస్‌లు, మొలకలు మాని కేవలం తేనె నీళ్ళతో ఉండండి. 8,9 గంటలకు 1 గ్లాసు నీరు+4 స్పూన్ల తేనె+1 కాయ నిమ్మరసం కలిపి తాగండి. 10 గంటలకు మంచినీరు ఒకటి, రెండు గ్లాసులు తాగండి. 11 గంటలకు తేనె నీళ్ళు, 12 గంటలకు మరలా ఒకటి, రెండు గ్లాసులు మంచినీళ్ళు, 1 గంటకు తేనె నీళ్ళు తాగి మధ్యాహ్నం వరకు మాడ్చండి. ఆకలి బాగా వేస్తే మధ్యాహ్నం భోజనం చెయ్యండి. సాయంకాలం పండ్లతో సరిపెట్టండి. ఆకలి మందంగా ఉంటూ రోజంతా తేనె నీళ ృతోనే ఉండండి. రోజూ మేము రాత్రి 11,12 గంటల వరకు తిని పొట్టను తరువాత రోజు మధ్యాహ్నం వరకు మాడిస్తే సరిపోతుంది. కదా అని కొందరు, ఆలోచిస్తారు. ఇది కుదరదు. పొట్టలో ఆహారం వేసి హానికరం. తప్పు చేసినప్పుడు పరిష్కార మార్గంగా పైన చెప్పిన విధానం పనికి వస్తుంది.

### పెందలకడనే తింటే మీకు వచ్చే లాభాలు

రోజుకొక పెట్టె సిగరెట్లు తాగినా మీకు వచ్చే నష్టం కంటే, రోజుకొక పెగ్గు విస్కీ తాగినా వచ్చే నష్టం కంటే, రోజుకి 4,5 సార్లు కాఫీలు తాగినా వచ్చే నష్టం కంటే, గుట్కా, జరదాలు వేస్తే వచ్చే నష్టం కంటే ప్రొద్దుపోయాక తింటే మీకు కలిగే నష్టం చాలా ఎక్కువ. ఈ ఒక్క నియమం ఆచరిస్తే ఇంతకాలం చేసిన తప్పులను కూడా సవరించే ప్రయత్నం చేస్తుంది. అంతేకాకుండా పెందలకడనే భోజనం చెయ్యడం వలస 1) రోగ నిరోధక శక్తి అద్భుతంగా పెరుగుతుంది. 2) ఉదయానికి శరీరం తేలిగ్గా గాలిలో తేలినట్లు ఉంటుంది. 3) లేవగానే ప్రేగులలో ఉన్న మలం అంతా కదిలి బయటకు పోతుంది. 4) సుఖనిద్ర పడుతుంది. 5) పెందలకనే నిద్ర వస్తుంది. 6) బరువు బాగా తగ్గుతారు. సరిపడినంత బరువు ఉన్నవారిని భవిష్యత్తులో లావు కాకుండా కాపాడుతుంది. 7) పొట్ట బాగా తుగ్గుతుంది. 8) నిద్రలో గురక పోతుంది. 9) పిచ్చి, కలలు రావు. 10) శరీర వాసనలు రాకుండా స్వచ్ఛంగా ఉంటుంది. 11) తరచుగా తరుణ వ్యాధులు రావు. 12) తెల్లవారు ఝామునే మెలకువ వస్తుంది. 13) ఆకలి బాగా పెరుగుతుంది. 14) జీర్ణక్రియ చాలా చురుగ్గా జరుగుతుంది. 15) ఆకలిలో ఉండే ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పూర్తిగా అనుభవిస్తారు.

### ఈ తప్ప ఇక చేయవద్దు

మనందరకు హాయిగా సుఖంగా జీవించే రోజులొచ్చాయి. కాబట్టే ఇలాంటి మంచి విషయాలను తెలుసుకోగలిగాము. ఆ మంచిని ఇక వెంటనే ఈ రోజు నుండీ ఆచరించే ప్రయత్నం ప్రారంభిద్దాము. వండినది వేస్ట్ అవుతుంది, ఈ రోజుకి తిని రేపటి నుండీ మానండి అని మీ ఆవిడ బ్రతిమాలినా తినకండి. మిగిలిన చెత్త కుండీలో వేయండి తప్ప పొట్టలో వేయవద్దు. ప్రొద్దుపోయి తినడం మహా పాపంగా భావించండి. క్షమించరాని నేరాన్ని ఈ శరారం చేత మనం ఇక చేయించవద్దు. పెందలకడనే తినడం ప్రారంభిస్తే కొత్తలో కాస్త నిద్ర పట్టదు. పైగా వారం, పది రోజుల పాటు కలల్లో కూడా అవి ఇవి తిన్నట్లే కలలు వస్తాయి. అయినా వెనుకడుగు వేయకండి అదే అలవాటు అయిపోతుంది. మనం మారితే మన పిల్లలూ మారతారు. మనకే మంచి విషయాలు తెలియకపోతే మన పిల్లలకి ఎవరు చెబుతారు. చెప్పండి. పెద్దలుగా మనం మంచి మార్గంలో నడవాలి. పిల్లలకు బంగారు బాటను చూపాలి. అందరం కలసి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం. అలవాట్లను మార్చుకునే ప్రయత్నంలో పదండి ముందుకు మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని నిరూపిద్దాం.

## ఆరోగ్యం



డాక్టర్. మంతెన సత్యన్నారాయణ

# ముస్లింలకు '700 కోట్లు' : హిదాయత్



**రాజధాని ప్రతినిధి-పొన్నూరు :** ముస్లిం మైనార్టీలకు టీడీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్పోరేషన్ ద్వారా రూ.700 కోట్లు మంజూరు చేసి, ముస్లిం సంక్షేమానికి వెచ్చిస్తుందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ మహమ్మద్ హిదాయత్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎన్‌జిరంగా విగ్రహ సెంటర్‌లో జరిగిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనాదిగా టీడీపీ ముస్లింలకు అండగా నిలచి ఆదరిస్తుందన్నారు. పొన్నూరులో అధిక సంఖ్యాకులుగా ఉన్న ముస్లింలు టీడీపీకి మద్దతు ఇస్తూ విజయపథంలో పార్టీని నడిపించడం టీఈపీ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ సదస్సుకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్ అధ్యక్షత వహించారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ షేక్ జానీమున్ మాట్లాడుతూ ముస్లింలు ఆర్థికంగా, వెనుకబడి ఉన్నారని, వారి తోడ్పాటుకు చంద్రబాబు రోహిణి, తోఫా, దుల్హన్ వంటి వినూత్న కార్పోరేషన్ డైరెక్టర్ లాల్‌వజీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గుంటూరు, అనంతపురం లాంటి జిల్లాలు రాజకీయంగా చైతన్యం కలిగిఉన్నాయన్నారు. అలాంటి జిల్లాలకే ముస్లింలకు జిల్లా పరిషత్ చైర్మన్ల పదవులు అప్పగించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకే దక్కిందన్నారు. వక్ఫ్ బోర్డు డైరెక్టర్ హస్సన్ బాష మాట్లాడుతూ చంద్రబాబు ఆశీస్సులతో ఒక సామాన్య కార్యకర్తనైన తనని గుర్తించి వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పదవి అప్పగించడం ఆయన అభిమానాన్ని చాటి చెబుతుందన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ముస్లింలకు కల్పించిన 4శాతం రిజర్వేషన్ చట్టబద్ధం చేయాలని తామంతా డిమాండ్ చేసినప్పటికి దానిని అప్పటి ప్రభుత్వం విస్మరించిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డా॥సజ్జా హేమలత మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం కేటాయించిన పథకాలు, రాయితీలు నేరుగా అందేవిధంగా కృషి చేస్తున్నామన్నారు. మాజీ కౌన్సిలర్లు షేక్ జాకీర్ హుస్సేన్, జానీభాష, మస్తాన్ మేస్త్రీ, ఉస్మాన్ మేస్త్రీ, రషీద్, అహ్మద్ మేస్త్రీ, ఇస్మాయిల్ ఖాన్, కదీర్ తదితరులు తమ అనుచరులతో పార్టీలో చేరారు. పట్టణంలోని 7 మసీదులు, దొప్పలపూడి మసీదునకు మరమ్మతుల నిమిత్తం ఒక్కొక్క మసీదుకు రూ.15,000/-లు మంజూరు పత్రాలు అందజేశారు.

# చదువు బాలల రాజ్యాంగ హక్కు

- ప్రభుత్వ స్కూళ్లలో చదివితే క్లర్క్ అవుతామన్న భావన
- జస్టిస్ దీపక్‌మిశ్రా వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే క్లర్క్ ఉద్యోగం మాత్రమే వస్తుంది. ఎంత తెలివి ఉన్నా సరే తమ జీవితాలు బాగుపడవన్న భావన ప్రజల్లో ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా అన్నారు. 'ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితిని చూసి టాలెంట్ ఉన్న పిల్లలు కూడా స్థితికి చేరుతున్నారు. డబ్బున్న వాళ్లు ప్రైవేటు పాఠశాలల్లో చదువుకొని ఉన్నత స్థితికి చేరుతున్నారు. దీనిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. విద్యా హక్కు చట్టం ద్వారా.. పిల్లలకు చదువు దూరం రాజ్యాంగ హక్కు అయినా ప్రభుత్వాలు వారిని చదువుకు ఎందుకు దూరం చేస్తున్నాయి?.' అని ఆయన ప్రశించారు. స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ దీపక్‌మిశ్రా, జస్టిస్ అమితవరాయ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ముందుగా తెలంగాణ ప్రభుత్వం తరపున న్యాయవాది విశ్వనాథ్‌శెట్టి వాదిస్తూ.. ఈ సమస్య కేవలం రాష్ట్రానికి మాత్రమే పరిమితం కాలేదని, అన్ని రాష్ట్రాల్లో అలానే ఉందని, కేసులో ఇతర రాష్ట్రాలను కూడా భాగం చేస్తే బాగుంటుందని సూచించారు. తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ తరపు న్యాయవాది శ్రావణ్ కుమార్ జోక్యం చేసుకొని.. కేసు ప్రారంభం తర్వాత సుప్రీంకోర్టు మూడు కీలక ఆదేశాలను ఇచ్చిందని, దాంతో తెలంగాణాలో పరిస్థితి కాస్త మెరుగుపడిందని చెప్పారు. మూతపడిన స్కూళు తెరుచుకున్నాయని, ప్రజాప్రతినిధులు వద్ద పీఏలుగా, పీఎస్‌లుగా పని చేస్తున్న టీచర్ల వెనక్కి వెళ్లిపోయారని, విద్యా ప్రణాళికను కూడా ప్రభుత్వం రూపొందించిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కాగా, ఏపీలో గతేడాది 1400 స్కూళ్లు మూతబడ్డాయని, మరో 1200 స్కూళ్లు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయని శ్రావణ్ తెలిపారు. దీన్ని ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాది గుంటూరు ప్రభాకర్ వ్యతిరేకించారు. మీడియా సమాచారం ఆధారంగా శ్రావణ్ కోర్టులో మాట్లాడుతున్నారని, అందులో ఏ మాత్రం వాస్తవం అన్నారు. లేదన్నారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న జస్టిస్ దీపక్‌మిశ్రా.. ఈ అంశాన్ని అంత తేలికగా తీసుకోవద్దని, స్కూళ్ల మూసివేత సీరియస్ విషయమన్నారు. అధికారులతో చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కాగా, ఈ పరిస్థితి ఎందుకు వస్తుందో అధ్యయనం చేయాలని శ్రావణ్‌ను ఆదేశించారు. అలాగే, తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన విద్యా ప్రణాళిక బాగానే ఉందని, కానీ దాన్ని అమలు చేయడం లేదని శ్రావణ్ ఫిర్యాద్ చేశారు. దాంతో ప్రణాళికను అమలు చేసి, దాని స్టేటస్ రిపోర్టును 8 వారాల్లో కోర్టుకు సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ లోపు క్షేత్రస్థాయి పరిస్థితులపై అధ్యయనం చేసి కోర్టుకు నివేదిక అందజేయాలని అమికస్ క్యూరీ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీని ధర్మాసనం ఆదేశించింది.

# క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం

- గుంటూరులో రూ.16.50కోట్లతో క్యాన్సర్ ఆసుపత్రి
- రూ.1.30 లక్షల విలువైన మందులు రూ.8వేలకే...
- ముందుకు వచ్చిన నాట్కోట్రస్టు

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మానవుని శరీరంలో అంతర్లీనంగా ఉంటూ రోజు రోజుకు ఆరోగ్యాన్ని క్షీణింపజేసి చివరకు ప్రాణాలను హరించే అతి ప్రమాదకరమైన క్యాన్సర్‌పై ఏపీ ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. అంతర్జాతీయంగా క్యాన్సర్ వ్యాధికి చికిత్సలు ఉన్నప్పటికీ అవి ఖరీదైనవి కావడంతో సామాన్యుడు క్యాన్సర్ చికిత్సలకు దూరమయ్యి అమూల్యమైన జీవితాన్ని అర్థాంతరంగా ముగిస్తున్నాడు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తన సతీమణి జ్ఞాపకార్థం బసవ తారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను హైదారాబాదులో ఏర్పాటు చేసి క్యాన్సర్ బారినపడిన పేద ప్రజలకు చికిత్సను ఉచితంగా అందించారు. ఆయన స్ఫూర్తిని, ఆశయాలను అన్ని రంగాల్లో కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నవ్యాంధ్ర ప్రదేశ్‌లో కూడా ప్రజల కోసం అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య సౌకర్యాలు కలిగిన క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కానీ రూ16 వేలు కోట్ల ఆర్థిక బడ్జెట్‌తో ఉన్న ఏపీ ప్రభుత్వం ఖజానాలకు క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయింపు భారమయ్యే పరిస్థితులు నెలకొన్ని ఉన్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు తన మేదస్సును ఉపయోగించి అనేక రాయితీలు ప్రకటిచడం ద్వారా క్యాన్సర్ వ్యాధి మందుల తయారీలో ప్రపంచఖ్యాతిగాంచిన నాట్కో ట్రస్టు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో క్యాన్సర్ యూనిట్‌ను నిర్మించడానికి ముందుకు వచ్చింది. ప్రభుత్వం తరపున పలుమార్లు నాట్కో ట్రస్టు ప్రతినిధులతో చర్చలు జరిపిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ చివరికు వారితో రూ.16.50 కోట్లతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి ఒప్పించి విజయం సాధించారు. ఈ మేరకు ట్రస్టు ఛైర్మన్ వెంకయ్య చౌదరి ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు.

### 15 నెలల్లో క్యాన్సర్ యూనిట్ ప్రారంభం..

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రభుత్వం స్థలం అప్పగించిన వెంటనే 15 నెలల్లో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి క్యాన్సర్ రోగులకు సేవలు అందించేలా నాట్కో ట్రస్టు ప్రతినిధులు చర్యలు చేపట్టారు. క్యాన్సర్ చికిత్సలో రూ.1.30లక్షల విలువైన మందులను కేవలం రూ.8వేలకే పేద రోగులకు అందించేందుకు ముందుకు వచ్చిన నాట్కో సంస్థపై ప్రైవేటు డ్రగ్ వ్యాపారులు కోర్టుకు వెళ్లారు. కోర్టులో జరిగిన సుదీర్ఘ పోరాటంలో నిష్పక్షపాతంగా ప్రజాసేవకు ముందుకు వచ్చిన నాట్కో ట్రస్టునే చివరకు విజయం వరించింది. ప్రస్తుతం తిరుపతిలోని స్విమ్స్‌లో మాత్రమే క్యాన్సర్ యూనిట్ అందుబాటులో ఉంది. గుంటూరులో ఏర్పాటు చేయబోతున్న అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన వైద్య పరికరాలు గల క్యాన్సర్ యూనిట్ కూడా అందుబాటులోకి వస్తే క్యాన్సర్ మరణాలు పూర్తిగా తగ్గుతాయని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మేదస్సుకు తోడు వైద్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ వైద్యుడిగా తనకున్న అనుభవం, పరిచయాలతో ప్రైవేటు సంస్థలను ప్రజా ఆరోగ్య సేవలోగా భాగం చేస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

## అంబేద్కర్ వర్ధంతికి వ్యాసరచన పోటీలు

**రాజధాని ప్రతినిధి- చిలకలూరిపేట :** ఎస్సీ, దళిత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కళాశాల స్థాయి విద్యార్థునులకు అంబేద్కర్ బాల్యం, విద్యాభ్యాసం, స్త్రీ జనోద్ధరణ అనే అంశంపై స్థానిక అంబేద్కర్ భవనంలో వ్యాసరచన పోటీలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు గేరా రాజశేఖర్ తెలిపారు. 27వ తేదీ ఆదివారం సాయంత్రం 3 గంటలకు పోటీ జరుగుతుందని, విజేతలకు బహుమతులు డిసెంబరు 6న అందజేస్తామని తెలిపారు.

## బ్యాంక్‌ల వద్ద నోక్యాష్ బోర్డులు

**రాజధాని ప్రతినిధి-పెదకూరపాడు :** మండలంలోని 75 తాళ్ళూరు ఆంధ్రా బ్యాంక్ వద్ద సోమవారం ఉదయం 11గం॥ల నుండే నోక్యాష్ బోర్డులు తగిలించారు. సన్నకారు చిన్నకారు రైతులు నిత్యవసరాల కోసం బ్యాంక్‌లవద్ద పడిగాపులుకాస్తు నోక్యాష్ బోర్డులు చూసి నివ్వెరపోయారు. పెద్దనోట్ల దాచుకున్నకొద్ది మొత్తాన్ని అవసరాలకు తీసుకుందామన్న డబ్బులేదంటూ వెయ్యి, రెండువేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, వారిచ్చే డబ్బు కుటుంబ ఖర్చులకే సరిపడడంలేదని గుడిదగ్గర బిచ్చగాడిలా బ్యాంక్‌లవద్ద చిల్లరకోసం సాయంకాలం వరకు ఎదురుచూపులేనని గ్రామ ప్రజలు వాపోతున్నారు.

## రూ.29 కోట్లతో నేలపాడు లేఅవుట్ పనులు

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** రాజధాని నగర పరిధిలోని నేలపాడు భూసమీకరణ లేఅవుట్ పనుల్ని రూ.29 కోట్లతో చేపట్టారు. నేలపాడు లేఅవుట్ పనుల్ని సుధాకర్ ఇన్ఫోటెక్ కంపెనీ అప్పగించారు. ఇక్కడి అభివృద్ధి చేసిన తర్వాత మిగిలిన 28 గ్రామాల్లో పనులు చేపట్టనున్నారు. ప్లాట్ల కేటాయింపునకు అనుగుణంగా రోడ్లు, డ్రైయిన్లు, కల్వర్టులు నిర్మించనున్నారు. ఈ లేఅవుట్ పరిధిలో 240 కల్వర్టులుండడంతో రోడ్‌గ్రిడ్‌కు అనుగుణంగా వాటిని సరి చేస్తున్నారు. వర్షపు నీరు వెళ్లేందుకు రోడ్లకు ఇరువైపులా డ్రైయిన్లు నిర్మిస్తున్నారు. ఈ నీరు కొండవీటి వాగు, పాల వాగులో కలిసేలా ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం రోడ్లపై కల్వర్టుల్లో మార్పులు చేయనున్నారు. సీఆర్‌డీఏ యుటిలిటీస్ డైరెక్టర్ కాశీవిశ్వేశ్వరరావు ఈ పనుల్ని పర్యవేక్షించారు. మూడు నెలల్లో పనులు పూర్తవ్వాలని కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు.

## రక్తహీనతతోనే మరణాలు

**రాజధాని ప్రతినిధి-పాలమూరు :** చిన్న వయసులో చేసే బాల్య వివాహాలు, యుక్తవయసులో సరైన ఆహారం అందక ఏర్పడే రక్త హీనత కారణంగానే నూరుశాతం మాతా శిశుమరణాలు ఏర్పడుతున్నాయని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం.దీప అన్నారు. తాడికొండ మండలం పాములపాడు దత్తత గ్రామంలో వలస కూలీలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న ఆడపిల్లలకు బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందించాలన్నారు. లేకుంటే రక్త హీనత ఏర్పడి చిన్న వయసులో వివాహాలు చేసుకున్న, ఏడాది లోపు చిన్నారులు మృత్యువాత పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని సూచించారు. రక్త హీనతను తగ్గించేందుకు తీసుకోవాల్సిన ఆహార నియమాలు పలు అంశాలపై వివరించారు. మరో శాస్త్రవేత్త గంగాదేవి, వలస కూలీల కుటుంబాలు పాల్గొన్నారు.

# భారతీయుల భవిత ప్రశ్నార్థకం

అమెరికా జనాభా 32 కోట్లు, అందులోని విదేశీయులు దాదాపు 30 లక్షల మంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ జనవరిలో శ్వేతసౌధంలోకి ప్రవేశించనున్నారు. అయితే ఆయన ఎన్నికపై భారత్‌తో సహా ప్రపంచ దేశాలన్నీ ఒత్తిడికి గురవుతున్నాయి. ఎందుకంటే విదేశీయులు అమెరికన్ల ఉద్యోగాలు కొట్టేస్తున్నారు కాబట్టి వారిని తరిమేస్తానని, ముస్లింలు ఉగ్రవాదులుగా గుర్తించారు కాబట్టి వారిని దేశంలోకి అనుమతించనని, అమెరికా మార్కెట్‌ను చైనా మార్కెట్ నిలువరిస్తోందని, దానిని నిరోధిస్తామని డొనాల్డ్ ప్రకటించడమే దీనికంతటికీ కారణం. నిజానికి గత 30 ఏళ్లగా అమెరికాలో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయి. సామాన్య ప్రజల స్థితి దిగజారుతూండగా కార్పొరేట్ కంపెనీలు విపరీతంగా లాభాలు గడిస్తున్నాయి. ఒబామా 8 ఏళ్ల కాలంలో కంపెనీలను రక్షించడానికి సామాన్యుల నడ్డి విరిచాడు, వలసదారులను భారీ సంఖ్యలో పంపేశాడు, యుద్ధాలు కొనసాగించడంలో, యితర దేశాల వ్యవహారాల్లో తలదూర్చడంలో బుష్‌కు తీసిపోకుండా ప్రవర్తించాడు. 30 ఏళ్లు పాలించిన రిపబ్లికన్లు, డెమోక్రాట్లు యిద్దరూ కలిసి అమెరికన్ సమాజాన్ని భ్రష్టుపట్టించారు. నిజానికి ట్రంప్ అధికారంలోకి రావడం వలన అక్కడ ఎన్నాళ్లగానో పాతుకు పోయిన తెలుగువాళ్లకి ఏ యిబ్బందీ వుండదు. సిటిజన్‌షిప్ వున్నవారికీ వుండదు. కొత్తగా వెళ్లడం మాత్రం కష్టతరం అవుతుంది. భారతీయులు సాధారణంగా డెమోక్రాట్లకే మద్దతిస్తూ వచ్చారు. ఒబామాకు రెండు సార్లుగా ఓటేసినా అతను టెర్రరిజాన్ని అణచలేకపోయాడని భావించిన కొందరు ట్రంప్‌కు ఓటేశారు. హిల్లరీ పాకిస్తాన్ పక్షపాతి కావడం, ఆమె ముఖ్య సహచరులు హ్యూమా అబేదిన్ పాకిస్తాన్‌కు చెందిన ముస్లిం కావడం చేత పాకిస్తానీ అమెరికన్లు హిల్లరీకి మద్దతు పలకడం వారికి నచ్చలేదు. పన్నులు తగ్గిస్తానని ట్రంప్ చేసిన వాగ్దానం ధనిక భారతీయులను మెప్పించింది. పైగా అమెరికన్ అధ్యక్షులందరిలో తాను భారత్‌కు ఆత్మీయుడిగా వుంటానని ట్రంప్ అనడమూ నచ్చింది. అమెరికాలో ఎచ్1 బి వీసాలపై పరిమితి 65 వేలు. దాన్ని పెంచమని కంపెనీలు అడుగుతున్నాయి. ట్రంప్ ఖాయంగా పెంచడు. అమెరికాలో టాలెంటెడ్ ఉద్యోగులు దొరకనప్పుడే ఆ వీసా కింద పరదేశస్తులను దిగుమతి చేసుకోవాలి. దాన్ని నిరూపించడం కష్టం. ఇటీవల ఫ్లారిడాలోని డిస్నీలాండ్‌లో అమెరికన్లకు తీసివేసి ఇండియన్లను పెట్టారు. నైపుణ్యం పెద్దగా లేని స్థానికులకు కూడా ఉద్యోగాలు యిస్తేనే ఇండియన్ కంపెనీలను అనుమతించే పరిస్థితి రావచ్చు. భారత్ గురించి అతను రెండు రకాలుగానూ మాట్లాడాడు. సాంకేతికత పరిజ్ఞానం ఎక్కువ అవసరం వున్న ఉద్యోగాలలో భారతీయులున్నా చిన్న ఉద్యోగాలు మాత్రం అమెరికన్లకు ఇవ్వాలన్నారు.



2015-16ల్లో అమెరికాలో మొత్తం 10.44 లక్షల విదేశీ విద్యార్థులు కాలేజీ, యూనివర్శిటీ స్థాయిలో వున్నారు. వీరు మొత్తం విద్యార్థుల్లో 5%. కితం ఏడాదితో పోలిస్తే 7% విద్యార్థులు పెరిగారు. వీరిలో 1.66 లక్షల మంది భారతీయ విద్యార్థులు కాగా, వారిలో 25% మంది తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లినవారే. నిజానికి మనవాళ్లల్లో ఎమ్మెస్ చదివిన అందరూ హైలీ-స్కిల్డ్ జాబ్స్‌లో లేరు. ఎమ్మెస్ చదువుకోవడానికి వెళుతున్నాం అనడం, అక్కడ చట్టవిరుద్ధంగా చిల్లరమల్లర ఉద్యోగాలు చేయడం జరుగుతోంది. దీన్ని ట్రంప్ అడ్డుకోవచ్చు. ఇక్కడ నుంచి వెళ్లిన మనవాళ్లలంతా రూల్సుకు వ్యతిరేకంగా హోటళ్లలో సర్వర్‌గా చేరి స్థానికులకు ఉద్యోగాలు ఊడగొట్టి, పొట్టకొట్టడం అక్కడి వారిని తీవ్రంగాకలచి వేస్తోంది. అమెరికా వెళ్లిన మనవాళ్లకు ఉద్యోగం పోతే యింటి నుంచి డబ్బు పంపిస్తారు. ఓ ఆర్నెల్లు చూసి యింకా ఉద్యోగం రాకపోతే యింటికి వచ్చేయరా, పొలం చూసుకుందువు గాని అంటారు. అదే స్థానికులకు ఉద్యోగం పోతే ఎక్కడకి వెళ్లగలరు? అమెరికాలో తల్లిదండ్రులు డబ్బులు పంపరు కదా! విదేశాల్లో నెలకొల్పుకున్న సంస్థలపై 35% పన్ను విధిస్తానని ట్రంప్ అంటున్నాడు. అమెరికన్ కంపెనీలు ఎచ్1బి వీసాలిచ్చి విదేశాల నుంచి తెప్పించుకునే ఉద్యోగులకు ప్రస్తుతం ఎంత వేతనం చెల్లించాలనేదానిపై ఎలాంటి రూల్సు లేవు. ఇకపై కనీసం లక్ష డాలర్ల వేతనం వున్నవారికే ఆ వీసా యిస్తామనే నిబంధన ట్రంప్ పెడతానంటున్నాడు. మన దేశానికి చెందినవారిలో చాలామందికి ప్రస్తుతం 45 వేల నుంచి 60 వేల డాలర్ల జీతం మాత్రమే వస్తోంది.

ఎన్నారైలు ఇక్కడకు పంపించే డబ్బు వలన యిక్కడి రియల్ ఎస్టేటు ప్రభావితమైంది. ఉత్తిపుణ్యాన స్థలాల ధరలకు రెక్కలొచ్చి, తక్కినవారికి అందుబాటులో లేకుండా పోయాయి. ఎన్నారైల తలిదండ్రులకూ కొమ్ములు వచ్చాయి. పిల్లల పేర ఆస్తులు కొనడమూ, సంరక్షించడమూ, అమ్మడమూ, వాటి గురించి గొప్పలు చెప్పడమూ వారికి ముఖ్యవ్యాపకమైంది. ఓపికున్నంత కాలం అమెరికా వెళ్లి పిల్లలకు పనులు చేసిపెట్టడం, ఓపిక తగ్గాక ఓల్డ్ ఏజ్ హోంలో చేరినప్పుడు వాళ్లని తిట్టుకోవడమూ... ప్రస్తుతం జరుగుతున్నది ఇదే...

అమెరికా వెళ్లిన దేశస్తులు కొందరు విదేశాల్లో డబ్బులు సంపాదించారు కానీ, తక్కిన ప్రజలకు చాలా నష్టమే జరిగింది. గ్లోబలైజేషన్ వల్ల పరిశోధన, అభివృద్ధి అడుగంటింది. మన దగ్గరే ఎచ్ఎంటి, ఆల్విన్ వంటి కంపెనీలు వాచీలు తయారుచేసేవి. అవి దారుణంగా మూతపడ్డాయి. ఒకప్పుడు చౌక సరుకులు పంజాబ్, హరియాణాల నుండి వచ్చేవి. ఇప్పుడు వాటి స్థానంలో చైనా వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. భారతీయులు సర్వీసెస్‌పై పడి, తయారీ రంగాన్ని అటకెక్కించాం. దీంతో వాణిజ్యంలో సమతూకం తప్పి ఎగుమతుల కంటె దిగుమతులు విపరీతంగా పెరిగాయి. ఆర్థికవ్యవస్థ కుంటుపడింది. ద్రవ్యోల్బణం పెరిగింది. మన మార్కెట్‌లో మన సరుకులే ప్రధానంగా అమ్ముడు పోవాలంటే గ్లోబలైజేషన్ నుండి బయటకు రావాలి. మన సరుకులు అమ్ముడు పోయేటంత పెద్ద మార్కెట్టు మనకుంది. అమెరికా కంపెనీలకు పన్నులు తగ్గించి, వెనక్కి వచ్చేందుకు ఆకర్షించి, ఔట్‌సోర్సింగ్ విధానంపై ఆంక్షలు పెట్టి, అంతిమంగా స్థానికులకు ఉద్యోగాలు వచ్చేట్లా చేస్తే అమెరికా బాగుపడుతుంది. అది బాగుపడితే ప్రపంచం బాగుపడుతుంది. గ్లోబలైజేషన్ స్థానంలో స్వీయరక్షణవాదం వస్తే మనమూ బాగుపడతాం. దిగుమతులు తగ్గి, పారిశ్రామీకరణ పెరిగి, మన దగ్గరా ఉద్యోగాలు పెరుగుతాయి. మనకు కావలసినది నైపుణ్యం పెంచుకోవడం, కష్టపడే స్వభావం వదులుకోకపోవడం అంతే...

**ఐరాసలో అమెరికా రాయబారిగా నిక్కీహేలి**

ఐరాసలో అమెరికా రాయబారిగా భారత్-అమెరికా పౌరురాలు నిక్కీహేలి అధ్యక్షపదవికి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ బృందంలో చేరి పనిచేయనున్నట్లుగా వాషింగ్టన్ మీడియా తెలిపింది. హేలి (44) ప్రస్తుతం సౌత్ కరొలినా రాష్ట్ర గవర్నర్‌గా పనిచేస్తున్నారు. హేలీని ఎంపిక చేయటంలో ట్రంప్ సరైన నిర్ణయమే తీసుకున్నారని వాషింగ్టన్ పోస్టు తెలియజేసింది. హేలి ఎంపికైన త్వరలో ప్రకటన రాగలదని వాషింగ్టన్ పోస్టు తెలిపింది. భారతదేశం నుంచి వలసవెళ్లిన నిక్కిహేలి తల్లిదండ్రులు సిక్కు మతస్తులు. హేలీ గవర్నర్‌గా 6 సంవత్సరాల క్రితం పదవీ బాధ్యతలను చేపట్టారు. రాష్ట్ర గవర్నర్‌గా ఆమె పనిచేయడం ఇది రెండువసారి. విదేశాంగ విధానం, దౌత్య విధానాలపై ఆమెకు అనుభవం తక్కువగానే ఉంది.

బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా ఆఫ్రికా-అమెరికన్ మహిళను, మరో ఆఫ్రికా-అమెరికన్లు లొరెట్టా, ఎరిక్ హోల్డర్లను అటార్నీ జనరల్స్‌గా పరిక్షించేందుకు సానుకూలంగా వ్యవహరించారు. పలు రాష్ట్రాలు ఆఫ్రికా-అమెరికన్లకు ఓటింగ్ హక్కులను పరిమితం చేసేందుకు రూపొందించిన చట్టాలను కూడా వీరు వ్యతిరేకించారు. ట్రంప్ చేసిన ఎంపికలను డెమోక్రాట్లతోపాటు మానవహక్కుల సంఘాల కూడా వ్యతిరేకిస్తున్నాయి. సెనెటర్‌గా పనిచేసిన సెషన్స్ తన పదవీకాలం అంతా మానహక్కుల పరిరక్షణను పట్టించుకోలేదని పలువురు విమర్శించారు. ఇదిఇలావుండగా తన ఎంపికలపై తానేమీ వ్యాఖ్యనించుకోదలచుకోలేదని ఒబామా అన్నారు. డెమోక్రాటిక్ పార్టీకి చెందిన సెనెటర్ ఎలిజబెత్ వారెన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇష్టంవచ్చినట్లు మాట్లాడిన వారిని పదువులక ఎంపిక చేయరాదని, ప్రస్తుత ఎన్నికలను రద్దుచేయాలని కోరారు. రిటైర్డ్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ అయిన ఫ్లిన్‌ను జాతీయ భద్రతా సలహాదారుగా నియమించడంపై దేశంలోనే కాకుండా వెలుపల నుంచి కూడా విమర్శలు వస్తున్నాయి. కాగా తనపైన ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు 25 మిలియన్ డాలర్లను చెల్లించడానికి ట్రంప్ అంగీకరించారు త్వరలో కోర్టుకు హాజరు కావాల్సి ఉన్నందున ఆయన కేసులను పరిష్కరించుకునేందుకు ముందుకు వచ్చారు.

\- బోస్

## ట్రంప్ బృందంలో జాత్యాహంకారులు

### డెమోక్రాట్ల ఆరోపణ

అమెరికా అధ్యక్షపదవికి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుగుతుండగా, ఆయన మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ఎంపిక చేసిన బృందం విచ్ఛిన్నకర విధానాలను అమలు చేసే అవకాశం ఉందని డెమోక్రాట్లు ఆరోపిస్తున్నారు. గతంలో తమవల్ల అసంతృప్తి వ్యక్తం చేసిన రిజబ్లికన్ పార్టీకిచెందిన పలువురిని కలుసుకొని వారిని శాంతపరిచేందుకు ప్రయత్నం చేశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్ చేసిన అనేక వ్యాఖ్యలను పార్టీ నాయకులు విమర్శించారు. జాతి విపక్షను కొనసాగించే అవకాశం ఉందని ఆయన ఎంపిక చేసుకున్న బృందంపై డెమోక్రాట్లు ఆగ్రహం వ్యక్తి చేస్తున్నారు. ప్రచారం సందర్భంగా ట్రంప్ మాటలనే ఆయన బృందం కూడా మాట్లాడుతున్నారని డెమోక్రాట్లు పేర్కొంటున్నారు. అట్నారీ జనరల్‌గా జెఫ్ సషర్స్ జాతీయ భద్రతా సలహాదారులుగా మైఖేల్ ఫ్లిన్‌లను ట్రంప్ ఎన్నిక చేశారు. సెషన్స్‌ను 1980లలో ఫెడరల్ జడ్జిగా నామినేట్ చేయగా, అమెరికా సెనెట్ తిరస్కరించింది. ఆఫ్రికన్-అమెరికన్ పట్ల సెషన్స్ అనేక వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అలాగే అటార్నీగా ఎన్నిక చేసిన ఫ్లిన్ కూడా ముస్లింల పైన, ఆఫ్రికన్-అమెరికన్లపైనా, యూదులపైనా పలువివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్ నాయకత్వంలోని ప్రభుత్వం విచ్ఛిన్నకర అజెండాను అమలు చేసే అవకాశం ఉందని పౌరహక్కుల కార్యకర్తలు, డెమోక్రాట్లు విమర్శిస్తున్నారు.

## శబరిమలకు సైకిల్‌పై స్వాములు యాత్ర

**కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** జిల్లాలోని మామిడికుదురు నుంచి ఇద్దరు అయ్యప్పస్వాములు శబరిమలకు సైకిల్ యాత్ర చేపట్టారు. మామిడికుదురుకు చెందని కంచర్ల కృషమోహన్, నగరంకు చెందిన వాణరాసి మారుతీ ఈశ్వరరావు నవంబర్ 19 శనివారం నాడు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ సుమారు 1400 కి.మీ మేర ఈ యాత్ర జరుగుతుందని తెలిపారు. స్థానిక శివాలయంలో ఇరుముడి కట్టించుకున్న స్వాములను జయంతి సుబ్బారావు గురుస్వామి, వర్ధినేని బుజ్జిస్వామిలతో పాటు పలువురు స్వాములు ఘనంగా వీడ్కోలు పలికారు.

## భక్తులతో పోటెత్తిన వాడపల్లి వెంకన్న ఆలయం

**కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట నియోజకవర్గ పరిధి ఆత్రేయపురం మండలం వాడపల్లిలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో కార్తీక మాసం సందర్భంగా ఏకాహం నిర్వహించారు. శనివారం నుండి ఆదివారం వరకు 24 గంటలపాటు భక్తి గీతాలతో ఏకాహం జరిగింది. కపిలేశ్వరపురం మండలం కేదారలంకకు చెంది గంటా ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. ఆదివారం భక్తజనంతో ఆలయం కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారి కల్యాణం జరిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బిహెచ్‌వి.రమణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాల్లో సూపరిటెండెంట్ రాధాకృష్ణ, సాయిరామ్, శివ పాల్గొన్నారు.

## త్రయంబకేశ్వరస్వామివారికి మహాపుష్పయాగం

**కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురం రూరల్ బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని మహాపుష్ప యాగం నిర్వహించారు. గుమ్మడి సద్గురు సత్యనారాయణ బ్రహోత్సవంలో జరిగిన ఈ పుష్పయాగంలో పదకొండు రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. మాహాపుష్ప యాగంలో భాగంగా ఆది దంపతులను చింతా మల్లికార్జునరరావు-వీరవెంకట రాజ్యలక్ష్మి దంపతులు పూలమందిరంలో శయనింపచేశారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ జడ్పిటీసి చింతా శంకరమూర్తి, సొసైటీ అధ్యక్షులు పి.వరదరాజులు, పివి.కన్నా, ఎల్. నాగమల్లేశ్వరరావు, కొండా సత్యనారాయణ, పిచ్చిక ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో ఫిన్లాండ్ తరహా ప్రాక్టికల్ విద్య అమలు

- డే కేర్ సెంటర్ల పనితీరు భేష్
- హెల్సింకీలో మంత్రి గంటా బృందం పర్యటన

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఉన్నత విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడంతోపాటు, రాష్ట్రంలో అంతర్జాతీయ విద్యా సంస్థల ఏర్పాలుపై అమెరికా అధికారిక పర్యటనకు వెళ్లిన మంత్రి గంటా శ్రీనివాసరావు బృందం పలు రాష్ట్రాల్లో పర్యటిస్తూ స్థానిక విద్యాలయాల్లో అమలు చేస్తున్న విద్యా విధానంపై అధ్యయనం చేస్తోంది. మంగళవారం ఫిన్లాండ్ రాజధాని హెల్సింకీ చేరుకొని పలు విద్యాసంస్థలను సందర్శించింది. చైల్డ్ డేకేర్ సెంటర్ ఏలా నిర్వహిస్తున్నారో అక్కడి అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వినూత్నమైన విధానాలతో డేకేర్ సెంటర్లను నిర్వహిస్తుండటాన్ని మంత్రి పరిశీలించారు. ఆ తరువాత ఫ్రీ ప్రైమరీ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆచరణాత్మక విద్యా విధానానికి పెద్ద పీట వేస్తూ నిర్వహిస్తున్న“ ఒమనీ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్” మంత్రి బృందాన్ని ఆకట్టుకుంది. ఇక్కడ థియరీ విధానంలో కాకుండా ప్రాక్టికల్‌గా విద్యా విధానాన్ని కొనసాగించడం మంత్రి బృందం గుర్తించింది. విద్యార్థులు తమ పాఠశాల స్థాయి విద్య పూర్తి చేసుకొన్న తరువాత నేరుగా తమకు ఇష్టమైన ఒకేషనల్ కోర్సులో చేరే విధంగా అక్కడ విద్యా విధానం అమలులో ఉంది. ఏట్రేడ్ ఇష్టపడితే ఆట్రేడ్‌లో విద్యార్థులు చేరవచ్చునని సెంటర్ నిర్వాహకులు వివరించారు. కార్పెంటర్, సివిల్ ఇంజినీరింగ్, స్పా తదితర కోర్సులను స్థానిక ఒమనీ ఒకేషనల్ సెంటర్‌లో ఏవిధంగా నిర్వహిస్తున్నదీ మంత్రి బృందం అధ్యయనం చేసింది. అనంతరం బిజినెస్ స్కూల్‌ను సందర్శించి, స్కూల్ అధ్యాపకులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగానికి అనుగుణంగా ఎలా నిర్వహించవచ్చో చర్చించారు. ఈ పర్యటనలో మంత్రితో పాటు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, కమిషనర్ సంధ్యారాణి, సర్వశిక్షాఅభియాన్ ఎస్పీడీ జి.శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ, ఎస్. ఎస్. ఏ.సీ.ఈ.ఎం.ఆర్.జి. నాయుడు ఉన్నారు.

## ఉండి పిహెచ్‌సిని సందర్శించిన వైద్యాధికారిణి

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా).:** ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డిప్యూటీ వైద్యాధికారిణి జి పద్మజారాణి సందర్శించి వసతులపై సిబ్బందిని ఆరా తీసారు. అనంతరం ఆమె కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను స్వయంగా నలుగురికి నిర్వహించారు. పద్మజారాణి మాట్లాడుతూ వైద్య సేవలను అందించడంలో జన్మకు ఎంతో సార్థకత ఉంటుందన్నారు. మాతా, శిశు మరణాల రేటును బాగా తగ్గించాలన్నారు. నవంబరు 14 నుంచి ప్రత్యేక క్యాంపుయిన్ సందర్భంగా వేసక్టమీ ఆపరేషన్లపై దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో వెల్త్ సూపర్‌వైజర్ ఎం మాణిక్యం, పిహెచ్‌ఎన్ సావిత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టసభల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించాలి

నందూరి రమేష్

**కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** వికలాంగులకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని వికలాంగ్ మహాసంఘటన్ జాతీయ అధ్యక్షుడు నందూరి రమేష్ డిమాండ్ చేశారు. అమలాపురం ఎర్రవంతెన వద్ద ఆంధ్రప్రదేశ్ వికలాంగ్ మహాసంఘటన్ అధికార ప్రతినిధి ఎన్.సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రమేష్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ప్రభుత్వం అరికట్టాలన్నారు. అలాగే దివ్యాంగులు దివ్యాంగులను వివాహం చేసుకుంటే రూ.లక్ష బహుమతిని కల్పించాలన్నారు. ఆత్మగౌరవంతో కూడిన సామాజిక సమానత్వం ద్వారానే దివ్యాంగుల అభివృద్ధి సాధ్యమని రమేష్ పేర్కొన్నారు. అనంతరం ఎన్.సురేష్ మాట్లాడుతూ దివ్యాంగులకు సదరం మెడికల్ బోర్డు ద్వారా ఇస్తున్న సర్టిఫికెట్లను ప్రతి శుక్రవారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రాయితీలు అందడంలేదని దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారని వచ్చే నెలలో రాయితీలు వచ్చేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్, డిఆర్‌డీఏ, పిడి అని కోరామన్నారు. డిశంబర్ 3వ తేది ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వికలాంగ్ మహాసంఘటన్ మాజీ అధికార ప్రతినిధి దొడ్డిపట్ల శ్రీనివాస్, మాజీ కార్యవర్గ సభ్యులు చిక్కాల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం వేడుకలు

**కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** అమలాపురంలో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్(చిన్న వార్తాపత్రికలు) కార్యాలయంలో నవంబర్ 17వ తేది గురువారం జాతీయ పత్రికా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగ మహాసంఘటన్ నాయకుడు ఎన్.సురేష్ మాట్లాడుతూ జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకుని వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా పనితీరు జర్నలిస్టులు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. సీనియర్ జర్నలిస్ట్ జిన్.రావ్ మాట్లాడుతూ నేడు పత్రికా రంగంలో ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా జర్నలిస్టులు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జిఎన్.రావ్, రిపోర్టర్లు మీర్జా అబ్బాస్‌హైదర్, ఆసు భరత్‌రామ్, కొంకి భగవాన్‌దాస్, కోమలి ప్రసాద్, కోమలి నాగసత్యప్రసాద్, వి.శివశంకర్, ఏ.తేజ తదితరులు పాల్గొన్నారు.

## 30న గరికపాటికి గురజాడ పురస్కారం ప్రదానం

**విజయనగరం :** మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 30న విజయనరగంలోని ఆనందగజపతి కళాక్షేత్రంలోని మహాసహ స్రవధాని గరకపాటి నరసింహారావుకు గురజాడ విశిష్ట పురస్కారం ప్రధానం చేయనున్నారు. ఈ మేరకు గురజాడ సాంస్కృతిని సమాఖ్య ప్రతినిధులు పీవీ నరసింహరాజు, డాక్టర్ ఎ గోపాలరావు, కాపుగంటి ప్రకాశ్‌లు మీడియాకు వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు జేపీ సోమయాజులు, గొల్లపూడి మారుతీరావు, డా.సినారె, అంజలీదేవి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వంటి ఎందరికో అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

## వేంకటేశ్వరుని ఆలయంలో అన్నసమారాధన



**కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** తూర్పుగోదావరి జిల్లా అమలాపురం పట్టణం మహిపాలవీధిలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో పవిత్ర కార్తీకమాసం మూడవ శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే స్వామివారికి పంచామృతాభిషేకాలు, దత్తమూర్తులకు అభిషేకాలు, సుదర్శనం హోమంను వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో 1500 మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కర్రి రామస్వామి(దత్తుడు), ఆలయ కార్యనిర్వహణాధికారి వివిఎస్ఎన్.మూర్తి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు సంగినీడి గణేష్, బసవా సింహాద్రి, అక్కిరెడ్డి సురేష్, కుంచే వెంకన్నబాబు, ఆచంట మూలాస్వామి, పేరూరు విజయలక్ష్మి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖ ఈవో మృతికి ఉద్యోగుల సంతాపం

**కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** దేవాదాయా శాక ఈవో ఎన్.రామకృష్ణ మృతికి అమలాపురం దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. పేరూరు గ్రూపు దేవాలయాలకు ఈవోగా పనిచేస్తున్న ఎన్.రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, జిల్లా ఈవోల సంఘం అధ్యక్షుడు బొక్కా వీరవెంకటేశ్వరరావు, కోశాధికారి బళ్ల నీలకంఠం, జవ్వాది ప్రసాద్, సలాది రామచంద్రమూర్తి, యు.గంగాధరం, ఐ.బాలకృష్ణ, డి.అన్నవరం, పెద్దింటి రాజు, కుడుపూడి శ్రీహరి, వేమన రామానుజ, ఎస్.శ్రీనివాస్, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ముమ్మిడివరంలో కేశవస్వామి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న ఎన్.రామకృష్ణ మృతిపట్ల పాలకవర్గ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నడింపల్లి శ్రీనివాసరాజు, పాలవర్గ సభ్యులు, కొయ్యల దుర్గారావు, చింతపల్లి రాజు, జె.రాంబాబు, గుత్తుల నాగు, పొత్తూరి నాగరాజు, ఎస్.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తూర్పున చంద్రన్న బీమాలో 19.36లక్షల మంది చేరిక

**టిఎన్‌టియుసి నేత గల్లా రాము**



**(కోనసీమ న్యూస్-జీఎన్.రావ్) :** తూర్పుగోదావరి జిల్లాలో నవంబర్ 15వ తేది నాటికి 19లక్షల 36వేల 194 మంది చంద్రన్న భీమాలో ప్రజాసాధికార సర్వే ప్రకారం చేరారని రాష్ట్ర టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి గల్లా రాము పేర్కొన్నారు. అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామంలో కోనసీమ డ్రైవ్, వాటర్ కోకోనట్ పర్మామణి లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. గల్లా రాము ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సమావేశంలో ప్రసంగించారు. అమలాపురం నియోజకవర్గంలో లక్షా ఆరువేల 68 మంది చంద్రన్న బీమాలో చేరారని వివరించారు. అమలాపురంలో 51వేల 728 మంది, అల్లవరంలో 28వేల 333మంది, ఉప్పలగుప్తంలో 51వేల 7మంది అసంఘటిత కార్మికులకు ధీమాగా చంద్రన్న భీమాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ప్రారంభించారని అన్నారు. ప్రమాద మరణం, పూర్తి అంగవైకల్యంకు రూ.5లక్షలు, పాక్షిక, శాశ్వత అంగవైకల్యంకు రూ.3లక్షల 62వేల 500, సహజమరణంకు రూ.30వేలు, తొమ్మిది, పది, ఇంటర్, ఐటిఐ చదివే ఇద్దరు పిల్లలు ఒక్కొక్కరికి రూ.1200 ఉపకార వేతనం లభిస్తుందని రాము కార్మికులకు వివరించారు. మరణ సమాచారాన్ని కాల్ సెంటర్ నంబర్ 155214కు ఫోన్‌చేసి ఆధార్ లేదా బీమా పాలసీ నంబరు తెలియజేయాలన్నారు. మరణ సమాచారం ధ్రువీకరించిన 48 గంటల్లో బీమా మిత్ర ద్వారా రూ.5వేలు కార్మికుని కుటుంబానికి దహన ఖర్చుల నిమిత్తం చెల్లిస్తారన్నారు. బీమాలో నమోదుకాని అసంఘటిత రంగ కార్మికులకు కూడా చంద్రన్న బీమా అమలు చేయాలని ప్రభుత్వం భావించిందని అన్నారు. 30రోజుల్లో క్లైయిమ్స్‌కు పరిష్కారం లభిస్తుందన్నారు. అలాగే చంద్రన్న బీమాలో కార్మికులు చేరాలని రాము కోరారు. సంఘ అధ్యక్షులు ఎన్.పాపారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్మిక నాయకులు కర్నీడి శ్రీనివాసరావు, డేగల సూరిబాబు, రాచూరి యేసు, చొల్లంగి శ్రీరాములు, మొయిల నాగేశ్వరరావు, ముత్యాల శ్రీను, కావలి నాగేశ్వరరావు, కుడుపూడి వెర్రియ్య, నూకల నారాయణరావు, చింతపల్లి పాపారావు, చవ్వాకుల శివ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

**కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** భారత మాజీ ప్రధాని, దివంగత కాంగ్రెస్ నేత ఇందిరాగాంధీ శతజయంతి వేడుకులు ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో స్థానిక పోలమ్మ చెరువుగట్టు వద్దనున్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుద్దటి వెంకట్రావు, జి.నాగేశ్వరరావు, మానేపల్లి సత్యనారాయణ, పి.ఉదయభాస్కరవర్మ, వి.నాగేశ్వరరావు, కాశి లక్ష్మణస్వామి, బొర్రా విష్ణు, సబ్బతి శేఖర్, గణేశుల బ్రహ్మానందం, కుడిపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



# సుందర అమరావతి



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** నవ్యాంధ్ర నూతన రాజధాని అమరావతిలో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వెలగపూడి తాత్కాలిక సచివాలయాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు. పచ్చిక బయళ్లు, మోండో గడ్డి, మొక్కల పెంపకం, నడక దారుల నిర్మాణం వంటి సుందరీకరణ పనులు ప్రారంభించారు. సుమారు4.5 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. వచ్చే నెల నుంచి పూర్తి స్థాయిలో సచివాలయం నుంచి పరిపాలన సాగిస్తానని ముఖ్యమంత్రి ప్రకటించడంతో గ్రీనరీ పనులు వేగం పుంజుకున్నాయి.దాదాపు రూ.660 కోట్ల అంచనా వ్యయంతో వెలగపూడిలో 6 బ్లాక్‌లతో సచివాలయం నిర్మాణం చేపట్టిన విషయం తెల్సిందే. దీనిలో ఒక బ్లాక్ అసెంబ్లీ, మండలి భవనాలకు కేటాయించి, మిగిలిన 5 బ్లాక్‌లు సచివాలయానికి కేటాయించారు.ఈ 5 బ్లాక్‌ల్లో ఒక బ్లాక్ పూర్తిగా సీఎంఓకు కేటాయించగా, ఇంటీరియర్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సచివాలయ ప్రాంగణంలో 6 బ్లాక్‌లకు మధ్యభాగంలో ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా పార్కు నిర్మితమవుతోంది. బ్లాక్‌ల మధ్య డబుల్ లైన్ రోడ్ల మధ్య సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ ఏర్పాటుతోపాటు, బ్లాకుల వారీగా ముందు, మధ్య భాగాల్లో కూడా పచ్చదనం నింపుతున్నారు. పూల మొక్కలకు ప్రసిద్ధి చెందిన తూర్పుగోదావరి జిల్లా కడియం, కోల్‌కత్తా, బెంగుళూరుల నుంచి పలు రకాల అందమైన మొక్కలు తెప్పించారు. ఈ ప్రాంతంలో మొత్తం 92 వేల మొక్కలు నాటి కనువిందు చేయనున్నారు. 32,469 చదరపు మీటర్లలో పచ్చిక బయళ్ళు, 42 వేల మోండో గడ్డి మొక్కలు పెంచడానికి ఏర్పాట్లు చేశారు. ఒక కిలోమీటరు వాకింగ్ ట్రాక్ నిర్మించి, మరో 1342 మొక్కలతో నేలనంతటినీ పచ్చదనంతో నింపారు.

**తుళ్లూరు చెరువు రూపురేఖలు మార్చిన సీఆర్‌డీఏ**

పిచ్చి చెట్లు, మురుగు వాసనతో ఉండే తుళ్ళూరు చెరువు ప్రస్తుతం పర్యాటక ప్రదేశంగా రూపుదిద్దుకుంది. రూ.80 లక్షల అంచనా వ్యయంతో సీఆర్‌డీఏ దీని అభివృద్ధికి చర్యలు చేపట్టింది. సుమారు 1.8 కిలోమీటర్ల పొడవైన చెరువు గట్టును అత్యంత సుందరంగా తీర్చిదిద్ది వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. చెరువు కట్ట చుట్టూ వివిధ రకాల 107 మొక్కలు నాటారు. 8,421 పూల మొక్కలను ఏర్పాటు చేసి, 646 కొబ్బరి చెట్లు నాటారు. 2,200 చదరపు మీటర్ల స్థలంలో పచ్చికబయళ్ళు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా, అత్యంత సుందరంగా తీర్చిదిద్దడానికి వివిధ రూపాల్లో కత్తిరించిన (టాపియరీ) 98 మొక్కలను ఏర్పాటు చేస్తున్నారు.నూతన రాజధాని నిర్మాణ ప్రదేశాన్ని కూడా అందంగా రూపొందిస్తున్నారు.

## శాంతి బహుమతి రేసులో భారతీయ బాలిక



**దుబాయ్ :** అంతర్జాతీయ చిన్నారుల శాంతి బహుమతి రేసులో దుబాయ్‌కి చెందిన భారతీయ బాలిక నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 120 ఎంట్రీలు రాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన భారత సంతతి కెహకషన్‌బసు(16), కేమరూన్‌కు చెందిన దివినా మాల్యూమ్,సిరియాకు చెందిన ముజాన్ అమ్మెలిన్‌లు ఎంపికయ్యారు. విశ్వభాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అంతర్జాతీయ చిన్నారుల హక్కుల సంస్థ 'కిడ్స్ రైట్స్ ' విజేతకు ప్రకటించనుంది. రేసులో ఉన్న ముగ్గురు చిన్నారులు పిల్లల హక్కుల సాధన కోసం ఎంతగానో కృషి చేసినట్టు సంస్థ పేర్కొంది. 2006లో సాహిత్య పురస్కారాన్ని అందుకున్న మహ్మద్ యూనస్ చేతుల మీదుగా విజేతకు డిసెంబరు 2న హేగ్‌లో ఈ అవార్డును అందించనున్నారు. బసు ఎనిమిదేళ్ల వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై ప్రచారం నిర్వహిస్తోంది. 2012లో గ్రీన్ హోప్ పేరుతో ఓ సంస్థను స్థాపించింది. చెత్త సేకరణ, బీచ్‌ల నిర్వహణపై ప్రచారం చేసింది. ఈ సంస్థ తరపున ప్రస్తుతం వెయ్యిమంది వాలంటీర్లు వస్తున్నారు.

## నోట్ల రద్దుతో దీర్ఘకాల వెతలు : చిదంబరం



**ముంబై:** పెద్దనోట్ల రద్దుతో దీర్ఘకాలం పాటు తిప్పలు తప్పేట్లు లేదని కాంగ్రెస్ నేత, మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం అన్నారు. రూ.500,రూ.1000 నోట్ల రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించలేదని అభిప్రాయపడ్డారు. ఈ తొందరపాటు చర్య వల్ల ప్రజలు దీర్ఘకాలం పాటు ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొవాల్సిన పరిస్థితి కనిపిస్తోందన్నారు. నోట్ల రద్దు వ్యవహారంలో కేంద్రం ప్రధాన ఆర్థిక సలహారుడిని సంప్రదించినా అన్న సందేహం కలుగుతోందని చిదంబరం అన్నారు. ఆస్తులను స్వాధీనం చేసుకోవడం జరుగుతోందన్నారు. ప్రజలకు ఏసీబీని అనుసంధానం చేసే విధంగా సిబ్బంది సహకారాన్ని వినియోంచుకుంటానని ఆయన చెప్పారు. రహస్య ఏజెన్సీని ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని, దేశ రక్షణలో సైన్యం ఏవిధంగా అంకిత భావంతో పనిచేస్తుందో ఏసీబీ అధికారులు కూడా అదే స్థాయిలో పనిచేయాలని ఠాకూర్ సూచించారు. తర్వాత రెండో ఆదేశం పరిణామాలను చూస్తారు' అని చిదంబరం అన్నారు. ముంబై లిట్‌ఫెస్ట్‌లో పాల్గొన్న చిదంబరం అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'ప్రభుత్వంలో ఉన్న ఏకైక ఆర్థిక నిపుణుడు డా॥ అరవింద్ సుబ్రహ్మణ్యన్.. ఈ విషయంలో ఆయనను సంప్రదించలేదని అనిపిస్తోంది' అని చిదంబరం ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'ప్రభుత్వ ఆదేశాలతో చాలా తక్కువగా ఖర్చు చేస్తున్నవారు ప్రస్తుతం చాలా మందే ఉన్నారు. సత్ఫలితంగా త్వరగా పాడయ్యే కూరగాయలు , పండు, వంటివి అమ్ముడవటం లేదు' అని అన్నారు. రెండో ఆదేశాల ప్రభావం తిరువూర్, సూరత్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. రైతుల మీద దీని ప్రభావం తీవ్రంగా ఉంది. విత్తనాలు, ఎరువులు కొనేందుకు, కూలీలకు డబ్బులు ఇచ్చేందుకు కూడా రైతన్నల వద్ద నగదు లేదని చిదంబరం చెప్పారు. ఏదిఏమైనా నోట్ల రద్దుతో ప్రతికూల ప్రభావమే ఎక్కువగా కనిపిస్తోందని, అయితే ఇప్పుడే నష్టాన్ని అంచనా వేయడం తొందరపాటే అవుతుందని చిదంబరం అభిప్రాయపడ్డారు.

## 82,500 ఏటీఎంల పునరుద్ధరణ

**న్యూఢిల్లీ :** పెద్ద నోట్ల రద్దుతో ఎటీఎంలు మూతపడ్డ విషయం తెలిసిందే. దేశంలోని 40 శాతం విత్‌డ్రాలు ఏటీఎంల ద్వారానే జరుగుతున్నాయి. ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన రూ.500, రూ.2000 నోట్ల రూపాయలు విత్‌డ్రా చేసుకోవడాని ఏటీఎంలలో సాఫ్ట్‌వేర్‌తో పాటు హార్డ్‌వేర్‌లలో మార్పులు చేర్పులు చేయాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న 2.2 లక్షల ఎటీఎంలలో సోమవారం సాయంత్రం వరకు 82,500 ఏటీఎంలు పునరుద్ధరించారు. ప్రభుత్వం ఏటీఎంల పునరుద్దణకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన మార్పులు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌ఈఐ డిప్యూటీ గవర్నర్ ఎస్ ఎస్‌ముంద్రా దీనికి నేతృత్వం వహిస్తున్నారు. ఏటీఎంల పునరుద్ధరణ తర్వాత ఒక్కో ఏటీఎంలలో రూ.50-రూ.60 లక్షల వరకు నగదు పేర్చవచ్చునని, దీంతో ప్రజల నగదు కష్టాలు తీరిపోతాయన్నారు. సాంకేతిక మార్పులు చేయడానికి ముందు రూ.100 నోట్లు రూ.5 లక్షల వరకు మాత్రమే పేర్చడానికి వీలుండేదని ప్రెసిడెంట్ క్యాష్ లాజిస్టిక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రితురాజ్ సిన్హా చెప్పారు. రోజుకు 12 వేల నుంచి 14 వేల ఏటీఎం మిషన్‌లను పునరుద్దరించడం జరుగుతోందని .. త్వరలోనే నగదు సరఫరా గాడినపడుతుందన్నారు. ఏటీఎంలలో సాంకేతిక మార్పులకు సిబ్బంది ఇరవై నాలుగు గంటలు పనిచేస్తున్నారన్నారు.

## మార్చి మూడో వారంలో టెన్త్ పరీక్షలు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :**ఇదే క్రమంలో పదో తరగతి పరీక్షలను కూడా మార్చి మూడో వారం నుండి నిర్వహించేందుకు ఎస్.ఎస్.సీ బోర్డు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే 13 జిల్లాల విద్యాశాఖాధికారులతో సంప్రదింపులు చేసింది. చాలా చోట్ల సిలబస్ పూర్తి కాలేదని విషయం బోర్డు దృష్టికి రావడంతో సంబంధిత డీఈఓల నివేదికలు, వారి సూచనల ప్రకారంగా పరీక్ష తేదీలను ఖరారు చేయాలని ఎస్.ఎస్.సీ బోర్డు అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు దాదాపు 6045 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యే అవకాశాలున్నాయి. వీరిలో మరో 1.39 లక్షల మంది ప్రైవేటుగా పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిసింది. మొత్తం 7.84 లక్షల మంది పరీక్షలు రాయనున్నారు. దీంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు అందాయి.

**పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు**

గత రెండు, మూడేళ్లుగా వార్షిక పరీక్షల్లో తరగతి గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన కళాశాలలు 2017 మార్చిలో జరిగే పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు కళాశాలల బయట కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత కళాశాలల యాజమాన్యాలకు ఉన్నత విద్యాశాఖ సమచారం అందించినట్లు తెలుస్తోంది. కళాశాలల బయట, పరీక్షహాలులో అమర్చిన సిసి కెమెరాలను జిల్లా విద్యాశాఖ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసే కంట్రోల్ రూంలకు అనుసంధానం చేస్తారు. దీంతో ఏయే జిల్లాల్లో పరీక్షలు ఎలా జరుగుతున్నాయో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూంకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది. ప్రభుత్వానికి ప్రతీ రోజూ పరీక్ష పూర్తయిన గంటలోపు పూర్తి సమాచారాన్ని అందించనున్నారు. కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసుకునే సీసీ కెమెరాలకు ఆయా కళాశాలలే పూర్తి ఖర్చులు భరించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలకు నిధులు మంజూరు విషయంలో ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుంది.

## కాపు కార్పొరేషన్ శిక్షణకు స్పందన కరువు

**27 వరకు దరఖాస్తు గడువు పెంపు**

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** నిరుద్యోగులకు ఉపకార వేతనాలనిస్తూ శిక్షణనిస్తామని కాపు కార్పొరేషన్ చేస్తున్న ప్రకటనలకు స్పందన అంతంతమాత్రంగానే ఉంది. గ్రూపు-2 కోసం 1800 మందికి, గ్రూపు-3 కోసం 2500 మందికి శిక్షణనివ్వాలని కాపు కార్పొరేషన్ నిర్ణయించింది. ఆదివారంలో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. గ్రూపు-2 కింద 873, గ్రూపు-3 కింద 216 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దీంతో దరఖాస్తులు స్వీకరణ గడువును ఈ నెల 27 వరకు పొడిగించారు.తెల్లరేషన్‌కార్డు ఉండటం లేదా వార్షికాదాయం రూ.ఆరు లక్షల లోపున్న వారు దరఖాస్తు చేసుకునే అవకాశాన్నిచ్చారు. ఒక్కో అభ్యర్థికి రూ.8 వేల ఉపకార వేతనంతో కూడిన శిక్షణనిచ్చేందుకు కాపు కార్పొరేషన్ సిద్ధంగా ఉంది. ఒక్కొక్కరిపై రూ.20 వేల వరకు ఖర్చు చేయనుంది. అర్హతలపరంగా అభ్యర్థులు లక్షల్లో ఉన్నా ఆశించిన మేరకు దరఖాస్తులు రాకపోవడం చర్చనీయాంశమైంది. మరోవైపు డిసెంబరు మొదటి వారంలోనే శిక్షణ ప్రారంభించేందుకు సన్నాహాలు చేపడుతున్నారు.గ్రూప్-3 ప్రకటన వెలువడనప్పటికీ ముందస్తుగా అభ్యర్థులను సన్నద్ధం చేసేందుకు శిక్షణ నివ్వనున్నారు.

**జే ఎన్‌టీయూ కాకినాడ ద్వారా పరీక్ష :** గ్రూప్-1, శిక్షణ కోసం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పరీక్షను జేఎన్‌టీయూ కాకినాడ ద్వారా నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు. 1500 మంది అభ్యర్థులను పరీక్ష ద్వారా ఎంపిక చేయాలని అధికారులు భావిస్తున్నారు. శిక్షణకు ఒక్కో అభ్యర్థికి రూ.50వేల చొప్పున రూ తొమ్మిది కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. యూపీఎస్సీ సివిల్స్ శిక్షణ ఇచ్చేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షను 2400 మంది రాశారు. వీరిలో 500 మందిని ఎంపికచేసి శిక్షణనిస్తున్నారు. వీరికి ఉపకార వేతనం కింద రూ.పది వేలు ఇస్తున్నారు.

## ఆగిన పెళ్లి బాజాలు

- ఆర్బీఐ కఠిన నిబంధనలవల్లే...
- రూ.2.50 లక్షలు ఇవ్వడం ఇంకా
- ప్రారంభం కాలేదు : బ్యాంకర్లు

**కేంద్రపర/ జైపూర్:** వివాహ కార్యక్రమాల కోసం రూ.2.50 లక్షల విత్‌డ్రాయల్‌కు సంబంధించి ఆర్‌బీఐ విధించిన కఠినమైన షరతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కఠిన నిబంధనల కారణంగా వివాహాలు చేసుకునే కుటుంబాలు ఇప్పటికీ బ్యాంకుల నుంచి రూ.2.50 లక్షలు తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఆప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ వ్యాఖ్యలు చేసింది బాధితులు కాదు. స్వయానా బ్యాంకు అధికారులే ఈ విషయాన్ని అంగీకరిస్తున్నాయి. వివాహ కార్యక్రమాల నిర్వహణకు రూ.2.50 లక్షలు తీసుకోవడానికి వెసులుబాటు కల్పిస్తున్నట్టు మోడీ ప్రభుత్వం ప్రకటించినా బ్యాంకుల నుంచి అది అమలు ప్రారంభం కాలేదని, ఆర్‌బీఐ కఠిన నిబంధనలే ఇందుకు కారణమని ఒడిశాలోని కేంద్రపరలో ఓ బ్యాంకు అధికారి వెల్లడించారు.వివాహ కుటుంబాలకు రూ.2.50లక్షల విత్‌డ్రాయల్‌కు సంబంధించి బ్యాంకర్లకు విధానపరమైన సర్క్యులర్లు అందినప్పటికీ ఈ ప్రక్రియ ఇంకా చేపట్టలేదని ఆయన వివరించారు. 'ఇది నా సహనానికి పరీక్ష, బ్యాంకర్లు అనేక నిబంధనలు చెబుతున్నారు. ఆర్‌బీఐ మా ముందుంచిన నిబంధనలు చాలా సంక్లిష్టంగా ఉన్నాయి.నేను కూడా వివాహం వాయిదా వేసుకున్నా, వరుని కుటుంబం సైతం ఇవే కష్టాలు ఎదుర్కొంటున్నది' అని ఓ ఖాతాదారు ఫకీర్ చరణ్ ప్రమాణిక్ ఆవేదన చెందారు. ప్రమాణిక్ తరహాలోనే ఆర్థిక వ్యవహారాల శాఖల్లో పనిచేస్తున్న చాలా మంది బాధలు పడుతున్నారు. వివాహం కోసం కేవలం రూ.2.50 లక్షలు మాత్రమే బ్యాంకుల నుంచి తీసుకోవాలన్న నిబంధన అర్థం లేనిదని వ్యాఖ్యానిస్తున్నారు. 'వివాహాలకు డబ్బుతీసుకునే పరిమితిని సడలిస్తూ ప్రభుత్వం ప్రకటన చేసింది. సడలింపు ప్రకటించిన నాటి నుంచీ ప్రతిరోజూ నేను బ్యాంకుకు వస్తున్నా ,అధికారిక ప్రకటన ఇంకా మాకు అందలేదని ప్రతిసారీ బ్యాంకు అధికారులు చెబుతూ వచ్చారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు మాకు అందలేదన్నారు. ఈ రోజు నేను మళ్లీ బ్యాంక్‌కు వచ్చాను. నా ఖాతా నుంచి రూ.2.50 లక్షలు విత్‌డ్రాయల్ చేసుకోవచ్చు... లేదో నాకు తెలియడం లేదు. పెళ్లికి సంబంధించి నాకు సమయం దగ్గరపడుతోంది. నవంబరు 26న నా కుమారుడి వివాహం నిశ్చయించాం' అని ఓ స్థానికుడు ఆవేదన వెలబుచ్చారు. నగదు సంక్షోభం మెరుగుపడేంత వరకు పెద్ద మొత్తాల విత్‌డ్రాయల్‌ను నిలిపివేస్తే మంచిది. పెద్దమొత్తం తీసుకోవడానికి అనుమతిస్తే బ్యాంకులు స్తంభించిపోతాయి. ఖాతాదారులు సైతం డబ్బు తీసుకోకుండా వెనుదిరిగి పోవాల్సిందే'నని కేంద్ర పరలోని ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ మేనేజరు పార్థ మజుందార్ తెలిపారు. జైపూరులోనూ ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. బ్యాంక్ అధికారులు తమ కష్టాలను ఏ కరువు పెడుతున్నారు. ఖాతాదారులు అంత కన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## డిసెంబరు 1 నుంచి నిత్యావసర సరకుల సరఫరా

- త్వరలో జైళ్ల సంస్కరణలు ..
- అర్హులందరికీ ఇళ్లు, ఫించన్లు
- సీఎం చంద్రబాబు నాయుడు



**రాజధానిప్రతినిధి, రాజమహేంద్రవరం :** రాష్ట్రంలోని రేషన్ డిపోల ద్వారా డిసెంబరు 1 నుంచి నిత్యావసర సరకుల సరఫరా చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. శనివారం ఉదయం పది గంటలకు ప్రత్యేక విమానంలో మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, ఎంపీ మాగంటి మురళీమోహన్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, పెందుర్తి వెంకటేష్, డాక్టర్ ఆకుల సత్యనారాయణ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి కారులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి చేరుకున్న ముఖ్యమంత్రి రూ.7 కోట్లతో నిర్మించిన పరిపాలనా విభాగం భవనాన్ని ప్రారంభించారు. కారాగారం లోపల ఖైదీల కోసం నిర్మించనున్న 50 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ఖైదీలతో మాట్లాడారు. ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చి బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. చిన్న తప్పులకు పెద్ద శిక్షలు పడకుండా చట్టాల్లో మార్పు తెస్తామని చెప్పారు. ఖైదీల ఆలోచనా విధానంలో మార్పు రావాలని, వారి కష్టాలు తగ్గించడానికి సంస్కరణలు చేపడతామన్నారు. ఖైదీ బ్రహ్మం, అతని సహచరులు ప్రత్యేకంగా తయారు చేసిన కుర్చీని సీఎంకు బహుకరించారు. ఆ కుర్చీలో ముఖ్యమంత్రి ఆశీనులై వారిని అభినందించారు. అనంతరం శాటిలైట్ సిటీ గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించే రైతు బజార్, చేపల మార్కెట్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, జనచైతన్య యాత్రలో పాల్గొన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి కోసమే పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. 2017 జూన్ నాటికి అర్హులైన వారందరికీ నూరుశాతం వంటగ్యాస్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామనీ, చంద్రన్న బీమా పథకం ద్వారా ఐదు లక్షల వరకు సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. పేద విద్యార్థుల విదేశీ ఉన్నత విద్యకు రూ.10లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్ళన్నీ అత్యాధునిక వసతులతో రెసిడెన్షియల్ పాఠశాలలుగా మారుస్తున్నామన్నారు. ఎంపీలు తోట నరశింహం, పండుల రవీంద్రబాబు, టిడీపీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణాలకు ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరి

**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాల్లో భవన నిర్మాణాలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా అనుమతుల తప్పనిసరిగా తీసుకోవాలని ఏపీ సీఆర్‌డీఏ జోనల్ డిప్యూటీ డైరెక్టర్ బి.బాలాజీ చెప్పారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి అనుమతులపై గ్రామ కార్యదర్శులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భవన నిర్మాణాల ప్లాన్‌లు, లేఅవుట్ల అభివృద్ధి అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని, నేరుగా స్వీకరించడం జరగదని ఆయన స్పష్టం చేశారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నుంచి గృహ నిర్మాణ ప్రణాళికను తయారు చేయించి అనుమతుల తీసుకోవాలని వివరించారు. అలాగే వారసత్వ స్థలాలకు, బీఫాం పట్టాలకు డాక్యుమెంట్లు సమర్పించే అంశంపై సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో టీపీఎస్ కామేశ్వరి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పావని తదితరులు పాల్గొన్నారు.

## పృథ్వి - 2 పరీక్షలు విజయవంతంగా నిర్వహించిన సైన్యం



**బాలాసోర్ :** స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన అణ్యస్త్ర సామర్థ్య క్షిపణి పృథ్వి-2 ను భారత్ సోమవారం రెండు సార్లు విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని చాందీపూర్‌లో ఉన్న సమీకృత పరీక్షా వేదిక (ఐటీఆర్) నుంచి ఈ ప్రయోగాలు జరిగాయి. ఈ రెండు పరీక్షలు వెనువెంటనే జరగడం విశేషం.శిక్షణ అభ్యాసంలో భాగంగా సైన్యం ఈ పరీక్షను చేపట్టింది.

**పృథ్వి-2...** ఉపరితలం నుంచి ఉపరితలం పైనున్న లక్ష్యాలను ఛేదించేందుకు ఉపయోగపడుతుంది. దీని పొడవు 9 మీటర్లు,350 కిలోమీటర్ల దూరం దూసుకెళుతుంది. 500 నుంచి వెయ్యి కిలోల వరకూ వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు. ద్రవ ఇంధనంతో పనిచేసే రెండు ఇంజన్లు ఇందులో ఉన్నాయి. ఆధునాతన ఇనర్షియల్ గైడెన్స్ వ్యవస్థ సాయంతో లక్ష్యాన్ని గురి తప్పకుండా ఛేదిస్తుంది. సమీకృత నిర్దేశిత క్షిపణి అభివృద్ధి కార్యక్రమం కింద రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఉత్పత్తి చేసిన మొదటి క్షిపణి ఇదే .2003 లో దీన్ని సైనికదళాల్లో ప్రవేశపెట్టారు. ఉత్పత్తిఅయిన క్షిపణుల నుంచి రెండింటిని యాదృచ్ఛికంగా రెండింటిని ఎంచుకొని తాజా పరీక్షలు నిర్వహించారు. బంగాళాఖాతంలో ఈ క్షిపణికి లక్ష్యంగా నిర్దేశించిన ప్రదేశం వద్ద మోహరించిన నౌకలు కూడా పరిశీలన సాగించాయి. 2009 అక్టోబర్ 12న కూడా ఇదేరీతిలో ఈ అస్త్రాన్ని వెనువెంటనే రెండుసార్లు విజయవంతంగా పరీక్షించారు.

## నోటు పోటుతో మద్యం కొనుగోళ్లు ఢమాల్

**గణనీయంగా తగ్గిన విక్రయాలు రాష్ట్ర ప్రభుత్వాల గగ్గోలు**



**న్యూఢిల్లీ :** పెద్దనోట్ల రద్దు లిక్కర్ అమ్మకాలపై గణనీయంగా పడింది. రూ.500, రూ.1000 నోట్ల రద్దుపై నరేంద్రమోడీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో దేశవ్యాప్తంగా లిక్కరు అమ్మకాలు తగ్గాయి. సాధారణంగా భారతదేశంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు లిక్కరు ఆదాయంపైనే నడుస్తున్నాయి. ఇది కాదనలేని సత్యం. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు టార్గెట్లు పెట్టి మరీ మద్యం అమ్మకాలు పెంచుతున్నాయి. ఎక్సైజ్ ఆదాయం లేకపోతే అరకొర సంక్షేమ కార్యక్రమాలు కూడా కొనసాగించలేని పరిస్థితి ఉన్నది. మద్య నియంత్రణ, అక్రమ మద్యాన్ని అడ్డుకోవడం, కల్తీ మద్యాన్ని నిలుపుదల చేయడం ఎక్సైజ్ ప్రధాన కర్తవ్యం. అయితే, రాష్ట్ర ప్రభుత్వాలకు మాత్రం ఆ శాఖ పెద్ద ఆదాయ వనరు. ఎందుకంటే టార్గెట్లు పూర్తి చేయడానికి పోలీసులతోనే మద్యం విక్రయిస్తున్న ప్రభుత్వాలు మన కళ్లముందే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పెద్దనోట్ల రద్దుపై మోడీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో లిక్కరు అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. ఆదాయాలు పడిపోయాయి. చేతిలో చిల్లర నోట్లు లేక మద్యం ప్రియులు నోరు కట్టేసుకుంటున్నారు. ఇక్కడ ఒడిశా విషయాన్ని పరిశీలిద్దాం.

పెద్ద నోట్ల రద్దుతో ఒడిశా వ్యాప్తంగా మద్యం అమ్మకాలపై ప్రతికూల ప్రభావం పడింది. ఏటీఎంలు, బ్యాంకుల వద్ద క్యూలు పెరగడంతో అన్ని మద్యం దుకాణాలలో విక్రయాలు తగ్గాయి. రాష్ట్రంలో 3843 లిక్కరు దుకాణాలు విక్రయాలు ఉన్నాయి. పెద్దనోట్ల రద్దుతో 50శాతం దుకాణాల్లో విక్రయాలు తగ్గినట్టు వార్తలు అందాయి. ఈ వివారాలను ఎక్సైజ్ శాఖ అధికారి వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3,300 కోట్లు రాబట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. అయుతే నోట్లరద్దు ప్రభావం ఎక్సైజ్ రెవెన్యూపై బాగా పడిందని ఆ అధికారి వివరించారు. 2015-16లో ఎక్సైజ్ సేకరణ రూ.2568 కోట్లు. ఈఏడాది అదనంగా రూ.800 కోట్లు వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఒడిశా రాష్ట్ర బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎస్‌బీసీ) ద్వారా లైసెన్సు దుకాణాలకు మద్యం సరఫరా అవుతుంది. ఇంతకుమందు కన్నా నవంబరులో అనేక జిల్లాల్లో కార్పొరేషన్ వ్యాపారం బాగా పడిపోయిందని అధికారి చెప్పారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మద్యం అమ్మకాలు బాగా తగ్గిందని తెలిపారు. దీనితోపాటు ఐఎంఎఫ్‌ఎల్, నాటుసారా విక్రయాలు కూడా బాగా పెరిగినట్లు ఎక్సైజ్ సిబ్బందికి అందిన సమాచారం. విక్రయ రికార్డులను ప్రతివారం తాము పరిశీలించనప్పటికీ ఐఎంఎఫ్‌ఎల్... నాటు సారా విక్రయాలు మాత్రం విపరీతంగా పెరిగినట్లు స్పష్టమైన సమాచారం ఉందని వెల్లడించారు. అన్నిరకాల మద్యం విక్రయాలు పడిపోయినట్టు క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారం. కేంద్రపర, సగదీష్ సింగ్‌పూర్ జిల్లాల ఎక్సైజ్ ఎస్పీలు రామ్‌నారాయణ్‌సేథ్, రజత్‌కుమార్ ప్రహరాజ్ మద్యం విక్రయాలపై అన్ని వివరాలు తెలిపారు. మద్యం దుకాణాలకు వచ్చే వినియోగదారుల సంఖ్య బాగా తగ్గిందని వివరించారు.

## పత్రికా సమాచార కార్యాలయ డైరెక్టర్‌గా విజయకుమార్‌రెడ్డి



**రాజధాని ప్రతినిధి, అమరావతి:** విజయవాడ పత్రికా సమాచార కార్యాలయం మొదటి డైరెక్టర్‌గా ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసుకు చెందిన తుమ్మ విజయకుమార్ రెడ్డి (టీవీ కే రెడ్డి) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన సమాచార ప్రసార మంత్రిత్వశాఖలోని పలు విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 25 సంవత్సరాల సర్వీసులో అసిస్టెంట్ రిజిష్టర్ ఆఫ్ న్యూస్ పేపర్స్, సెన్సార్ బోర్డు ప్రాంతీయ అధికారిగా, క్షేత్ర ప్రచార విభాగం తెలుగు రాష్ట్రాల డైరెక్టర్‌గా, హైదరాబాద్ పత్రికా సమాచార కార్యాలయం డైరెక్టర్‌గా.. వివిధ హోదాల్లో పని చేశారు. ఆంధ్రప్రదేశ్ పత్రికా సమాచార కార్యాలయాన్ని బలో పేతం చేసేందుకు విజయవాడ కార్యాలయానికి కొత్తగా డైరెక్టర్ పోస్టుని సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఈ మధ్యే మంజూరు చేసింది.

## నోట్ల సర్దుబాటులోనూ ఏపీకి అన్యాయం

**రాజధాని ప్రతినిధి, అమరావతి:** ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వకుండా అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వం కొత్త నోట్లను రాష్ట్రాలకు సర్దుబాటు చేసే విషయంలోనూ ఆంధ్రప్రదేశ్ పట్ల వివక్ష చూపుతోందని సీపీఐ విమర్శించింది.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే కేంద్రంతో మాట్లాడి కొత్త రూ.500 నోట్లను, రూ.1000 నోట్లను రాష్ట్రానికి రప్పించి చిల్లర సమస్య తీర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. నోట్ల రద్దు ఫలితంగా ప్రజల ఇబ్బందులపై కేంద్రాన్ని ప్రశ్నించినవారిపై ప్రధానమంత్రి ఎదురుదాడికి దిగుతున్నారని ఆక్షేపణ వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిని కుంభకోణాల్లో చిక్కుకున్న వారిగా చిత్రీకరించడం తగదన్నారు. చిల్లర నోట్లను విస్మరించి రూ.2000 నోలును తీసుకురావడంతో చిరువ్యాపారాలు అటకెక్కాయని, ప్రత్యామ్నాయ చర్యలు లేకుండా నోట్ల రద్దు ప్రకటన చేయటంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రామకృష్ణ అన్నారు.

## 104 వాహన ఒప్పంద ఉద్యోగుల నిరసన




జాతీయ రహదారి వెంట నిరసన తెలుపుతున్న ఒప్పంద ఉద్యోగులు

**రాజధాని ప్రతినిధి, విజయవాడ:** ఏపీ ఆరోగ్య కుటుంబసంక్షేమశాఖలో 104 చంద్రన్న సంచార చికిత్స వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఉదయం ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. విజయవాడ నగరానికి సమీపంలోని గొల్లపూడి గ్రామంలో ఉన్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ రాష్ట్ర కార్యాలయానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఉద్యోగులను తరలివచ్చారు. హైదరాబాద్ వెళ్లే జాతీయరహదారిపై ఉద్యోగులు కొద్దిసేపు నిరసన తెలియజేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వాహనాల్లో పోలీసు స్టేషన్లకు తరలించారు.

## పోలీసు కుటుంబాలకు ఆదుకుంటాం

**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** పోలీసు శాఖలో పని చేస్తూ మృతి చెందిన వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని రూరల్ ఎస్పీ నారాయణ నాయక్ అన్నారు. మార్చి 23న మృతి చెందిన కానిస్టేబులు కామేశ్వరరావు కుటుంబ సభ్యులకు భద్రతా పథకం కింద రూ.3.98 లక్షలు, మే 14న మృతి చెందిన కానిస్టేబులు రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు రూ.3.85 లక్షల చెక్కులను సోమవారం రూరల్ ఎస్పీ నారాయణ నాయక్ చేతుల మీదుగా తన కార్యాలయంలో అందజేశారు. ఏఎస్పీ రామాంజనేయులు పాల్గొన్నారు.

# రూ.5కోట్ల బంగారు లెహంగా...



కంచె సినిమాలో వరుణ్‌తేజ్ హీరోయిన్‌గా అందరి ప్రశంసలు అందుకున్న ప్రగ్యా జైస్వాల్ " ఓం నమో వెంకటేశాయ" సినిమాలో ప్రత్యేక పాత్ర పోషించనున్నారు. భక్తిరస ప్రధానమైన ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున హీరోగా, ఆయన నిర్మణ సారథ్యంలో దర్శకుడు రాఘువేంద్రరావు ఈ సినిమాను రూపొందిస్తున్నారు. వెంకటేశ్వరస్వామి భక్తుడు హాతిరాంబాబా జీవితం ఆధారంగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. 8 ఏళ్లుగా ఈ చిత్రంపై పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. హాతీరాంబాబాగా నాగార్జున నటిస్తున్న ఈ సినిమాలో రొమాంటిక్ పాట కోసం ప్రగ్యా జైస్వాల్‌కు 14 కిలోల బంగారంతో లెహంగాను తయారు చేయించారు. ఇంతవరకు దక్షిణభారత సినిమాల్లో ఇంత బంగారాన్ని ఎవరూ వాడలేదు. ఈ నెల చివరినాటికి చిత్రం పూర్తికానుంది. ఈ చిత్రంలో అనుష్క, మహాభారతంలో నటించిన సురబ్‌రాజ్‌జైన్, వెంకటేశ్వర స్వామిగా విమలారామన్ శ్రీదేవిగా నటిస్తున్నారు. పావని గంగారెడ్డి భూదేవిగాను, రమేష్, జగపతిబాబులు కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. మహేష్‌రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి మ్యూజిక్ చేస్తున్నారు. ఫిబ్రవరి 14న వాలంటైన్స్‌డేకు ఒక వారం ముందు ఈ సినిమాను విడుదల చేస్తామని చిత్ర యూనిట్ తెలుపుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడైన రాఘువేంద్రరావు అన్నమయ్య చిత్రంతో అందరి మన్ననలు పొందిన విషయం తెలిసిందే...

# బాలమురళికి 'మహతి' రాగ నివాళి

బాలమురళి సంగీత సామ్రాజ్యానికి సామ్రాట్.. ఆ మధుర గేయాలను తనివితీర విని శ్రవణానందం పొందాలనేగాని వర్ణించడం ఎవరి తరం కాదు... ఆయన యుగళగీతాలకు, కొంటెకోణంగి గీతాలకు ఆమడ దూరం... తత్వాలు ఆయన గొంతులో అమృత ధారలుగా కురుస్తాయి. శంకరాభరణంలో బాలసుబ్రమణ్యం పాడిన సామజవరగమన..లో శ్రుతులు తప్పుపట్టిన ఘనాపాటి. అకాడమీలను రద్దుచేసినందుకు ఆంధ్రుల అన్న ఎన్టీయార్‌నే ధిక్కరించిన ధీశాలి... ఏమాటకామాటే చెప్పుకోవాలి.. ఆంధ్రదేశం ఆయన్ని తగినంతగా సత్కరించలేకపోయింది. తమిళనాడే అనేక సార్లు అనేక జాతీయ అవార్డులకు ఎంపిక చేసింది.


నిర్మాతలు ఏది చెబితే అది రాసిచ్చే వేటూరిని వదిలేద్దాం... కాస్త ఆ బాటలోనే నడిచిన ఆత్రేయలూ, ఆరుద్రల్నీ వదిలేద్దాం.... గొప్పగొప్ప అనిపించుకున్న దాశరథులు శ్రీశ్రీలు సినారెలు సైతం సినిమా మాయలో పడి, ఏవేవో పిచ్చి గీతాలు రాసిన కాలంలో, పక్కా కమర్షియల్ బాలును వదిలేద్దాం. ఒక్కటంటే ఒక్కటీ తింగరి పాట నీ నోటి వెంట సినిమాలో వినిపించలేదు. నీతో అలాంటి గీతాలు పాడించడం ఏ ఒక్కరికీ చేతకాలేదు.. అదీ గ్రేట్.. సంగీత ప్రపంచంలో స్వచ్ఛమైన అమృతధార నీవు...ఎంగిలెంగిలంటవు...నువ్వుతాగే నీరు జంతువులు చేసే ఎంగిలి, నువ్వుతాగే పాలు.. దూడ చేసిన ఎంగిలి...నువ్వ తినే ఆకు ఈగ చేసిన ఎంగిలంటూ మీరు పాడిన తత్వం ఎన్నటికీ మరిచిపోలేం.. అందుకే మీకు మీ ఇష్టమైన మహతి రాగ నివాళిలర్పించుకుంటున్నాం...

– విజయ శ్రీ





కార్తీకమాసంలో పూలకు గిరాకీ ఉంటుంది. అయితే నోట్లరద్దు ఎఫెక్టు బంతిపూలపై కూడా పడింది. తాళ్లాయిపాలేనికి చెందిన రైతు బికారి రెండకరాల తోటలోని బంతిపూలు అక్కడే వదిలేశారు. నోట్లరద్దుకు ముందు కేజీ రూ.50 ఉండగా ఇప్పుడు 10 రూపాయలు కూడా లేదని ఆయన వాపోతున్నారు.



# ప్రజలు చైతన్యంతో పనులు చేయించుకోండి

**ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు భరోసా.**

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా).:** తన దృష్టిలో ఉన్న ప్రజల, గ్రామాల సమస్యలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నారని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జనం చైతన్యంతో తన తలుపు తట్టి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే శివరామరాజు భరోసా ఇచ్చారు. పెదపుల్లేరు, చెరుకువాడ, అర్తమూరు గ్రామాల్లో జన చైతన్య యాత్రలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ గ్రామాల్లో పార్టీ అధ్యక్షులు నడింపల్లి సత్తిబాబు, యిర్రింకి వీర వెంకట సత్యనారాయణ(బుజ్జి), కానుబోయిన వెంకటస్వామి పతాకాలను ఆవిష్కరించారు. పెదపుల్లేరు గ్రామంలో మాజీమంత్రి కలిదిండి అబ్బాయిరాజు విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కలిదిండి 25ఏళ్ల పాటు ఎమ్మెల్యే ఎన్నికై ఏకచ్ఛత్రాధిపత్యం సాధించారన్నారు. తదనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకుని ట్రాక్టరు నడిపి వారికి సంఘీభావం ప్రకటించారు. చెరుకువాడ గ్రామంలోని హైస్కూలుకు సీసీ రోడ్డుకు రూ5లక్షల జడ్పీ నిధులను, రాజులపేటలో సీసీ రోడ్డుకు రూ5లక్షల ఎమ్మెల్యే నిధులను, నూతిగట్టులో సీసీ రోడ్డుకు రూ7లక్షలు, గరువుపేటలో పంచాయితీకి వెళ్లే రోడ్డుకు రూ3లక్షల గ్రాంటులను మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తదనంతరం అర్తమూరు గ్రామంలో వైసీపీ నాయకులు చిదరబోయిన రామేశ్వరరావు, కందుల కాశీవిశ్వనాథం, దాసరి తులసి, కందుల ఆదినారాయణ, రామకూరి నందన్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యే శివ చేతుల మీతుగా తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. మూడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శివ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. కార్యక్రమాల్లో సర్పంచులు గేదల హేమలత, జయమంగళ కుమారి, కందుల తులసమ్మ, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, మోపిదేవి శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ గోపాలకృష్ణరాజు, జడ్పిటిసి కరిమెరక తులసి, ఎంపిటిసీలు నిర్మలారాణి, కట్టా సావిత్రినరసింహమూర్తి, మార్కెట్ యార్డు డైరెక్టరు ఉంగరాల నాగేశ్వరరావు, పిహెచ్‌సి చైర్మన్ కట్టా రాంబాబు, ఆలయ కమిటీల చైర్మన్లు పెన్మెత్స పద్మావతి, చిట్టిబొమ్మల నరిసింహమూర్తి, బ్యాంకు ఉపాధ్యక్షులు గోనబోయిన త్రిమూర్తులు, బ్యాంకు డైరెక్టరు సూరగన మురళి, కట్టా గంగాధరరావు, నడింపల్లి వెంకట్రాజు, కృష్ణరాజు, సూర్యనారాయణరాజు, కోట వెంకటేశ్వరరావు, రాజారావు, యస్సయ్య, చంటిరాజు, తేలి రాజారావు, కరిమెరక శ్రీనివాసరావు తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చెరుకువాడలో సర్పంచుల చాంబరు అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాసు మాట్లాడుతున్న దృశ్యం

# గ్రామాల అభివృద్ధే తెలుగుదేశం ధ్యేయం!

**ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు.**

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా):** గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని ఉండి ఎమ్మెల్యే స్పష్టం చేసారు. చినపుల్లేరు, వాంద్రం గ్రామాల్లో ఎమ్మెల్యే సారధ్యంలో జనచైతన్య యాత్రలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈగ్రామాల పార్టీ అధ్యక్షులు సాగిరాజు నాగరాజు, కందుల రాధా బలరామ్ కృష్ణ శ్రీనివాస యాదవ్‌లు పార్టీ జెండాలను ఎగుర వేసారు. ఈగ్రామాల్లో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శివ ప్రారంభించారు. ఎమ్మెల్యే శివ హామీలిచ్చి శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాబార్డు గ్రాంటు రూ10లక్షలు, ఎంపి నిధులు రూ10లక్షలతో సీసీ రోడ్ల వేస్తామన్నారు. చినపుల్లేరులో రూ24లక్షలు, జడ్‌పి గ్రాంటు 1లక్ష రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే అన్నారు. కమ్యూనిటీ భవనానికి గ్రాంటు నందిస్తానన్నారు. మిగిలిన సీసీ రోడ్లను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. చినపుల్లేరు–జక్కరం ఆర్‌అండ్‌బి రోడ్డుకు నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈగ్రామంలోని సీసీ రోడ్లకు రూ55లక్షలు అవసరమని వాటిని వాంక్షన్ చేస్తానని హామీ ఇచ్చారు. వంటశాల, అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపనలు చేసారు. వాంద్రం గ్రామంలో పలు రోడ్లను ప్రారంభించి మిగిలిన వాటికి శంకుస్థాపనలు జరిపారు. వాంద్రం రోడ్డును రూ3కోట్లతో పనులు జరుపుతున్నామని, మరో రూ2కోట్లతో రోడ్డు చెక్కుచెదరకుండా ఉండేందుకు రిటైనింగ్‌వాల్ నిర్మిస్తున్నామన్నారు. గ్రామంలో 90శాతం సీసీ రోడ్లు నిర్మించామన్నారు. అనంతరం రెండు గ్రామాల్లోనూ అన్ని వర్గాల జనం పార్టీలో చేరారు. వారిని ఉండి ఎమ్మెల్యే శివ అభినందించారు. ఈకార్యక్రమాల్లో ఉండి మండల పార్టీ అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాస్, కార్యదర్శి మోపిదేవి శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ గోపాలకృష్ణరాజు, ఎంపిపి లక్ష్మి, జడ్‌పిటిసి తులసి, ఇందుకూరి రామభద్రిరాజు, ఏఎంసి డెరెక్టరు వేగేశ్న ధర్మరాజు, రంపా సౌలురాజు, కలిదిండి శ్రీనుబాబు, ఎంపిటిసి నిర్మల, కందుల బలరామ్, సర్పంచ్ గోవిందరావు, ద్వారంపూడి నారాయణరెడ్డి, తేలి రాజారావు, కాగిత బుజ్జి, సాయిరాజు, ఇర్రింకి బుజ్జి, అనంతలక్ష్మి, సుజాత, కునుకు శ్రీనివాస్, కరిమెరక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాంద్రంలో సీసరోడ్డును ప్రారంబిస్తున్న దృశ్యం

# గ్రాంథాలయాలను డిజిటలైజేషన్ చేయటానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

**జిల్లా గ్రాంథాలయ సంస్థ చైర్మన్ శ్రీరామమూర్తి**

**అన్నంరెడ్డి సుబ్బారావు రాజధాని ప్రతినిధి, కొయ్యలగూడెం :** జిల్లాలో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయటంద్వారా ఈ గ్రంథాలయాలుగా సాంకేతికంగా అభివృద్ధి పరచి యువతకు గ్రంథాలయాల పట్ల మరింత శ్రద్ధాశక్తులు పెంపొందించే విధంగా తీర్చిదిద్దటానికి యోచిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జయవరపు శ్రీరామమూర్తి వెల్లడించారు. కొయ్యలగూడెం శాఖ గ్రంథాలయం వద్ద గ్రంథాలయవారోత్సవాల ముగింపు సభకు ఆయన అధ్యక్షత వహించారు. గ్రంథాలయాల డిజిటలైజేషన్ గ్రంథాలయాలుగా అభివృద్ధి పరచటం గురించి ప్రభుత్వంతో చర్చించి, ప్రతి పాదనలు పంపనున్నట్లు ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు. గ్రంథాలయాలలోనే బాలలభవిష్యత్ ఉందని, ప్రతి బాలబాలికలు పుస్తకపఠనాన్ని శ్రద్ధగా అలవరచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే ఎం. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పుస్తక పఠనంతోనే ఎంతోమంది గొప్పవ్యక్తులుగా, మేథావులుగా, దేశం జాతి గర్వించదగిన మహానాయకులుగా ఎదిగారని ఎమ్మెల్యే తన ప్రసంగంలో పేర్కొన్నారు. గ్రంథపఠనంవల్ల మంచి సమాజం రూపుదిద్దుకుంటుందని అన్నారు. గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడుగా పదవిని చేపట్టిననాటి నుంచి శ్రీరామమూర్తి గ్రంథాలయాల సర్వముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అభినందించారు. ప్రముఖ కవి రచయిత డాక్టర్ వూటుకూరి వరప్రసాద్ రచియించిన 'తెలుగు పరిమళం' దీర్ఘ కావ్యం పుస్తకాన్ని సభలో పరిచయంచేసి అభినందించారు.



వివిధ పోటీలలో విజేతలకు జ్ఞాపికలను అందచేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ శీరామమూర్తి ఎమ్మెల్యే శ్రీనివాసరావు

# దళితవాడల్లో తెలుగుదేశ పతాకం రెపరెపలు!

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా) :** ఎస్సీలు అధికంగా ప్రాతినిధ్యం ఉన్న గ్రామాలైన చినపుల్లేరు, వాంద్రం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ప్రభజనం వీస్తున్నాయి. ఈగ్రామాల్లో ఎస్సీ సబ్ ప్లానులో లక్షలాది రూపాయల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలు జరిగాయి. దీంతో ఎస్సీ పేటల్లో యువకులు, యువతులతో బాటు అన్ని వర్గాల ప్రజలు ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు నాయకత్వంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పైగా పేటల్లోని జనం స్వచ్ఛంధంగా సభలు ఏర్పాటు చేసి ఉండి ఎమ్మెల్యేను అతిధిగా సాదరంగా ఆహ్వానించి గ్రామాల తరపున ఘనంగా సత్కరించారు. సొంత ఖర్చులతో జెండా స్థూపాలను ఏర్పాటు చేసుకుని తెలుగుదేశం జెండాలను ఎగుర వేసారు. కని వినీ ఎరుగని తీరులో పేటల్లో పచ్చ జెండాలు, తోరణాలు, బేనర్లతో పసుపు ఆరవేసినట్లుగా ముస్తాబైయ్యాయి. ఈఏడాది పార్టీ సభ్యత్వాల్లో మిగిలిన వర్గాలకు ధీటుగా నమోదైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సబ్ ప్లాను వల్ల మండలంలోని ఉండి, అర్తమూరు, కలిసిపూడి, చినపుల్లేరు, ఉణుదుర్రు, ఎన్నార్పీ అగ్రహారం, కోలమూరు గ్రామాలకు లక్షలాది రూపాయల గ్రాంటు మంజూరైన విషయం విధితమే! వీటితో ఎస్సీ పేటల్లో సీసీ రోడ్లు నిర్మించడమే కాకుండా ఉండి ఎమ్మెల్లే శివ జనరల్ గ్రాంట్లను తగినంత ప్రాధాన్యతలను ఇచ్చి మంజూరు చేసారు. ఈవర్గాలకు పార్టీ కమిటీల్లో మంచి ప్రాధాన్యతలను ఇస్తున్నారు. దీంతో దళిత నాయకులు పార్టీని బలోపేతం చేసేందుకు అంకిత భావంతో శ్రమిస్తున్నారు. జనచైతన్య యాత్రల్లో ఈవర్గాలు పార్టీ వైపు మక్కువ చేస్తుతున్నారని రుజువైంది. చినపుల్లేరులో మాజీ సర్పంచ్ రంపా సౌలురాజు, ఎంపిటిసి నీతిపూడి నిర్మలసుధాకర్‌లు పార్టీని పటిష్టపర్చేందుకు పూర్తి స్థాయిలో కష్టపడుతున్నారు. అలాగే ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి తేలి రాజారావు వాంద్రం గ్రామంలో ఏన్నో ఏళ్ల తరబడి పార్టీని బలోపేతం చేస్తున్నారు.

# రైల్వే నిర్లక్ష్యమా ? కుట్రా?

శ్రీతాకాలం రైళ్లు ఢీకొంటాయి... ఎందుకంటే తెల్లవారు జామునుంచి మంచు కురవడంతో ఎదురెదురు వస్తున్న రైలు డ్రైవర్‌కు కనిపించదు అందువల్ల రైళ్లు ఢీకొంటాయి. వర్షాకాలం వర్షాలకు పట్టాలపై ఉన్న కంకర, మట్టి కొట్టుకు పోవడం, భూమిలో నీరు చేరి పట్టాలు మీద వస్తున్నప్పుడు మట్టి జారుతుండటంతో పట్టాలు తప్పే అవకాశం ఉంది. ఈ ప్రమాదం శాస్త్రీయతకు అంతుచిక్కడం లేదు.. ఈనెల 19న జరిగిన ఈ ఘోర ప్రమాదం ఉత్తరప్రదేశ్‌లోని దేహత్ జిల్లా పుఖ్రియా వద్ద ఇండోర్ – పట్నా ఎక్స్‌ప్రెస్‌కు జరిగింది. ప్రయాణీకులంతా గాఢనిద్రలో ఉండగా, ఆకస్మికంగా జరిగిన ఈ ఘటనలో చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయి, పిల్లలను, బంధువులను తల్లిదండ్రులు కోల్పోయి, ఎవరున్నారో ఎక్కడున్నారో తెలియకుండా దాదాపు వారంతా చిమ్మచీకట్లో మూడు గంటలపాటు హాహాకారాలు మధ్య రక్తం స్రవిస్తూ, మరణించిన వారి మధ్య గడిపారు. ఇప్పటివరకు 149 మంది ప్రాణాలు కోల్పోగా, 202 మంది గాయపడ్డారు. పట్టా విరగడమే ఈ ప్రమాదానికి కారణమని కారణమని చెబుతున్నప్పటికీ, శాఖాపరమైన విచారణకు రైల్వే మంత్రి సురేష్‌ప్రభు ఆదేశించారు. విద్రోహచర్యకు కుట్ర కోణంలోనూ ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతుందని కూడా ప్రభు పేర్కొన్నారు. రైలు ప్రమాదాలు జరిగినప్పుడల్లా విచారణ పటిష్ట చర్యలు, విస్తృత నిఘా, పర్యవేక్షణ లోపించడంతో ప్రమాదాలు పరంపర కొనసాగుతూనే ఉంది.

అక్రమంగా రైలు పట్టా దాటడం వల్ల ఏటా దాదాపు15 వేల మంది మృత్యువాతపడుతున్నారు. రైలు ప్రమాదాలకు బోగీలలో మంటలు చెలరేగడం, రైళ్లు ఢీకొనడం, పట్టాలు తప్పడం, కావలాలేని రైల్వే క్రాసింగ్‌లు ప్రధాన కారణాలు. భారతీయ రైల్వేలను నిధుల కొరత వెంటాడుతుండడంతో వెచ్చింపులు తగు విధంగా జరగడంలేదు. ప్రతి ఏడాది దాదాపు 300 ప్రమాదాలు జరుగుతున్నట్లు అంచనా. ఈ ప్రమాదాల సంఖ్య అత్యంత ఎక్కువగనుక తక్షణమే నివారణ చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించవలసిన అవసరం ఉంది. గత 20 – 23 సంవత్సరాలుగా భారతీయ రైల్వేలు వాటి సామర్థ్యానికి మించి 15 రెట్లు ఎక్కువమంది ప్రయాణీకులను తీసుకువెళుతున్నాయి. పాత రైలు పట్టాలు దెబ్బతిని, ప్రమాదాలు జరగడానికి కారమవుతున్న విషయాన్ని రైల్వే మంత్రిత్వశాఖ దృష్టి సారించాలి. ఉత్తర ప్రదేవ్ ఘోర రైలు ప్రమాద మృతులకు ప్రధానమంత్రి ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రులు నష్టపరిహారాలను, ఎక్స్‌గ్రేషియాలను మానవతా దృక్పథంతో ప్రకటించారు. కానీ , అవి పోయిన ప్రాణాలను ఎలాగూ తిరిగి తీసుకురాజాలవు, కనుక ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, భారతీయ రైల్వేలు భద్రతా చర్యలకు, రైలు మార్గాల నిర్వహణకు, నిఘాకు అధిక మొత్తాలను వెచ్చించి ప్రయాణీకుల ప్రాణాలను కాపాడే దిశగా అడుగులు వేయాల్సిన ఆవశ్యకత ఉంది. స్టేషన్ల మధ్య మాన్యువల్ సిగ్నలింగ్ వ్యవస్థ స్థానే ఆటోమెటిక్ వ్యవస్థ నెలకొల్పాలి. మనిషి కాపలాలేని రైల్వే క్రాసింగుల వద్ద వాటి పైగా వంతెనలు, ఫెన్సింగ్‌లు, ఫ్లై ఓవర్లు నిర్మించి ప్రయాణీకుల్లో అభద్రతాభావాన్ని పారద్రోలాలి. అలాగే టికెట్ తీసుకోగానే రూపాయికే రైల్వేలు ఇచ్చే బీమాపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– ఖాన్



# రాజవరంలో ఎమ్మెల్యే జన చైతన్య యాత్ర

**రూ. 27.5 లక్షలతో సి.సి.రోడ్లకు భూమిపూజలు**



**రాజధాని ప్రతినిధి (కొయ్యలగూడె ,అన్నంరెడ్డి సుబ్బారావు) :** పేదల సంక్షేమం, పల్లెసీమలు, వ్యవసాయరంగం అభివృద్ధే ద్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషిచేస్తు న్నారని పోలవరం ఎమ్మెల్యే ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాజవరం, గంగవరం గ్రామాలలో ఆయన విస్తృతంగా పర్యటించి జనచైతన్య మాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ రెండుగ్రామాల్లో రూ.24 లక్షల ఎస్.పి.ఎఫ్. నిధులలో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు ఆయన భూమిపూజలుచేసారు. మాగపతి దేవిపాలెంలో ఆర్.అండ్‌ది. రోడ్డు నుంచి మండల పరిషత్ పాఠశాలవరకు రూ.3.5 లక్షల నిర్మింస్తున్న సి.సి రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజచేసారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఎ.ఎం.సి.చైర్మన్ పారేపల్లి రామారావు, ఎం.పి.పి.అయినపర్తి చంధన శ్రీదేవీ జడ్.పి.ఉపాధ్యక్షురాలు చింతల వెంకటరమణ, ఎం.పి.టి.సి. సభ్యులు వంకదారి రామచంద్రరావు, గరకపాటి సత్యనారాయణ, పార్టీ నాయకులు వాడపల్లి నాగార్జున , చంద్రం, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

# నోట్ల రద్దుపై 2న సుప్రీం కోర్టు విచారణ

**న్యూఢీల్లీ :** పెద్దనోట్ల రద్దుతో సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై దాఖలైన పిటీషన్లను సుప్రీంకోర్టు డిసెంబరు 2న విచారణకు స్వీకరించనుంది. చీఫ్ జడ్జి టీఎస్ ఠాకూర్, జస్టిస్ డీ వై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయాన్ని తెలిపింది. ప్రభుత్వం తరపున అదనపు అఫిడవిట్ దాఖలు చేస్తూ నోట్ల రద్దుతో ఉత్పన్నమైన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను వివరించాలని అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీని దర్మాసనం ఆదేశించింది. నవంబర్ 8న, పెద్దనోట్లు చేస్తూ ప్రధాని మోడీ సంచలన నిర్ణయం వెలువరించిన విషయం తెలిసిందే...ఫిర్యాదీదారుల తరపున సీనియర్ లాయర్, కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబాల్ వాదనలను వినిపిస్తారు. దేశంలోని వేర్వేరు న్యాయస్థానాల్లో పిటీషన్లు దాఖలు చేయడాన్ని రోహత్గీ వ్యతిరేకిస్తూ అన్ని పిటీషన్లను సుప్రీం కోర్టు లేదా ఢీల్లీ హైకోర్టులో దాఖలు చేయాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి నల్లడబ్బు సమాంతర ఆర్థిక నిధులను నిర్వహిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను దెబ్బతీస్తుండటం తో దానిని అరికట్టేందుకు ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుందని కేంద్ర అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఉత్తమ ఫలితాలను రాబట్టడానికి పథకాన్ని రహస్యంగా అమలు చేశామన్నారు.

# నోటుకు కటకట...!

### సామాన్యులకే ఎక్కువ ఇబ్బంది



పెద్ద నోట్ల రద్దు వల్ల సామాన్య పౌరులే ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారని తమిళ హీరో విజయ్ అన్నాడు.కేవలం 20 శాతం మంది కోసం 80 శాతం మందిని కష్టపెట్టడం తగదన్నారు. మోదీ తీసుకున్న నిర్ణయం బాగున్నప్పటికీ.. ముందుస్తు జాగ్రత్తలు తీసుకునుంటే ప్రజలకు కరెన్సీ ఇబ్బందులు తప్పేవన్నారు. మందులు కొనుక్కోవడానికి కూడా చిల్లర లేక చాలా మంది బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు

– విజయ్

### బాడాబాబుల ఎగవేత




**న్యూఢిల్లీ :** జాతీయ బ్యాంకుల నుంచి తీసుకొన్న రూ.11 లక్షల కోట్ల రుణాలను దిగమింగిన బడా పారిశ్రామిక వేత్తల జాబితాను వెల్లడించకపోవడం, మోడీ ప్రభుత్వం వారి రుణాలను నిరర్థక ఆస్తులుగా ప్రకటించిన ఆచరణలో మాఫీ చేస్తుండడం స్వాతంత్రానంతరం దేశంలో వెలుగుచూసిన అతిపెద్ద కుంభకోణమని కూడా సీపీఎం నాయకుడు ఆరోపించారు. పెద్ద నోట్ల రద్దును దేశ ప్రజలంతా స్వాగతిస్తున్నారనే అపోహను ప్రచారం చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం మొత్తం మీడియా దుర్వినియోగం చేస్తున్నదని ఆయన చెప్పారు. ప్రజలను తమ సొంత సొమ్మును వాడుకొనేందుకు వీల్లేకుండా ఆంక్షలు విధించడం ప్రజల ప్రాథమిక హక్కును హరించడం కాదా అని ఆయన మీడియాలో ప్రశ్నించారు.

### ఎటీఎంలతో జాగ్రత్త !




నోట్ల రద్దుతో దేశ వ్యాప్తంగా ప్రజలు ఎటీఎంల ముందు నిలబడాల్సి పరిస్థితి నెలకొన్న తరుణంలో..న్యూయార్క్ కు చెందిన పరి శోధకులు ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ఎటీఎంల కీ ప్యాడ్లపై భారీ ఎత్తున హానికర బ్యాక్టీరియా పేరుకుపోయి ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపారు. దీంతో పలురకాల వ్యాధులు ప్రభలే ప్రమాదముందని హెచ్చరించారు. కాబట్టి ఎటీఎంను వినియోగించిన తర్వాత చేతులను ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు.




మోడీ ప్రభుత్వం నల్లధనం వెలికితీత కోసం చేసిన పెద్దనోట్ల రద్దు బెడిసికొట్టింది. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లు దేశం అంతటా నల్లధనం సమకూర్చుకోవడానికి బడా బాబులు విజృంభిస్తున్నారు. మరికొందరైతే మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన రూ. 2000 నోటును స్కాన్ చేసి అవే బ్లాక్‌మనీ గాళ్ల కిస్తున్నారు. దీంతో నల్లవీరులు తేలుకుట్టిన దొంగల్లా ఉండి పోయారు. సమాజంలో ఏమాత్రం గుర్తింపు పొందిన వారినైనా ఇప్పుడు మధ్యవర్తులు వచ్చి అడిగేదేమంటే ఒక కోటి రూపాయలు వైట్ చేసిపెట్టగలరా ? అని...

శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు అన్నట్లు నల్లధనం వీరులు రకరకాల మార్గాలను అనేషిస్తూ,జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలు తెరచిన జన్‌ధన్‌ను ఉపయోగించుకొని 20 శాతం కమీషన్ ఇస్తూ వైట్ చేసుకుంటున్నారు.

దేశంలోని సామాన్య ప్రజలు చిన్న నోట్లకోసం కట..కట లాడు తున్నారు....బ్యాంకుల ఎదుట క్యూలు పెరుగుతూనే ఉన్నా యి... ఎటీఎంలు అవుట్ ఆఫ్ సర్వీస్‌తో దర్శనమిస్తున్నాయి. గంటలు తరబడి క్యూల్లో నుంచున్న మహిళలు అసహనంతో సిగపట్లు పడుతున్నారు. పిల్లలు సొమ్మసిల్లుతున్నారు.. విద్యార్థులు పరీక్ష ఫీజులు కట్టలేమోనన్న భయంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వృద్ధులు క్యూలైన్లో కుప్పకూలి మరణిస్తున్నారు. ఇప్పటి వరకు వంద మందికి పైగా మరణించారని ప్రతిపక్షాలు పార్లమెంటులో విరుచుకు పడుతున్నాయి. జనసందోహం బ్యాంకులపైకి దండెత్త డంతో బ్యాంకు సిబ్బంది అత్యధిక ఒత్తిడికి గురై ఇప్పటివరకు 11 మంది చనిపోయారు. క్యూలైన్లకు పరీక్షిస్తున్న పోలీసులు అసహనానికి గురై పేద వృద్ధులను గొడ్డును బాదినట్టు బాదారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అందుకు బాధ్యులైన ఇద్దరి పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. కూలీనాలీ చేసుకునే జనాలు బ్యాంకుల ఎదుటే పడిగాపులు పడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు క్యూలైన్లలోనే ల్యాప్‌టాప్‌ల్లో వారి పనిచేసుకుంటున్నారు. ఢిల్లీలో విపరీతమైన చలిలో కూడా బ్యాంకు ఎదుట వరుసల్లోనే పడుకున్నారు. భర్త పనికి వెళితే తప్ప గడవని భార్యలు క్యూలైన్లలో నిలబడి ఇంటిదగ్గర పిల్లలు ఏవ య్యారో అని ఆందోళనకు గురవుతున్నారు.

యధావిధిగా ప్రతిపక్షాలు అధికార పార్టీలపై విరుచుకు పడుతున్నాయి. ఎప్పటిలాగా అధికార పార్టీ విమర్శించే వారిని దేశద్రోహులుగానూ,ప్రగతి వ్యతిరేకులగానూ విమర్శిస్తూనే ఉన్నారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులపై పార్లమెంటులో మాట్లాడటానికి ప్రధాని మోడీ, విలేకరులతో మాట్లాడటానికి ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ముందుకు రావడం లేదు. దీంతో వామపక్ష పార్టీకి చెందిన సీతారం ఏచూరి పార్లమెంటరీ దిక్కరణను నమోదు చేస్తామనడంతో ఆయన పార్లమెంటుకు మొహం చూపారు. మోడీపై విపక్షాలు ఆగ్ర హోగ్రం అయ్యాయి. రిజర్వు బ్యాంకు పూటకొక సర్క్యులర్ జారీ చేస్తూ బ్యాంకులను, ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. చిన్న,చిన్న వ్యాపారుల నుంచి టాటా బిర్లాల వరకు నష్టాలు చవిచూస్తున్నారు. దేశ ఆర్థిక పరిస్థితి ఎన్నడూ లేనంత గందరగోళంలోకి నెట్టబడింది. ఏది ఏమైనా కీలెరిగి వాతపెట్టడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మెరుపుదాడులు గురితప్పి సామాన్యుడిని అవస్థలు పెడుతున్నాయి. డిజిటల్ లావాదేవీలు జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరుతోంది. ఆన్‌లైన్‌లోనో, ఏటిఎంల్లోనో నగదులావాదేవీలు జరపగలిగే పరిజ్ఞానం ఎంతమందికుంది? వచ్చింది చిల్లర సమస్య...కరివేపాకు, తోటకూరలకు కూడా డిజిటల్ చెల్లింపులా అని ప్రజలు వాపో తున్నారు. ప్రజల నెత్తిన తుపాకిపెట్టి నగదు రహిత ఆర్థిక విధానానికి వెళ్ళమని ప్రభుత్వాలు చెప్పలేవు. ఇది సాధారణ క్రమం లో జరగాలి. వస్తుసేవా పన్నులు (జీఎస్టీ), పెద్దనోట్ల రద్దుతో రాష్ట్రం ఎంతో నష్టపోయినప్పటికీ నివారణ చర్యలు తీసుకోవడంలో ముఖ్యమంత్రి వెనుకబడుతున్నారు. గురువారం నుంచే హైదరాబాద్, చెన్నైల్లో రూ.500నోట్లను ఏటీఎంలు బట్వాడా చేస్తుండగా, ఇంతవరకు ఆనోట్లు రాష్ట్రాన్ని చేరుకోలేదు.

– బోస్

### అంబానీ, అదానీలకు ముందే తెలుసు : బీజేపీ ఎమ్మెల్యే



పెద్ద నోట్ల రద్దు వ్యవహారం అత్యంత రహస్యంగా జరిగిన ఆపరేషన్ అని ప్రధాని నరేంద్రమోడీ చెబుతున్నప్పటికీ ప్రధాని ప్రకటన కంటే చాలా రోజుల ముందే పారిశ్రామికవేత్తలు అంబానీ, అదానీలకు లీక్ అయ్యిందని సాక్షాత్తు రాజస్థాన్ రాష్ట్రం కోటా నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే భవానీ సింగ్ వివరించారు. రూ.500, రూ.1000 నోట్లు రద్దు అవుతాయని ముందే అంబానీ, అదానీలకు సమాచారం ఉందన్నారు. వాళ్లు ముందుగానే వాళ్ల పనులు చక్కబెట్టుకున్నారని మీడియాతో . భవానీ సింగ్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ప్రతిపక్షం నుంచి చేస్తున్న విమర్శలకు సొంత పార్టీ ఎమ్మెల్యే వంత పాడటం.. మద్దతు ఇవ్వటంతో బీజేపీలోనే కలకలం రేగింది. అధిష్ఠానం రంగంలోకి దిగి వార్నింగ్ ఇచ్చింది. దీంతో వెంటనే.. అలా అనలేదని మాటమార్చే ప్రయత్నం చేశారు భవానీ సింగ్. నోట్ల రద్దుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నమాట వాస్తవమేనని, నోట్లు రద్దుకు ముందు కొత్త నోట్లు సరిపడా ప్రింట్ చేసి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

కొత్తగా వచ్చిన రూ.2వేల నోటు దొంగ నోటులా ఉందని ఆయన అధికార బీజేపీని ఇరుకున పెట్టారు.అంబానీ జియో సేవలను ఉచితంగా ఎందుకు ఇస్తున్నారనే వాదనకు భవానీ సింగ్ వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. భవానీ స్టేట్‌మెంట్స్‌ను జాగ్రత్తగా పరిశీలిస్తే అంబానీకి నోట్లు రద్దు వ్యవహారం ముందే తెలిసి ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నాయి విపక్షాలు. నోట్ల మార్పిడిలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను కొందరు వీర భక్తులు తప్పుదోవ పట్టించే భజనప్రచారం చేస్తున్నారు...

### సామాన్యుడికి 50 రోజులు...
## నల్లకుబేరుడికి రెండేళ్లు!!

**న్యూఢిల్లీ :** పెద్ద నోట్లను రద్దు చేస్తూ దేశంలో నల్లధనంపై మెరుపుదాడులు చేస్తున్న కేంద్రప్రభుత్వం.. కష్టపడి సంపాదించుకున్న డబ్బును మార్పిడి చేసుకోవటానికి సామాన్యుడికేమో 50 రోజులు టైమ్ ఇచ్చింది. అదీ గంటల తరబడీ, రోజుల తరబడీ బ్యాంకుల ముందు నిలబడి, ఆత్మహత్యలు చేసుకొని మృతిచెంది ఇన్ని బాధలు పడుతుంటే..దేశంలోని లక్షల కోట్ల ధనాన్ని స్విస్ బ్యాంకుల్లో దాచుకున్న అక్రమార్కులు, నల్ల కుబేరులకు మాత్రం ప్రభుత్వం 2019 వరకు సమయం ఇవ్వడం సామాన్యుడికి ఆగ్రహం కలిగిస్తోంది.

స్విస్ బ్యాంకుల్లో దాగిఉన్న భారతీయుల అకౌంట్ల ఆర్థిక సంవత్సర సమాచారాన్ని 2019 నుంచి ఆటోమేటిక్ రూపంలో భారత్ పొందేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సీబీడీటీ చైర్మన్ సుశీల్ చంద్రా, ఇండియాలో స్విస్ ఎంబసీ మిషన్ డిప్యూటీ చీఫ్ గిల్లెస్ రోడ్యూట్లు ఇరుదేశాల మధ్య సమాచార మార్పిడికి సంబంధించిన సంయుక్త ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీంతో విదేశాల్లో దాగిఉన్న లక్షల కోట్ల నల్లధనాన్ని ప్రభుత్వం బయటకి రాబట్టనుంది. ఈ ఒప్పందంతో 2019 నుంచి స్విట్జర్లాండ్ లో ఉన్న భారతీయుల ఫైనాన్సియల్ అకౌంట్ల సమాచారం ఆటోమేటిక్ గా పొందే సౌకర్యం భారత్‌కు లభించనుందని ఆర్థికమంత్రిత్వ శాఖ తెలిపింది. అంటే నల్లకుబేరులు తమ డబ్బును దుబాయ్ హోటళ్లలోనో, ఏ సింగపూర్ రియల్ ఎస్టేట్‌లోనో పెట్టుబడులు పెట్టుకోవడానికి ప్రభుత్వం చాలినంత సమయం ఇచ్చిందన్నమాట. 2019 అంటే తెలుసు కదా... మళ్లీ ఎన్నికలు వచ్చే సంవత్సరం.

## గాలి వారి పెళ్లిభోజనం ఖర్చు జస్ట్ రూ.30

అవునా ...? ఒక సాదాసీదా, దిగువ మధ్యతరగతి వారింట పెళ్లిలోనే ఒక భోజనం ఖర్చు హీనపక్షం వంద రూపాయలు అవుతోంది.మనం పంటలు వండించినా, కేటరర్ కు అప్పగించినా ....ఓ పప్పు కూర, కాస్త సాంబారు, కాసింత పెరుగు, అన్నం, ఓ స్వీటు కొంచెం బూదీ, ఓ పచ్చడి, అదనంగా మారో కూర ... కేవలం ఇవి మాత్రమే పెట్టినా సరే, వంద తప్పదు ... కానీ 500 కోట్ల ఖర్చుతో పెళ్లి చేశారనే ప్రచారం జరుగుతున్నగాలి వారింట పెళ్లిలో, అందిరిపోయే ప్రత్యేక వంటకాలతో కూడిన ఒక్కో పెళ్లి భోజనానికి ఖర్చెంత అయి ఉంటుంది ...? నాలుగైదు వేలు ఉంటుందా...? పెళ్లి కార్డుకే 6 వేల చొప్పున ఖర్చు పెట్టి అంగరంగ వైభవంగా చేసిన పెళ్లిలో మొత్తం భోజనాల ఖర్చు ఎంత ..? ఒక్కో పెళ్లి భోజనం ఖర్చు, జస్ట్, 30 రూపాయలేనట ..!! పెళ్లయ్యేదాకా, హైదరాబాద్ లో రిసెప్షన్ అయిపోయేదాకా వేచి చూసిన ఐటీ అధికారులు వెంటనే గాలి ఇంటిపై

### ఆదాయపు పన్ను అధికారులకు షాక్

దాడిచేసి, ప్రశ్నల్ని సంధించిన సంగతి తెలుసు కదా ... అది ఆయన కూడా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నదే... ఐటీ అధికారులు టెంట్లు, కుర్చీలు, భోజనాలు, కార్పెట్లు, లైట్లు నీళ్లు ... ఇలా ప్రతి సరఫరాదారుడినీ పిలిచి ప్రశ్నించారు ... వారు చెప్పిన సమాధానాలు విని ఐటీ అధికారులు షాక్ తిన్నారుట... ఇదేమిటయ్యా, మరీ ఇంత తక్కువకు ఎలా ఇవ్వగలరు? అనడిగితే ... "జౌనయ్యా ,రాజకీయ కుట్రలతో, అవినీతి అధికారులు స్వార్థంతో ఆయనపై కేసులు పెట్టి జైలుపాలు చేశారు.... ఆయన రాజులా వెలిగినప్పుడు కొన్ని వేల మందిని ఆదుకున్నాడు... మేమూ ఆయన వల్లే పైకి వచ్చాం ... ఆయన ఇంట్లో పెళ్లి అంటే మా ఇంట్లో పెళ్లి అనుకోమా ? లాభనస్టాలు చూస్తామా ..? ఏదో, ఆయన ఎంతిస్తే అంతే చాలు ..." ఇలా సమాధానాలు వచ్చాయట...

నిజంగానే గాలి ఓ వెలుగు వెలిగిన రోజుల్లో వేల కుటుంబాలు లబ్ధి పొందడం కరెక్టే ... తక్కువ ఖర్చు చూపించటానికి జనార్ధన్ రెడ్డి తక్కువ తక్కువ మొత్తాలకు బిల్లులు రాసీ ఉంటాడు ... తమ పై ఐటీ నిఘా ప్రశ్నలు, వేధింపులు ఉంటాయని తెలుసు కాబట్టి జాగ్రత్తలు తీసుకుని ఉంటాడు ... అయితే ఇలాంటి ఎమోషనల్ జవాబులు వస్తాయని బహూశా ఐటీ విభాగం ఊహించి ఉండదు ... దాంతో ఓ నోటీసు జారీ చేసి, లిఖితపూర్వకంగా జవాబులు పంపించండీ అని చెప్పి వెళ్లిపోయారు ... అసలు నిజంగానే 1961 ఆదాయపు పన్ను చట్టం ప్రకారం పెళ్లి ఖర్చులు చూపించటానికి ప్రత్యేక సెక్షన్లు ఉంటాయా ...? మరి ఈలెక్కన పాన్ పావలాకు ఒకటి ఇచ్చినట్టు, మొత్తం లైటింగు ఖర్చంతా 20 వేల దాటనట్టు, పంతుళ్లకు తలా వేయినూటపదహార్లు దక్షిణ ఇచ్చినట్టు ... రకుల్ ప్రీత్ కు కూడా 21,116 చేతిలో పెట్టినట్టు, కుర్చీల ఖర్చులకు 32,350 అయినట్టు రాసి ఉంటారంటారా ...?

అవునండీ ...., మేం అదే రేట్లకు సప్లయ్ చేశాం, ఆయన మమ్మల్ని చాలాసార్లు ఆదుకున్నాడు... అని సరఫరాదారులు దబాయిస్తే, ఇక ఐటీ ఏం చేయగలదు ...? నిజమే కదా ... మార్కెట్ రేట్లు తెలుసుకుని, వాటి ఆధారంగా కొత్త బిల్లులు రూపొందించి, ఆ మేరకు సరఫరాదారులకు నోటీసులు ఇవ్వలేరు కదా ...!!

– ఖాన్



విజయవాడలో ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సమావేశం అధ్యక్షత వహిస్తున్న చైర్మన్ హిదాయత్, పక్కన కమిషనర్ ఇక్బాల్, అసిస్టెంట్ కమిషనర్, పాల్గొన్న డైరెక్టర్లు

## ఈ-పాస్ యంత్రాలతో సరుకులివ్వాలి!



మాట్లాడుతున్న ఉండి తహసిల్దారు దుర్గాకిశోర్

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా).:** పెద్ద నోట్ల రద్దు వలన వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఈ-పాస్ యంత్రాలను ఏర్పాటు చేసుకుని డెబిట్ కార్డులపై సరుకులను అందించాలని ఉండి తహశీల్దారు వై దుర్గాకిశోర్ అన్నారు. ఉండి తహసిల్దారు కార్యాలయంలో బ్యాంకర్లు, కిరాణా వ్యాపారులు, వీఆర్వోలతో సంయుక్త సమావేశం జరిగింది. కిశోర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఈయంత్రాలను కలెక్టరు తక్కువ రెంటల్‌లో అందిస్తానన్నారు. ఈ-పాస్ యంత్రాల వల్ల మొత్తం టర్నోవర్ తేటతెల్లం అవుతుందని, ఆఖరికి గుండు సూది అమ్మినా రికార్డు అవుతుందని అన్నారు. దీని వల్ల వ్యాపారులకు టర్నోవర్‌ను బట్టి బ్యాంకులు రుణాలను అందించి సహకరిస్తాయన్నారు.దీనికి సంబందించి అవసరమైన డాక్కుమెండేషన్‌ను, శిక్షణను రెవెన్యూలో సివిల్ సప్లైస్ శాఖా అందిస్తుందన్నారు. అనంతరం పెదపుల్లేరు, ఉండి ఆంధ్రా బ్యాంకు మేనేజర్లు హరికృష్ణ, టి హనుమంతరావు, కోలమూరు విజయా బ్యాంకు మేనేజరు విజయబాబులు మాట్లాడారు. ఈ-పాస్ యంత్రాన్ని, డెబిట్ కార్డులరు ప్రదర్శించి అవగాహన కల్గించారు. వ్యాపారుల సందేహాలకు తహశీల్దారు, బ్యాంకర్లు సమాధానాలు చెప్పారు. డిప్యూటీ తహశీల్దారు మోహనరావు, విఆర్వోలు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్‌పై అవగాహనా ర్యాలీలు!

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా).:** మరుగుదొడ్ల వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్గించేందుకు మహదేవపట్నం, చిలుకూరు గ్రామాల్లో విద్యార్థినీ, విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. పంచాయితీలు, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ఈకార్యక్రమాలను నిర్వహించారు. మహదేవపట్నం సర్పంచ్ జుత్తిగ శ్రీనివాస్, చిలుకూరు గ్రామ సర్పంచ్ రుద్రరాజు బంగార్రాజు, ఎంపిడివో వీరమల్లు రెడ్డియ్యలు మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన వల్ల త్రాగునీరు, వాతావరణం కలుషితం కావడం వల్ల ప్రజారోగాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అందుకే ఉండి ఎమ్మెల్యే శివరామరాజు,ఎంపి గోకరాజు గంగరాజులు స్వంత సొమ్ములను కొంత శాతం భరిస్తూ ప్రభుత్వ గ్రాంటులతో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డిని నిర్మిస్తున్నారని అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమాల్లో డ్వాక్రా సమాఖ్య తెలుగు మహిళ సంఘం అద్యక్షురాలు వత్సవాయి సుజాత, ఆర్‌డబ్ల్యుఎస్



మహదేవపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జేఈ శ్రీనివాస్, కార్యదర్శి నాగేశ్వరరావు, విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అతి త్వరలో దినపత్రికగా రానున్న
రాజధాని వార్తలు
పత్రికకు విజయవాడలో డీటీపీ ఆపరేటర్లు,సబ్ -ఎడిటర్లు, డిజైనర్లు కావలెను
94406 62699, 96768 44442



ఎం.బేగ్
శ్రీ కల్కి అందరివారు
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి, లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హా హా 1 లా ఇలాహా
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకాని పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ.

సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక, రాజకీయ,వారపత్రిక
రాజధాని వార్తలు క్లాసిఫైడ్స్ - రూ.500/- మాత్రమే
94406 62699, 96768 44442

Editor : Pattan Hussain Khan, Printed and Published by him on behalf of Vastitude media pvt ltd. Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP. 522237. Printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18